www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 314 | బుధవారం | 15-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## బస్సులో అగ్నిప్రమాదం

**20 మంది సజీవ దహనం**

మరో 16 మందికి తీవ్ర గాయాలు

రాజస్థాన్‌లోని జైసల్మేర్-జోధ్‌పూర్ హైవేలో ఘటన

05



# బనకచర్లను ఒప్పుకోం

- సిడబ్ల్యుసికి ఖరాకండిగా తేల్చి చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం
- ఎపి ప్రభుత్వం ప్రాజెక్టు సర్వే కోసం విడుదల చేసిన కొత్త టెండర్ నోటిఫికేషన్ రద్దుచేయాలని లేఖ
- కృష్ణా జలాల విషయంలో రాజీపడబోమని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణానదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని తెలంగాణ ప్రభుత్వం ఖరాకండిగా చెప్పింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి, సర్వేకు కొత్త టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. తాజాగా వెలువడిన టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి (సిడబ్ల్యుసి) మంగళవారం లేఖ రాసింది. ఈ విషయంలో రాజీపడబోమని ప్రభుత్వం లేఖలో ప్రభుత్వం పేర్కొంది. పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోన్న విషయం తెలిసిందేనని, గతంలో కూడా ఈ విషయాన్ని పేర్కొన్నామని లేఖలో రాశారు. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో ఎపి ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని, బనకచర్ల టెండర్, సర్వే నిలిపివేయాలని లేఖలో విజ్ఞప్తి చేసింది. ఎట్టి పరిస్థితుల్లో పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును ఆమోదించవద్దని తెలంగాణ ప్రభుత్వం సిడబ్ల్యుసిని కోరింది. పోలవరం డిపిఆర్‌కు విరుద్ధంగా ఈ టెండర్ ఉందని తెలంగాణ ఆరోపించింది. 'బనకచర్లపై కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను తెలంగాణ మంత్రులు స్వయంగా కలిసి లిఖితపూర్వకంగా గతంలోనే తెలంగాణ అభ్యంతరాలు తెలిపాం' అని లేఖలో పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై తాము ట్రిబ్యునల్ ఎదుట సమర్థంగా వాదనలు కూడా వినిపించామన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా బచనచర్ల ప్రాజెక్ట్‌పై టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయడం విడ్డూరంగా ఉందని లేఖలో పేర్కొన్నారు.

### నీటిపారుదల శాఖలో
## 106 మంది ఇంజనీర్లు బదిలీ
### హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికి స్థానచలనం

నీటి పారుదల శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేశారు. ఇందులో హైదరాబాద్ సర్కిల్ పరిధిలో 60 మందికి పైగా ఇంజినీర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చెరువులు, కుంటల్లో నిర్మాణ సంస్థలకు ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల కోసం ఎన్‌ఒసిల జారీ విషయంలో వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కాగా బదిలీ అయిన ఇంజినీర్లలో ఇఇలు, డిఇఇలు, ఎఇఇలు ఉన్నారు.

# అజ్ఞాతానికి తెర

## మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు

- 60 మంది సహచరులతో జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు నేత
- భద్రాచలంలోనూ ఆయుధాలు వీడిన ఆరుగురు నక్సల్స్



ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం

దశాబ్దాల అజ్ఞాత చరిత్రకు తెర పడింది. 40 సంవత్సరాల క్రితం ఎత్తిన తుపాకీ పోలీసుల ఎదుట దించక తప్పలేదు. మావోయిస్టు పార్టీ పక్షాన వివిధ బాధ్యతలు నిర్వహించిన మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ @ సోను, @ భూపతి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సోమవారం అర్ధరాత్రే ఆయన పోలీసులకు లొంగిపోయినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో లొంగుబాటు సభ ఏర్పాటు చేసి అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అజ్ఞాత జీవితంలో పార్టీలో వివిధ బాధ్యతలను నిర్వర్తించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇప్పటి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మల్లోజుల మధురమ్మ, వెంకటయ్యలకు జన్మించాడు. పెద్దన్న అంజన్న పౌరోహిత్యం నిర్వహిస్తుండగా రెండవ వాడైన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ మావోయిస్టు అగ్రనేతగా పని చేశాడు. 2011 నవంబర్ 24న పశ్చిమ బెంగాల్‌లో జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో కిషన్‌జీ మృతిచెందగా ఆయన భార్య ఇటీవల లొంగిపోయినట్లు తెలుస్తుంది. వేణుగోపాల్ మావోయిస్టు పార్టీలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర కమిటీలో అత్యున్నత స్థానంలో పనిచేసిన ఆయన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర బోర్డర్‌లో పలు కీలక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు సాయుధ బలగాల శిక్షణ, పార్టీ సాహిత్యం, వ్యూహాత్మక దాడులకు రూపకల్పన చేయడంలో సిద్ధ హస్తుడిగా పేరుంది. 10 ఏప్రిల్ 2010న దంతెవాడ జిల్లాలో 70 మంది పోలీసులను హతమార్చిన ఘటనకు మల్లోజుల నేతృత్వంవహించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. వేణుగోపాల్ సతీమణి తారా 2018లో పోలీసుల ఎదుట లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న సమయంలో తరువాయి 2లో






### బిసి కోటాపై సుప్రీంలో
## న్యాయం జరుగుతుంది

- హైకోర్టు ఇచ్చిన స్టేను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాం
- రేపు విచారణకు వచ్చే అవకాశం
- వెనుకబడిన తరగతులకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది
- పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ఈ అంశంపై సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పి) దాఖలు చేసిందని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒ9ని యదాతథంగా అమలు చేయాలనేది ఆలోచన అని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం 40 పేజీలతో స్పెషల్ లీవ్ పిటిషన్‌ను వేసిందని, అది గురువారం సుప్రీంకోర్టులో తరువాయి 12లో

# పోలీసులకు.. కోరిన సమాచారమివ్వండి

- 'ఐ క్లౌడ్' అకౌంట్ పాస్‌వర్డ్ అందజేయాలి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు 'సుప్రీం' ఆదేశం
- దర్యాప్తుకు సహకరించేందుకు బలవంతపు చర్యల నుంచి రావుకు 'మధ్యంతర రక్షణ'ను పొడిగింపు
- నవంబర్ 18కు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌బిఐ) పూర్వ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రాష్ట్ర పోలీసులకు తన 'ఐ క్లౌడ్' అకౌంట్ పాస్‌వర్డ్‌ను సమర్పించాలని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రభాకర్‌రావు ఆయన దర్యాప్తు అధికారి ముందు హాజరుకావడానికి, దర్యాప్తులో సహకరించడానికి బలవంతపు చర్యల నుండి రక్షణను కూడా పొడిగించింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ప్రభాకర్‌రావు సహాయనిరాకరణ కారణంగా దర్యాప్తు ముందుకు సాగడం లేదని, కోర్టు రక్షణ ఉత్తర్వుల కింద కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఫార్మేట్ చేశాడని, కీలకమైన అనేక ఆధారాలను నాశనం చేశాడని ధర్మాసనం ముందు ఆరోపించారు. 'అతడు కేవలం రాజకీయ నాయకుల ఫోన్లనే కాకుండా, ముఖ్యమైన ఫోన్లను కూడా ట్యాప్ చేస్తున్నాడు. ముందస్తు బెయిల్ దాఖలు చేసిన తర్వాత అతడు ఆ పరికరాన్ని తరువాయి 2లో

# సిపిఐ వందేళ్ల చరిత్ర విస్తృతంగా ప్రచారం

- శతవసంతాల ఉత్సవాల ముగింపు సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు
- ఖమ్మం బహిరంగసభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మైలురాయిగా నిలిచిపోనున్నదని వ్యాఖ్య





ప్రజాపక్షం/ ఖమ్మం

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే చారిత్రక సభకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం బహిరంగ సభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోనున్నదని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షవహించిన ఈ సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీకి ఒక ప్రత్యేక స్థానం ఉందని స్వాతంత్ర్య ఉద్యమ సందర్భంగా సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశపు నడిబొడ్డున స్వతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాం రాజరికాన్ని కూలదోసి రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు మహత్తర తెలంగాణ తరువాయి 2లో

### అఖిలపక్ష పార్టీలను ప్రభుత్వం
## ఢిల్లీకి తీసుకెళ్లాలి
### కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఆమోదించాలి

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, ఇప్పటికైనా బిసిల రిజర్వేషన్ కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ కోసం కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చేందుకు రాష్ట్రంలోని అఖిలపక్ష పార్టీలను రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన కోరారు. శాసనసభ సాక్షిగా బిజెపి శాసనసభ్యులు తరువాయి 12లో



### పసిడి ధరలు
## పైపైకి

ఒక్కరోజే తులానికి రూ.3 వేలు జంప్

రూ.1.30 లక్షలు దాటిన 10 గ్రాముల ధర

**ముంబయి :** సామాన్యులను ఊరిస్తున్న బంగారం.. సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం తరువాయి 12లో

### గ్రూప్-2 అభ్యర్థులకు
## 18న నియామక పత్రాలు

783 మందికి శిల్పకళావేదికలో అందజేయనున్న సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్–2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్ 2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సిఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నియామకాల్లో సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అభ్యర్థులే అధికంగా ఉన్నందున, రెవెన్యూ, హోమ్, జిఎడి కార్యదర్శులు కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సిఎస్ ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రానున్న 30 ఏళ్ల పాటు సర్వీస్‌లో ఉంటారు కాబట్టి వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిజిపి శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, తరువాయి 2లో



### ప్రైవేటు బ్యాంకులన్నింటినీ
## జాతీయాకరణ చేయాలి

- ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్
- కరూర్ వైశ్యాబ్యాంక్ డివిజినల్ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగుల సామూహిక ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ ఆర్థికాభివృద్ధికి, జాతీయ సంపద, ప్రజాధనం పరిరక్షణ కోసం ప్రైవేటు బ్యాంకులన్నింటినీ జాతీయాకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలను కాపాడేందుకు తరువాయి 2లో

### బాధ్యులైన అధికారులపై
## వెంటనే చర్యలు

- ప్రధాని మోదీ, హర్యానా సిఎంలకు రాహుల్‌గాంధీ డిమాండ్
- పూరణ్‌కుమార్ ఆత్మహత్య దళితుల గౌరవానికి సంబంధించినదని వ్యాఖ్య
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రతిపక్షనేత



**చండీగఢ్ :** హర్యానా పోలీసు అధికారి వై. పూరణ్ కుమార్ ఆత్మహత్యకు బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పూరణ్ ఆత్మహత్యకు దళితుల గౌరవానికి సంబంధించినదని, బాధ్యులైన వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని వెంటనే చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత వారం చండీగఢ్‌లోని తన ఇంట్లో తుపాకీ కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సీనియర్ పోలీసు అధికారి కుటుంబాన్ని మంగళవారం రాహుల్ గాంధీ పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పూరణ్ కుమార్‌ను తరువాయి 2లో

**పూరణ్ కుమార్ కేసు దర్యాప్తు అధికారి ఆత్మహత్య** 05



# ప్రపంచం
WORLD NEWS

## వ్యక్తికి జపాన్ కోర్టు ఉరిశిక్ష

**టోక్యో:** రెండేళ్లక్రితం జపాన్‌లో కలకలం సృష్టించిన కాల్పులు, కత్తిపోట్ల కేసులో మసహిరో అయోకి (34) అనే వ్యక్తికి న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. జపాన్‌లో ఇలాంటి తీర్పులు అసాధారణం. నకోనాలో 2023లో ఒక వ్యక్తి ఇద్దరు పోలీసులను కాల్చి చంపాడు. మరో ఇద్దరిని కత్తితో పొడిచి చంపాడు. ఐతే సదరు వ్యక్తి స్కిజోఫ్రెనియాతో బాధపడుతున్నాడని అతడి తరఫున న్యాయవాదులు కోర్టులో వాదించినప్పటికీ ఫలితం లేకపోయింది. చాలా పగడ్బందీగా నేరస్థుడు కాల్పులకు పాల్పడ్డాడని న్యాయస్థానం విశ్వసించింది. రోడ్డుమీద వెళుతున్న మహిళలను కత్తితో పొడవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కానీ అతగాడు తుపాకీతో ఇద్దరు పోలీసులను కూడా కాల్చి చంపాడు. జపాన్‌లో 30 ఏళ్లక్రితం ఎప్పుడో ఇలాంటి ఘటన జరిగింది తప్ప ఆ దేశంలో గన్ కల్చర్ లేదు.



## బంగ్లాదేశ్‌లో 238కి పెరిగిన డెంగీ మృతులు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో కొద్ది నెలలుగా విజృంభించిన డెంగీ వ్యాధి మరింతగా విస్తరిస్తోంది. తాజాగా గడచిన 24 గంటల్లో డెంగీ వల్ల మరో ఐదుగురు మరణించారు. 841 మంది కొత్తగా ఆసుపత్రులలో చేరారు. ఈ కొత్త మరణాలతో దేశంలో ఈ ఏడాది ఇప్పటివరకూ డెంగ్యూ వల్ల మరణించినవారి సంఖ్య 238కి పెరిగింది. మొత్తం కేసుల సంఖ్య 56,257 కు పెరిగింది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ కార్యాలయం మంగళవారం ఈ విషయం వెల్లడించింది. మరోవైపు డెంగీ బారిన పడి చికిత్స తీసుకున్న 53,354 మందిని ఆసుపత్రుల నుండి తిరిగి ఇళ్ళకు పంపినట్లు కూడా తెలియజేసింది. దేశవ్యాప్తంగా 2,665 మంది ఆసుపత్రుల్లో చేరి ఇంకా చికిత్సలు పొందుతున్నారు.

## పేలుడులో 9 మంది కార్మికులు మృతి

ఇదిలా ఉండగా, ఢాకా రూపానగర్ ఏరియాలో ఉన్న కెమికల్ గోడౌనులో మంగళవారం పెద్ద పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిదిమంది కార్మికులు మరణించారు. 12 అగ్నిమాపక దళ బృందాలు మంటలను అదుపు చేసేందుకు కృషి చేస్తున్నాయి. షియాలెజి ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఉదయం మంటలు చెలరేగాయని అగ్నిమాపకదళాధికారి తల్హాబిన్ జాసిమ్ చెప్పారు. ఆలస్యంగా తమకు సమాచారం అందిందని ఆయన అన్నారు.



# రఫా సరిహద్దు తెరిచేదే లేదు

- ఇజ్రాయెల్ మంకుపట్టు
- గాజాలో శాంతి నిలబడుతుందా?
- భయాలమధ్య శిథిలాల తొలగింపు ప్రారంభం

**గాజా:** ట్రంప్ కుదిర్చిన శాంతి ఒప్పందంలో భాగంగా రఫా క్రాసింగ్‌ను తెరిచేదే లేదని ఇజ్రాయెల్ మంకుపట్టు పట్టింది. సహాయ బృందాలు, మానవతా సహాయం, ఆహార సరఫరా లారీల రాకపోకలకు వీలుగా రఫా క్రాసింగ్‌ను నిర్ణీత ప్రకారం బుధవారం తెరవాల్సి ఉంది. 28 మంది బందీల మృతదేహాలను హమాస్ స్వాధీనం చేయాల్సి ఉండగా, కేవలం నాలుగు మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేయడంతో బాధిత కుటుంబాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీంతో ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రెవిధంగా స్పందించింది. గాజాలోకి సహాయాన్ని పరిమితంగానే వదులుతామని ప్రకటించింది. గాజాలో తాజాగా నెలకున్న ఈ శాంతి స్థిరమైనదేనా? ఇది శాశ్వతమేనా? అని పాలస్తీనా ప్రజలు ఇంకా భయాందోళనల్లోనే ఉన్నారు. ఐతే లక్షలాది ప్రజలు గాజా స్ట్రిప్‌కు తిరిగి చేరుకుంటున్నారు. రెండేళ్ల యుద్ధం కారణంగా 20 లక్షలమంది జనాభాలో గాజాలో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు. లక్షల భవనాలు, ఇళ్ళు నేలమట్టమయ్యాయి. యూరోపియన్ యూనియన్ స్పేస్ ఏజన్సీ ఈనెల రెండో తేదీన విడుదల చేసిన చిత్రాల ప్రకారం గాజాలో 1.99 లక్షల భవనాలు,ఇళ్ళు నేలమట్టమయ్యాయి. ఇంతభారీస్థాయిలో జరిగిన ఈ నష్టాన్నిబట్టి పునర్నిర్మాణానికి 50 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని నగర నిపుణుడు ఫిలిప్ బౌవెరాట్ చెప్పారు. ఐదురోజులక్రితం శాంతి ఒప్పందం ప్రకటన వెలువడిన



తర్వాత గాజాలో కేరింతలు, ఆనందోత్సాహాలు వెల్లివిరిసినప్పటికీ, ఇప్పుడు అస్థిరత, అధికార శూన్యత ఆవరించుకుంది. ట్రంప్ ప్రకటించిన 20 అంశాల ప్రణాళిక ప్రకారం హమాస్ ఆయుధాలను వదిలిపెట్టాల్సి ఉంది. పాలస్తీనా అథారిటీకి అధికారాన్ని స్వాధీనం చేసేవరకూ తాత్కాలికంగా ''బోర్డ్ ఆఫ్ పీస్''ను ట్రంప్ ప్రకటించారు. ఈ బోర్డు తాత్కాలికంగా పర్యవేక్షణ మాత్రమే చేస్తుంది. ఇప్పటికే ఈ ఐదురోజుల్లో హమాస్ దళాలు స్థానికంగా ఉన్న శక్తిమంతమైన డాగ్ముష్ తెగ కుటుంబాలపై కాల్పులు జరిపింది. 19 మందిని హతమార్చాయి. గాజాలో తిరిగి గిరిజన తెగలమధ్య ఘర్షణలు, ఆధిపత్యపోరు ప్రారంభం అవుతుందని భయపడుతున్నారు. 20 మంది బందీలు విడుదలయ్యారు. ఇజ్రాయెల్ జైళ్ళనుండి దాదాపు 2000 మంది ఖైదీలు విడుదలయ్యారు. 60 ఏళ్ళు పైబడిన వృద్ధులు 30 మంది, టీనేజర్లు ఆరుగురు, మహిళలు ఇద్దరు ఇజ్రాయెల్ జైళ్ళనుండి బయటపడిన వారిలో ఉన్నారు. 28 మంది బందీల మృతదేహాలను స్వాధీనం చేయాల్సి ఉండగా, కేవలం నాలుగు మృతదేహాలను మాత్రమే హమాస్ స్వాధీనం చేయడంతో బాధిత కుటుంబాల్లో ఆగ్రహం వ్యక్తమవుతుండగా యుద్ధ లక్ష్యాలను సాధించామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. కానీ సంక్లిష్టమైన ప్రశ్నలు ఇంకా మిగిలిపోయాయి. తదుపరి ఏం జరుగుతుంది? అనే అనిశ్చితి సర్వత్రా వ్యాప్తిచెందింది. తదుపరి ట్రంప్ సారథ్యంలో పరిపాలన జరుగుతుందన్నది ఒప్పందంలోని అంశం. కానీ హమాస్ ఆయుధాలు వదిలిపెడుతుందా? హమాస్ ప్రమేయం లేని గాజా పరిపాలన సాధ్యమేనా? అనే విషయాలు ఇంకా తేలలేదు. వీటిపై తదుపరి ఇంకా చర్చలు జరగాల్సి ఉందని ట్రంప్ స్వయంగా చెప్పారు. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తించేదిలేదని మరోవైపు నెతన్యాహూ చెబుతున్నారు. ఆయుధాలను హమాస్ వదిలిపెట్టకపోతే మళ్లీ దాడులు ప్రారంభిస్తామని ఇజ్రాయెల్ హెచ్చరిస్తోంది. ఇజ్రాయెల్ ప్రజల్లో ఇంకా భయాలు రేకెత్తిస్తున్నాయి. ఈ పరిస్థితులమధ్య తవ్వోడ యంత్రాలు గాజా సిటీలో శిథిలాలను తొలగించే ప్రక్రియ ప్రారంభించాయి. దాదాపు 80 శాతం నివాసాలు నేలమట్టం అయ్యాయని ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. ధ్వంసమైన గాజాను పునర్నిర్మించుకోవడానికి గాజా పాలస్తీనియన్లకు అంతర్జాతీయ సహాయం అవసరం అని, లేకపోతే పునర్నిర్మాణం ఇప్పట్లో అసాధ్యమని నిపుణులు మరోవైపు చెబుతున్నారు.

# గాజా పునర్నిర్మాణం ప్రారంభం : ట్రంప్

### ట్రంప్‌కు ఈజిప్టు 'నైల్' పురస్కారం



**షర్మ్–ఎల్–షేక్:** గాజాలో పునర్నిర్మాణం ప్రా రంభం అవుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. అబ్రహాం ఒప్పందాల కు అందరూ సమ్మతి తెలియజేయాలని, అంద రూ కలిసి రావాలని ప్రపంచదేశాలను కోరా రు. కానీ ఇరాన్ ఇప్పటికే ఇందుకు తిరస్కరించింది. ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి సోమవారం సాయంత్రం ప్రసంగించిన తర్వాత ఆయన నేరుగా ఈజిప్టు వెళ్ళి 20 దేశాల నాయకులు పాల్గొన్న ''గాజా శాంతి ఒప్పంద శిఖరాగ్ర సదస్సు''కు హాజరయ్యారు. శాంతి ఒప్పందం పై నాయకులందరితో కలిసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గాజాలో పునర్నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఒక అందమైన, సరికొత్త ఉషోదయం ఈనాడు (సోమవారం) సంభవించింది, పశ్చిమ ఆసియాలో ప్రాంతీయ నాయకులు అందరూ ఎంతగానో సహకరించారు, అం దరికీ నా కృతజ్ఞతలు అని ట్రంప్ అన్నారు. ఇప్పుడు అందరూ చాలా సంతోషంగా ఉన్నారనీ, ఇది చాలా పెద్ద ఒప్పందమనీ, ఈ ఒప్పందం ఒక రాకెట్ వేగంతో శరవేగంగా ప్రయాణించి పరిణామాలను తీసుకువచ్చిందన్నారు. ఈ సదస్సుకు ట్రంప్‌తోపాటు ఈజిప్టు దేశాధ్యక్షుడు అబ్దుల్ ఫతా అల్–సిసి కూడా అధ్యక్షత వహించారు. పాలస్తీనా అథారిటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌తోపా టు ఇరవై అరబ్, ముస్లిం దేశాల నాయకులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్–సిసి ఈజిప్టులో అత్యున్నతమైన ''నైల్ పురస్కారాన్ని ట్రంప్‌కు ఇచ్చి ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్వచ్ఛమైన మేలిమి బంగారంతో తయారు చేసిన ఒక నెక్లెస్‌ను కూడా ట్రంప్‌కు అలకరించి సత్కరించారు. ఇది ఈజిప్టులో ఇచ్చే అత్యున్నతమైన పురస్కారం. అత్యంత బాధాకరమై న, విషాదకరమైన అధ్యాయానికి అక్టోబరు 13వ తేదీన తెరపడిందని ఈ సందర్భంగా అల్–సిసి అన్నారు. ఇది చరిత్రలో ఒక మైలురాయి ఘట్టమన్నారు. ట్రంప్ రూపొందించిన 20 అంశాల ప్రణాళిక పశ్చిమాసియాలో శాంతి సాధనకు చివరి అవకాశమని కూడా ఆయన అన్నారు. పాలస్తీనా–ఇజ్రాయెల్ రెం డూ ఇరుగు పొరుగు దేశాలుగా సహజీవనం చేయడం ఒక్కటే శాశ్వత పరిష్కారమని ఆయన పునరుద్ఘాటించారు. ఇదిలా ఉండగా,బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ కూడా పార్లమెంటులో మాట్లాడుతూ, గాజా శాంతిని కాపాడటం కష్టమైన విషయం కాదని, కానీ ఇదంతా చిన్న సవాలు కూడా కాదన్నారు. అనేక నెలలుగా ఈ సమస్య పరిష్కారం కోసం బ్రిటన్ ప్రభుత్వం తెరవెనుక కృషి చేస్తోందని, ఈ ఒప్పందం కుదిరినందుకు గర్వకారణంగా ఉందని స్టార్‌మర్ అన్నారు.

## వెంటనే చర్యలు
(మొదటి పేజీ తరువాయి)

నిరాశపరిచేందుకు, ఆయన కెరీర్‌ను దెబ్బతీసేందుకు క్రమబద్ధమైన వివక్ష చూపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి డిజిపి శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై పంపిన కొన్ని గంటల తర్వాత రాహుల్‌గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకు మందు ప్రభుత్వం రోహ్‌తక్ మాజీ పోలీసు సూపరింటెండెంట్ నరేంద్ర బిజర్నియాను బదిలీ చేసింది. పూరణ్ కుమార్ వదిలిపెట్టినట్లు చెప్పబడుతున్న సూసైడ్ నోట్‌లో పేర్కొన్న ఎనిమిది మంది సీనియర్ అధికారులలో ఈ ఇద్దరూ ఉన్నారు. ఈ ఇద్దరు అధికారులు స్పష్టమైన కుల ఆధారిత వివక్ష, లక్ష్యంగా చేసుకున్న మానసిక వేధింపులు, బహిరంగ అవమానం, దౌర్జన్యాలు చేశారని పూరణ్ కుమార్ ఆరోపించారు. కుమార్ భార్య, హర్యానా సీనియర్ అధికారి అమ్నీత్ పి కుమార్, ఆయన ఇద్దరు కుమార్తెలు, కుటుంబ సభ్యులను కలవడానికి ఉదయం చండీగఢ్‌కు చేరుకున్న రాహుల్ గాంధీ, అంత్యక్రియలు నిర్వహించాలని ఒత్తిడి చేశారు. 'ప్రధానమంత్రికి, హర్యానా ముఖ్యమంత్రికి ప్రతిపక్ష నాయకుడుగా నా సందేశం ఏమిటంటే... మీరు ఈ ఇద్దరు కుమార్తెలకు ఇచ్చిన హామీని నెరవేర్చండి, వారి తండ్రి అంత్యక్రియలు జరగనివ్వండి, ఈ 'తమాషా'ను ఆపండి' అని హితవు పలికారు. పూరణ్ కుటుంబం ఇంకా ఆయన శవపరీక్షకు అనుమతించని విషయం తెలసిందే. నోట్‌లో పేర్కొన్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. పూరణ్ కేసుపై స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని హామీనిచ్చారని, ఆ హామీని కూడా సైనీ నెరవేర్చలేదని కూడా ఆయన ఆరోపించారు. పూరణ్ కుటుంబంతో దాదాపు గంటసేపు గడిపిన మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఈ సమస్య 10 రోజులు లేదా 15 రోజులకు సంబంధించినది కాదని స్పష్టం చేశారు. చాలా సంవత్సరాలుగా, ఈ అధికారిని నిరాశపరిచేందుకు, అతని కెరీర్‌ను, ప్రతిష్టను దెబ్బ తీసేందుకు క్రమబద్ధమైన వివక్ష జరుగుతోందన్నారు. ఇది ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదని, ప్రతి దళిత సోదరుడు, సోదరి గౌరవానికి సంబంధించినదని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'దేశంలోని కోట్లాది మంది దళిత సోదరులు, సోదరీమణులకు తప్పుడు సందేశం వెళుతోంది... మీరు ఎంత విజయవంతమైనవారైనా, తెలివైనవారైనా లేదా సమర్థులైనా, మీరు దళితుడైతే, మిమ్మల్ని అణచివేయవచ్చు, నలిపివేయవచ్చు, విసిరివేయవచ్చు. ఇది మాకు ఆమోదయోగ్యం కాదు' అని గాంధీ అన్నారు. పూరణ్ కుమార్ కెరీర్‌ను అంతం చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, తద్వారా అతను తన జీవితాన్ని ముగించాల్సి వచ్చిందని ఆయన అన్నారు. కుమార్ ఆత్మహత్య సమాజం, వ్యవస్థ మనస్సాక్షిని కదిలించే విషాదమని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వై పూరణ్ కుమార్ జీ భార్య తన భర్త అంత్యక్రియలు గౌరవంగా నిర్వహించడానికి వారం రోజులుగా వేచి ఉండటం కంటే బాధాకరమైన విషయం ఏముంటుందని ప్రశ్నించారు. ఆమె, వారి పిల్లలు, వారి బాధను అనుభవించగల మొత్తం దళిత సమాజం మానసిక వేదనను అనుభవిస్తోందని, దాని గురించి ఆలోచించడం బాధాకరమన్నారు. ఢిల్లీ నుండి హర్యానా ప్రభుత్వాన్ని నడుపుతున్న నరేంద్ర మోదీ రాతి హృదయుడని, అతని పాలనలో ఈ క్రూరమైన అణచివేత జరుగుతున్నందున అతని హృదయం కరగదని మండిపడ్డారు. రోజులు గడుస్తున్నా, నిందితులను ఇప్పటికీ అరెస్టు లేదని, ఇది స్పష్టంగా అన్యాయమేనని రాహుల్‌గాంధీ అన్నారు.

## అజ్ఞాతానికి తెర
(మొదటి పేజీ తరువాయి)

మల్లోజుల లొంగిపోవడం దేశ వ్యాప్తంగా చర్చకు దారితీసింది. గత కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఒక్కొక్కరిగా ప్రాణాలు కోల్పోతున్న మావోయిస్టు అగ్ర నాయకత్వం 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ప్రకటనల నేపథ్యంలో ఇటీవల వేణుగోపాల్ అభయ్ పేరుతో సంచలనాత్మక లేఖలను విడుదల చేశారు. ఇటీవల కేంద్ర కార్యదర్శిగా పనిచేసి ఎన్‌కౌంటర్‌లో మరణించిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు సైతం మావోయిస్టు ఉద్యమం నడపడం కష్టమని ఆయుధాలు వదిలి లొంగిపోవాలని కోరుకున్నారని లేఖలో పేర్కొన్న మల్లోజుల మావోయిస్టు ఉద్యమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయుధాలను వదిలి ఉద్యమ విరమణ చేయాలని బహిరంగ లేఖను విడుదల చేశారు. దీనికి ప్రతిగ మావోయిస్టు పార్టీ అది మల్లోజుల వేణుగోపాల్ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని ఇందులో పార్టీ అభిప్రాయం లేదని జగన్ పేరిట పార్టీ ఒక లేఖను విడుదల చేసింది. ఈ పరిస్థితిలో మావోయిస్టు పార్టీలో మరోక చీలిక తప్పదా అన్న చర్చ కూడా సాగింది. అయితే మల్లోజుల దగ్గర ఉన్న ఆయుధాలను అప్పగించాలని లేదంటే దాడి చేసి తీసుకుంటామని కూడా పార్టీ పక్షాన ఆ లేఖలో హెచ్చరించారు. మల్లోజుల తన 60 మంది అనుచరులతో లొంగిపోగా అందులో కేంద్ర కమిటీ సభ్యుడు వాసుదేవరావు, 10 డివిజన్ల కార్యదర్శులు ఉన్నట్లు తెలుస్తుంది. మొత్తంగా మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు సాయుధ ఉద్యమంలో మరో కీలక ఘట్టంగా చెబుతున్నారు. లొంగుబాటు తర్వాత పరిణామాలు ఏమిటి వేణుగోపాల్ బాటను ఎంత మంది అనుసరించనున్నారు. పోలీస్ చర్యలు తదితర విషయాలపై మావోయిస్టు ఉద్యమ భవితవ్యం ఆధారపడి ఉంది.

**భద్రాచలంలోనూ మావోయిస్టుల లొంగుబాటు**

పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతలో భాగంగా మంగళవారం ఎస్పీ రోహిత్ రాజ్ ఎదుటు నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఓ మహిళా సభ్యురాలితో పాటు ఆరుగులు మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కుంజామ్ పాపారావు అలియాస్ దినేష్, లఖ్మం బండి అలియాస్ శాంతి, మడివి కోసా అలియాస్ భీమా, పద్దం లక్మ అలియాస్ గుడ్డి, మడివి లక్మ అలియాస్ భీమా, దొడ్డి భద్రు అలియాస్ నందు లు ఉన్నారు. వీరిలో ఒక్కక్కరికి తక్షణ సహాయం క్రింద రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.1.50 లక్షల చెక్కులను అందజేశారు. వారి వారి క్యాడర్లను బట్టి వారి తలలపై ఉన్న రివార్డులను అందించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మావోయిస్టుల సిద్ధాంతాలపై నమ్మకం లేక అనేక మంది జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ హోదాల్లో ఉన్న 326 మంది అజ్ఞాతాన్ని వీడారని చెప్పారు. మిగతా వారు కూడా ప్రభుత్వం అందిస్తున్న చేయూతను అందుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఎస్పీ సూచించారు.

## నిషేధిత జాబితాలో కాళేశ్వరం ఇంజనీర్ల ఆస్తులు

### ముగ్గురి ఆస్తుల విలువ సుమారు రూ.400 కోట్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం లిఫ్ట్ ఇగిరేషన్ నిర్మాణంలో భాగస్వాములైన ప్రభుత్వ ఇంజనీర్లకు మరో బిగ్ షాక్ తగిలింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇటీవలే ఎసిబి తనిఖీల్లో పట్టుబడిన మాజీ ఇఎన్‌సి హరిరాం, ఇఇ నూనె శ్రీధర్, మాజీ ఇఎన్‌సి మురళీధర్ ఆస్తులను విజిలెన్స్ వింగ్ నిషేధిత జాబితాలో చేర్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.400 కోట్ల పైచిలుకే ఉటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, ప్రస్తుతం వారు బెయ్ని ఉండటంతో కోర్టులో కేసు తేలే వరకు ఆస్తుల విషయంలో ఎలాంటి క్రయవిక్రయాలు జరపకుండా వారి ఆస్తులను విజిలెన్స్ వింగ్ నిషేధిత జాబితాలో చేర్చడం హాట్ టాపిక్గా మారింది. కాగా, ఈ ఏడాది కాళేశ్వరం కార్యనిర్వాహక ఇంజినీరు నూనె శ్రీధర్ ఇళ్లు, బంధువుల ఇళ్లపై ఎసిబి దాడులు నిర్వహించగా కళ్లు చెదిరే అక్రమాస్తులు స్వాధీనమైన విషయం తెలిసిందే. నీటి పారుదల శాఖలో ఏఈఈగా చేరిన నూనె శ్రీధర్ జూన్లో అరెస్టయ్యే నాటికి ఈఈగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎక్కువ కాలం కాళేశ్వరం ప్రాజెక్టులోనే పని చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించిన ఎసిబి.. శ్రీధర్, ఆయన భార్య, కుమారుడు, కుమార్తె, బినామీల పేరు మీద మొత్తం రూ.110 కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టినట్లుగా గుర్తించారు. ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకంతో పాటు రీడిజైనింగ్ అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో చీఫ్ ఇంజినీరుగా కీలక పాత్ర పోషించిన భూక్యా హరిరాంను ఈ ఏడాది మేలో ఎసిబి అరెస్టు చేసింది. ఆ సమయంలో ఆయన గజ్వేల్ ఈఎన్సీగా, కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి నిధులు సమకూర్చిన కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్కు ఎండీగా ఉన్నారు. హరిరాం అరెస్టు అనంతరం నీటిపారుదల శాఖ ఆయనను సస్పెండ్ చేసింది. ఇక నీటి పారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేసి రిటైర్ అయిన చీటి మురళీధర్‌పై ఈ ఏడాది జులైలో ఎసిబి దాడులు చేసిన విషయం తెలిసిందే. ఆదాయానికి మించి ఆస్తులను గుర్తించి అరెస్టు చేసింది. పట్టుబడిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం రూ.100 కోట్లకుపైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

## సమాచారమివ్వండి
(మొదటి పేజీ తరువాయి)

రూపొందించాడు. ఇది అత్యంత మంచిదైన కొత్త పరికరం. అది నా అభిప్రాయం కాదు. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ఈ విషయాన్ని చెబుతోంది. అతను 15హార్డ్ డిస్క్‌లు కొనుగోలు చేసినందున బ్యాకప్ ఉన్నది మా కేసు. కానీ అతడు తనవద్ద ఏమీలేదని చెబుతున్నాడు. ఈ కోర్టు తాత్కాలిక రక్షణ యొక్క రక్షణ గొడుగు వల్లే మాకు అతడు ఏమీ సహకరించడం లేదు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు చెప్పారు. టి.ప్రభాకర్‌రావు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది డి.ఎస్.నాయుడు ఈ ఆరోపణలను అన్నింటినీ తీవ్రంగా ఖండించారు. ప్రభాకర్‌రావు దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నాడని తెలియజేశారు. ఈ విచారణ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనదని ఆరోపిస్తూ బయటి వారు, రాజకీయనాయకులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు' విచారణ సమయంలో ప్రశ్నించేందుకు వారికి అనుమతిస్తున్నారని కోర్టుకు విన్నవించారు. దీనిపై జస్టిస్ నాగరత్నమ్మ స్పందిస్తూ , అది 'తమాషా' కాకూడదు'. పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు లోపలకు వచ్చి ఎలా ఇంటరాగేట్ చేయగలరు?. వారు ఏమీ ప్రేక్షకులుగా లేదా దర్యాప్తులో భాగంగా ఉండలేరు' అని వ్యాఖ్యానించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రభాకర్ రావు తరపు న్యాయవాది డి.ఎస్.నాయుడు ఆరోపణలను కొట్టిపారేశారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను నవంబర్ 18కు వాయిదా వేసింది. మే 29న అత్యున్నత న్యాయస్థానం బలవంతపు చర్య నుంచి రావుకు మధ్యంతర రక్షణ కల్పించింది. పాస్‌పోర్ట్ అందిన మూడు రోజుల్లో భారతదేశానికి తిరిగి వస్తానని హామీ ఇవ్వాలని ప్రభాకర్‌రావును ఆదేశించింది. ముందస్తు బెయిల్ కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రభాకర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైదరాబాద్ కోర్టు మే 22న ప్రభాకర్‌రావుపై ప్రకటన ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వు ప్రకారం ప్రభాకర్‌రావు జూన్ 20లోపు ప్రభాకర్‌రావు కోర్టు ముందు హాజరుకాలేకపోతే ఆయనను 'ప్రకటిత నేరస్థుడిగా' ప్రకటించవచ్చు. ఒక వ్యక్తిని 'పకటిత నేరస్థుడిగా' ప్రకటించినట్లయితే ఆ నిందితుడి ఆస్తులను జప్తు చేయాలని కోర్టు ఆదేశించగలిగే అధికారాన్ని కలిగి ఉంటుంది. గత భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పాలనలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల నుండి నిఘా సమాచారాన్ని సేకరించారనే ఆరోపణలపై మార్చి 2024 నుండి హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన నలుగురు పోలీస్ అధికారులలో ఒకరు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) నుండి సస్పెండ్ అయిన డిఎస్‌పి ఉన్నారు. తర్వాత వారికి బెయిల్ మంజూరు చేయబడింది. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను నిఘాలో ఉంచడం ద్వారా రాజకీయ ప్రయోజనాల కోసం స్పెషళ్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) వనరులను దుర్వినియోగం చేసిన కుట్రలో ఈ నిందితులు భాగస్వాములని పోలీసులు తెలిపారు. ఈ కేసులో నిందితులుగా పేర్కొనబడిన వారు ఇతరులతో పాటు అనధికారికంగా నిందితులుగా ఉన్న అనేకమంది వ్యక్తుల ప్రొఫైల్‌లను అభివృద్ధి చేశారని, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడానికి వారి ఆదేశాల మేరకు ఎస్ఐబిలో రహస్యంగా, చట్టవిరుద్ధంగా వారిని పర్యవేక్షించారని గతంలో పోలీసులు తెలిపారు. వారినేరాలకు సంబంధించిన ఆధారాలు అదృశ్యం కావడానికి రికార్డులను నాశనం చేయడానికి కుట్ర పన్నారని కూడా పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే.

## జాతీయీకరణ చేయాలి
(మొదటి పేజీ తరువాయి)

స్వాతంత్ర్యం అనంతరం నాటి పాలకులు బ్యాంకులను జాతీయకరణ చేయగా, నేటి పాలకులు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ వారి బినామీలైన కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయల ప్రజా సంపదను దోచి పెడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్ యూనియన్స్ సెల్ (ఎఐబిఈఎ) ఇచ్చిన పిలుపు మేరకు ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు హైదరాబాద్ గన్‌ఫౌండ్రీ, చిరాగ్ అలీలేన్ లోని కరూర్ వైశ్యా బ్యాంక్ డివిజినల్ కార్యాలయం వద్ద బ్యాం కుల ఉద్యోగులు సామూహిక ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగుల ప్రదర్శనను ఉద్దేశించి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. మరోవైపు బ్యాంకులను ప్రైవేటీకరిస్తూ కొంత మంది కార్పొరేట్ శక్తులు, వ్యక్తుల చేతులకు అప్పగిస్తూ వేల కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలని, ఆ బ్యాంకులలో అవసరమైన మేరకు రెగ్యులర్ క్లరికల్, సబ్ స్టాఫ్ కేడర్‌ను నియమించాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఫెడరల్ బ్యాంకు లో ఉద్యోగులపై వేధింపులను ఆపాలని, సిఎస్‌బి బ్యాంక్‌లో సాధ్యమైనంత తొందరగా వేతన సవరణ చేయాలని, అన్ని ప్రైవేటు బ్యాంకులలోని పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా వర్తింపజేయాలని, నైనిటాల్ బ్యాంక్ విక్రయాన్ని వెంటనే నిలుపుదల చేసి దానిని బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబిఎ)ను కోరారు. ప్రైవేటు బ్యాంకులలో పనిచేస్తున్న సి టు సి ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబబద్దీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎపి, టిఎస్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి సమద్ ఖాన్, కార్యదర్శులు శైలేంద్ర, వినోద్, నల్లపు రెడ్డి, ప్రైవేట్ సెక్టార్ బ్యాంక్స్ యూనియన్ సెల్ ప్రధాన కార్యదర్శి మధుసుదన్, కరూర్ వైశ్యా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సాయి శంకర్, ఫెడరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, కర్ణాటక బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా ప్రచారం
(మొదటి పేజీ తరువాయి)

పోరాటాన్ని నిర్వహించింది కూడా కమ్యూనిస్టులేనని సాంబశివరావు తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల హక్కుల కోసం, సంక్షేమం కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించి పోరాట విజయాలను సాధించిందని, భూమి విలువలు గుర్తించి దున్నే వానికి భూమి దక్కాలని చారిత్రక పోరాటాలు నిర్వహించిందన్నారు. 100 పోరాట చరిత్రను, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో అత్యంత ఘనంగా నిర్వహించాలని సిపిఐ నిర్ణయించిందన్నారు. లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరు కానున్నారని సాంబశివరావు తెలిపారు. బహిరంగ సభ, ప్రదర్శనకు సంబంధించి గ్రామ గ్రామాన ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. బహిరంగ సభను పురస్కరించుకుని సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతో పాటు ప్రత్యేక కళారూపాలను రూపొందించాలని ఆయన కోరారు. పార్టీ వందేళ్ల చరిత్ర సమకాలీన రాజకీయాలు, ఆర్థిక సామాజిక పరిస్థితులను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లపై కొన్ని రాజకీయ పార్టీలు దొంగాట ఆడుతున్నాయని సాంబశివరావు ఆరోపించారు. మద్దతు ప్రకటిస్తూనే మరో పక్క రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలిపారు. బిసి రిజర్వేషన్ల అమలుకు సిపిఐ కట్టుబడి ఉన్నదని బిసిలకు 42 శాతం అమలు కోసం జరిగే పోరాటాలకు సిపిఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. బిజెపి బిసి వ్యతిరేకిగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. 18 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావాల్సిన ఆర్థిక మొత్తాలను ప్రభుత్వం అందించడం లేదని తక్షణం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనర్లు చేపట్టే ఆందోళనకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18న నియామక పత్రాలు
(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టికె.శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మాగంటి సునీతకు మంత్రులు పొన్నం, తుమ్మల క్షమాపణ చెప్పాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ అభ్యర్థి మాగంటి సునీత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే యాక్షన్ ఎలా అవుతుందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో కన్నీళ్లు పెట్టుకున్న మాగంటి సునీతను అవమానించే విధంగా వ్యాఖ్యాలు చేసినందుకు వెంటనే మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి తాతా మధుతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ చనిపోతే దేశ వ్యాప్తంగా రాజీవ్ గాంధీ ఫోటోలతో ప్రచారం చేయలేదా అని ప్రశ్నించారు. తాతా మధు మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నులో వణుకు పుడుతోందన్నారు.

## లండన్‌లో అంబేద్కర్ నివాసాన్ని సందర్శించిన శాసనసభ ప్రతినిధులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1921–22లో లండన్ నగరంలోని కింగ్స్ హెన్రీ రోడ్డులో నివసించిన గృహాన్ని మంగళవారం తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌లు సందర్శించారు. ప్రస్తుతం మ్యూజియంగా మారిన ఈ ఇంటిని ముందుగా సందర్శించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మ్యూజియంలోని లైబ్రరీ, ఫొటోగ్యాలరీతో పాటు డాక్టర్ అంబేద్కర్ ఉపయోగించిన అనేక వస్తువులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ 'భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ నివసించిన ఈ పుణ్యస్థలాన్ని సందర్శించడం తాను గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. వెనుకబడిన కులంలో జన్మించి, లండన్ నగరంలో ఉన్నత న్యాయ విద్యను అభ్యసించి, ప్రపంచ మేధావిగా వెలుగొందిన అంబేద్కర్ మనకు స్ఫూర్తిదాయకమన్నారు. నివసించిన ఇంటిని ఆయన జ్ఞాపకార్థం మ్యూజియంగా ఏర్పాటు చేసి, దీనిని సంరక్షిస్తూ సమర్థవంతంగా నిర్వహిస్తున్న భారత ప్రభుత్వానికి సుఖేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నర్సింహాచార్యులు, స్పీకర్ ఓఎస్‌డి పి.వెంకటేశం ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బంద్‌కు టిజెఎస్ సంపూర్ణ సహకారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ బిసి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు టిజెఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని, బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ వెల్లడించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. 'బిసి జెఎసి' తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని 'బిసి జెఎసి' చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్‌గా వి.జి నారగోని ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో కోదండరామ్‌ను మంగళవారం కలిశారు. ఈ కార్యక్రమంలో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, గోపగాని శంకర్ రావు, పల్లె వినయ్ కుమార్, బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, ఎం.నర్సయ్యాగౌడ్, ఆర్.లక్ష్మి, జస్వంత్ కుమార్, హనుమంత్ రెడ్డి, సయ్యద్ ఇస్మాయిల్, దార సత్యం, రామచందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ బిసి సంఘాలు చేసే అన్ని పోరాటాలకూ తమ పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. అసెంబ్లీలో బిసి రిజర్వేషన్ల బిల్లుకు ఆమోదం తెలిపిన రాజకీయ పార్టీలు ద్వంద వైఖరిని అవలంబిస్తూ, బిసిలను మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నాయన్నారు. విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ ద్వారా ఆ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన కోరారు.

ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు కేవలం రాష్ట్ర ప్రభుత్వం, రిజర్వేషన్ల వ్యతిరేకుల వాదనలు మాత్రమే విన్నదని, బిసిల వాదనలను వినకుండానే స్టే విధించడం బిసిలను అవమానించడమేనని అన్నారు. రిజర్వేషన్ల విషయంలో కులగణన, బిసి రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్, జిఒ 9జారీ వరకు రాష్ట్ర ప్రభుత్వం సాఫీగానే చేసిందని వివరించారు. కోర్టు విధించిన స్టేలో న్యాయం లేదన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని, ఒకవేళ ప్రధాని, రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే అక్కడే ధర్నా చేపట్టాలని, ఇందులో ఇండియా కూటమి కూడా పాల్గొనేలా చూడాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ ఎలా మద్దతు ఇచ్చారో అదేస్థాయిలో బిసి రిజర్వేషన్లను అమలు చేయాలని, ఇందుకు ప్రధాని బాధ్యత తీసుకోవాలని కోరారు.

**16న గవర్నర్‌కు వినతిపత్రం –టిజెఎస్**


బిసి రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని కోరుతూ ఈనెల 16వ రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేయాలని టిజెఎస్ నిర్ణయించింది. రిజర్వేషన్ల విషయంలో ప్రజలలో చైతన్యం కలిపించేందుకు వీలుగా కార్యక్రమాలు చేపట్టాలని, ఇందులోభాగంగానే ఈ నెల 15న మండల స్థాయిలో మీడియా సమావేశాలు, 16న ఎంఆర్‌ఒలకు, 17న జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే బిసి హక్కుల సాధన, రిజర్వేషన్ల అమలు కోసం భవిష్యత్ కార్యాచరణ నిమ్మితం ప్రొఫెసర్ పి.ఎల్ విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసినట్టు కోదండరామ్ వెల్లడించారు.

## ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌సి వర్గీకరణతో అత్యంత వెనుకబడిన కులాలకు చేయూతనిచ్చి, సామాజిక న్యాయాన్ని సాధించడం కోసమే తప్ప, ఏ కులానికి ఇది వ్యతిరేకం కాదని,తాము మొదటి నుంచి చెబుతున్నామని, ఎంబిబిఎస్, ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర సీట్ల కేటాయింపులతో నిరూపితమైందని వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం సాధ్యపడిందన్నారు. ఎస్‌సి వర్గీకరణ రిజర్వేషన్ల ప్రకారమే ఈ ఏడాది ఇంజనీరింగ్, మెడికల్ తదితర కోర్సుల సీట్లను భర్తీ చేసిన నేపథ్యంలో దీనికి సంబంధించిన పలు అంశాలపైన మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణ, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ విసి కుమార్ మొలుగారం,జెఎన్‌టియు విసి కిషెన్ కుమార్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విపి ఘంట చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం, మన్నె, కొలుపులవాండ్లు అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎంబిబిఎస్‌లో ఎస్‌సి గ్రూప్1 పరిధి లోనికి వచ్చే విద్యార్థులకు 41 సీట్లు, గ్రూప్ 2 పరిధిలోని వారికి 561 సీట్లు, గ్రూప్ 3లో వారికి 324 సీట్లు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఇంతకాలం ప్రొఫెషనల్ కోర్సుల్లో నామమాత్రంగా ఉన్న వర్గాలకు, రిజర్వేషన్ల వర్గీకరణతో ఈ ఏడాది సముచిత ప్రాధాన్యత లభించిందన్నారు. రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలంటే ఇంజనీరింగ్, మెడికల్ అడ్మిషన్లలో సీట్లు పొందిన ఎస్‌సి విద్యార్థులు, ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రాప్ అవుట్ కాకుండా చూసుకోవాలని విద్యాశాఖ అధికారులకు మంత్రి సూచించారు. అత్యంత వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులు, ఇంగ్లీష్ భాష రాకపోవడం వంటి సమస్యలతో ఆత్మనూన్యత భావానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఇది డ్రాప్ అవుట్స్‌కు దారి తీస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులు ఆత్మన్యూనతకు లోను కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక తరగతుల నిర్వాహించాలని, సైకాలజిస్టులతో మోటివేషన్ క్లాసులు చెప్పించాలన్నారు. విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి టీచింగ్ ఫాకల్టీని, సీనియర్ స్టూడెంట్లను మెంటార్లుగా నియమించాలని తెలిపారు.

## 17న 'చలో గవర్నర్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో బిసి రిజర్వేషన్ల అంశాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న 'చలో గవర్నర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. రాష్ట్ర శాసనసభలో బిసి రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిన బిజెపి, కేంద్రంలో మాత్రం అడ్డుకుంటుందని ఆరోపించారు. బిల్లును ఆమోదించేలా రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బిజెపికి చెందిన ఎంఎల్‌ఎలు, ఎంపిలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. రిజర్వేషన్ల బిల్లులపైన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో న్యాయ పోరాటం చేయాలని, అలాగే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వంపై పోరాడితేనే సమస్య పరిష్కారమవుతుందని ఆయన డిమాండ్ చేశారు.

**'బంద్ పాటిస్తే' బిసి జెఎసికి సంపూర్ణ మద్దతిస్తాం: జాన్‌వెస్లీ**

బిసి రిజర్వేషన్ల బిల్లును, రాష్ట్రంలోని ఆర్డినెన్స్‌ను ఆమోదించకుండా అడ్డుకుంటున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిస్తే తమ సంపూర్ణ మద్దతునిస్తామని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. బిసి జెఎసి ఈ నెల 18న తలపెట్టనున్న రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని హైదరాబాద్‌లోని ఎం.బి.భవన్‌లో సిపిఐ(ఎం) నాయకులను బిసి జెఎసి చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వైస్ ఛైర్మన్ నారగోని, వర్కింగ్‌ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరుల బృందం మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైన పోరాటం చేయకుండా బంద్ కార్యక్రమం తీసుకుంటే, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం సిపిఐ(ఎం) తరపున తాము స్వతంత్రంగానే పోరాటాన్ని కొనసాగిస్తామని జాన్‌వెస్లీ బిసి జెఎసికి స్పష్టం చేశారు. బంద్‌కు స్పష్టమైన డిమాండ్ పెట్టాలన్నారు.

## బంద్‌కు ఎఐవైఎఫ్ మద్దతు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన బిసి జెఎసి 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ బంద్‌లో ప్రత్యక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటామని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐవైఎఫ్ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలన్నారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితిలోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపిలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదం లేదన్నారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండటం వల్లనే రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ నెలలో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో యువజన సంఘాన్ని బలోపేతం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, మర్రి శ్రీమాన్, యుగంధర్, చేపూరి కొండల్ పాల్గొన్నారు.

## నేడు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఈనెల 15న హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని డాక్టర్ రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహ హాజరవుతున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో విడుదల చేసిన హామీలు, తదనంతర పరిణామాలు సమావేశంలో చర్చిస్తారన్నారు. దళితల ఇతర న్యాయమైన డిమాండ్స్ సాధన కోసం సమావేశంలో చర్చించి తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు తెలిపారు.

## బంద్‌కు టిడిపి మద్దతు

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఎం.అరవింద్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు కల్పించి చైతన్య పరచిన తెలుగుదేశంకే దక్కుతుందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.అరవింద్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బిసి జెఎసి ఈనెల 18న తలపెట్టిన బంద్‌కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యం బలహీన వర్గాల సంక్షేమమేనని, తమ పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాలను చైతన్యపరిచి రాజ్యాధికారం కల్పించే దిశగా కృషి చేస్తున్నారన్నారు. తదుపరి, బిసిలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ లబ్ధి కోసం బిసిలను వాడుకోవాలని ప్రయత్నం చేస్తున్న పార్టీలు ఈ విషయం గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు పి.సాయిబాబా, నల్లెల్ల, కిషోర్, పి.బాల్‌రాజ్ గౌడ్, ఎస్. ప్రకాష్, శుక్రవేది, యాదగిరి పాల్గొన్నారు.



# దేవాదుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేవాదుల ప్రాజెక్ట్ పూర్తికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తద్వారా ఉత్తర తెలంగాణాను సస్యశ్యామలం చేయడమే తమ ముందున్న కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. జే.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం (జెసిఆర్‌డిఎల్‌ఐఎస్) పురోగతిపై మంగళవారం సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖామంత్రి దనసరి అనసూయ సీతక్క, లోకసభ సభ్యుడు బలరాం నాయక్, శాసనసభ్యుడు నాగరాజు, యశశ్విని రెడ్డి, సత్యనారాయణ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, సలహాదారుడు, ఆదిత్యనాథ్ దాస్, సహాయ కార్యదర్శి కే.శ్రీనివాస్, ఇ.ఎన్.సి.లు అంజద్ హుస్సేన్, రమేష్ బాబు,శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్ణీత కాల వ్యవధిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలి అన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. పాలనాపరమైన అడ్డంకులను సత్వరం తొలగించి పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా గంగారాం గ్రామ సమీపంలోని గోదావరి నది నుండి 38.16 టి.యం.సిల నీటిని వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, భోనగిరి యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాలలో 5.57 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని ఆయన వివరించారు. 71 మీటర్ల ఎత్తు నుండి 540 మీటర్ల ఎత్తు వరకు మొత్తం 469 మీటర్ల మేర ఎత్తిపోతల పథకం ఇదని ఆయన తెలిపారు. పంప్‌హౌస్ లు, కాలువల తవ్వకాలు, నీటి సరఫరా తదితర పనులు పూర్తి చేసేందుకు గాను మూడు దశలలో పనులు జరుగుతున్నాయన్నారు. 5.56 లక్షల ఎకరాలను సాగు లోకి తేవడానికి ఉద్దేశించబడిన ఈ ప్రాజెక్టు కింద ఇప్పటి వరకు 3.17 లక్షల ఏకరాలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. భూగర్భజలాలతో సాగులో ఉన్న 58,028 ఎకరాల విస్తీర్ణంతో కలుపుకుంటే మొత్తం ఆయకట్టు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సవరించిన అంచనాల ప్రకారం ప్రాజెక్టు నిర్మాణానికి 18,500 కోట్లు కాగా ఇప్పటి వరకు 14,269,63 కోట్లు ఖర్చు పెట్టినట్లు ఆయన వెల్లడించారు. మిగిలిన పనుల పూర్తికి 4,230 కోట్లు అవసరమౌతాయని ఆయన తెలిపారు. ఖర్చు చేసిన మొత్తంలో నిర్మాణానికి గాను 11,667.85 కోట్లు ఖర్చు చేయగా భూసేకరణ నిమిత్తం 1,343.06 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. అంతే గాకుండా హైడ్రోమెకానికల్ విద్యుత్ అవసరాల నిమిత్తం 1,170.63 కోట్లు ఖర్చు పెట్టమన్నారు. 2,430 కిలోమీటర్ల కాలువ తవ్వాల్సి ఉండగా 1,663.10 కిలోమీటర్ల తవ్వకాలు పూర్తి అయ్యాయని, అదే విధంగా 702.62 కిలో మీటర్ల పైపు లైన్‌కు గాను ఇప్పటికి 669.66 కిలోమీటర్ల మేర పూర్తి చేశారని కాలువల లైనింగ్ కూడా 799.80 కిలో మీటర్లు పూర్తి అయ్యిందని ఆయన చెప్పారు.46 ట్యాంక్‌లకు గాను 39 పూర్తి కాగా 21 పంప్‌హౌజ్‌లలో 18 ట్యాంక్‌లు పురోగతిలో ఉన్నాయన్నారు. అధికారికంగా అందించిన గణాంకాల ఆధారంగా వివిధ విభాగాలలో 67% నుండి 95% మేర పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 'ఖర్చు చేసిన ప్రతి రూపాయి పొలాలలోకి నీరు ప్రవహించేలా చేయాలి' అని ఆయన స్పష్టం చేశారు.

## తరగతులకు అనుమతించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎమ్మార్వో కుల ధ్రువీకరణ పత్రం తరువాత కింది స్థాయిలో అధికారులు తనిఖీ చేయలేదని చెప్పి ఒక ఎస్‌టి అభ్యర్థిని యుపీఎస్సీ కోచింగ్ తరగతులకు అనుమతించకపోవడంపై హైకోర్టు స్పందించింది. క్షేత్ర స్థాయి తనిఖీలు జరిగేలోగా పిటిషనర్‌ను తరగతులకు అనుమతించాలని ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీకి ఆదేశించింది. నిజామాబాద్ జిల్లా నల్లూరు గ్రామస్తుడు కార్తీక్ కుమార్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ వేణుగోపాల్ ఆదేశాలిచ్చారు. ఎస్టీ సంక్షేమశాఖ వాదనల నిమిత్తం విచారణను 24వ తేదీకి వాయిదా వేశారు.


**అమరచింత మున్సిపాలిటీ కార్యాలయం- వనపర్తి జిల్లా**

**ఆసక్తి వ్యక్తీకరణ (EoI)**

అమరచింత మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల యొక్క DPRలు / టైప్ డిజైన్లు / సవివరమైన అంచనాలు తయారు చేయుట కొరకు ఆర్కిటెక్టులు / కన్సల్టెంట్లు మరియు నాణ్యత ప్రమాణాలు పర్యావేక్షించు ISO మరియు NABL సర్టిఫైడ్ మూడవ పక్షం నాణ్యత పర్యవేక్షణ కొరకు ప్రముఖ సంస్థల నుండి అమరచింత మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరుతోంది. అర్హతా ప్రమాణాలను నెరవేర్చే ఆర్కిటెక్టులు / కన్సల్టెంట్లు / ప్రముఖ సంస్థలు దిగువ తెలిపిన టైమ్ షెడ్యూల్ ప్రకారం కమిషనర్, అమరచింత మున్సిపాలిటీ పేరున వేర్వేరుగా తీసిన డి.డి.లు రూ. 10,000/- చొప్పున జమ చేసి ప్రతిపాదన కోసం అభ్యర్థన (RFP) పత్రాలు పొందగలరు. **1) డి.డి.లు దాఖలు** మరియు **RFP జారీ ప్రారంభ తేదీ:** 16.10.2025న ఉ.11.00 గం. **2)** వేర్వేరుగా తీసిన డి.డి. లతో పాటు అవసరమైన **దాక్యుమెంట్లు దాఖలుకు చివరి తేదీ:** 21.10.2025న 4:00 గం. **3) దాక్యుమెంట్ల పరిశీలన** మరియు **ఆర్థిక బిడ్ తెరుచు తేదీ:** 22.10.2025న సా. 5:00 గం.

DIPR R.O. No. : 9128-PP/CL/ADVT/1/2025-26, Date: 14-10-2025


# బోగస్ కాలేజీలను అడ్డుకుంటాం

బిసి జెఎసి చైర్మన్, ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలో గుర్తింపు లేని 400 కాలేజీల నిర్వహణను అడ్డుకొంటామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు సిఎస్‌ను కలుస్తానని తెలిపారు. బోగస్ కాలేజీలతో నష్టపోయిన విద్యార్థులకు ఫీజు డబ్బు లు వాపస్ ఇచ్చి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ అనుబంధ ఆరోగ్య నిపుణుల దినోత్సవానికి ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ''ది అనాటమీ ఆఫ్ అవేర్‌నెస్'' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అలైడ్ హెల్త్‌కేర్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పారామెడికల్ విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నాణ్యమైన వైద్యపరీక్షలు జరగాలంటే పారామెడికల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న పారామెడికల్ ఉద్యోగులకు రూ.30వేల బేసిక్ వేతనం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర కన్వీనర్ డా.సంజీవ్‌సింగ్ యాదవ్, తెలంగాణ పారామెడికల్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నేతలు పగిళ్ల సతీశ్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పిటిఎలపై వివరాలు ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల్లో పేరంట్, టీచర్ అసోసియేషన్లను ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారించింది. రాష్ట్ర విద్యా చట్టంల ప్రకారం ప్రతి పాఠశాల స్థాయిలో పీటీఏ ఏర్పాటుకు ఆదేశాలివ్వాలంటూ సంగారెడ్డి జిల్లా కంది గ్రామానికి చెందిన మల్లికార్జున్ వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించేందుకు, పాఠశాల నిర్వహణ, కనీస సౌకర్యాల కల్పన, పర్యవేక్షణకు కమిటీ దోహదపడుతుందని న్యాయవాది చెప్పారు. ప్రభుత్వ కౌంటర్ నిమిత్తం విచారణ 6 వారాలకు వాయిదా పడింది.


**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**

hmda Growing Global

4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన

ప్రణాళిక విభాగం

File No. 002356/HMDA/00705/SWDL/SKP2/2025-ADD

M/s ఆస్పైర్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతరులు గతంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగాం గ్రామం వద్ద 174893.33 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ (కాంపౌండ్ వాల్‌తో)కింద గృహనిర్మాణంతో కూడిన డ్రాఫ్ట్ లేఅవుట్ ఆమోదం కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు.మరియు దీనిని ఫైల్ నెంబర్: 059081/SKP/LT/U6/HMDA/18012023, తేదీ:15.04.2023 ద్వారా ఆమోదించడం జరిగింది.

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగాం గ్రామంలో 288924.11 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న 165/P, 166/P, 167/P, 168/P, 169/P, 170/P & 171/P సర్వే నెంబర్లలో గేటెడ్ కమ్యూనిటీ (కాంపౌండ్ వాల్‌తో) కింద హౌసింగ్ లేఅవుట్‌తో జోడింపు/ మార్పు ఆమోదం కోసం తేదీ: 09.06.2025న ఆస్పైర్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు ఇతరులు చేసుకున్న దరఖాస్తును చూడండి.

అందువల్ల పటాన్‌చెరు మండలం నందిగాం గ్రామంలో ఉన్న చెప్పబడిన గేటెడ్ కమ్యూనిటీ కింద హౌసింగ్‌తో కూడిన లేఅవుట్ ఫ్లాట్ యజమానులు/ కొనుగోలుదారులు/ అగ్రిమెంట్ హోల్డర్లు ఈ కార్యాలయం నుంచి నోటీస్ ప్రచురించబడిన తేదీ నుండి (15)రోజుల లోపు వారి అభ్యంతరాలు /సూచనలు ఏవైనా ఉంటే ఈ కార్యాలయానికి దాఖలు చేయవచ్చు. పైన పేర్కొన్న వ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరాలు/ సూచనలు అందకపోతే దరఖాస్తు యొక్క అభ్యర్థన మేరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం నందిగాం గ్రామంలోని సర్వే నెంబర్లు 165/P, 166/P, 167/P, 168/P, 169/P, 170/P & 171/P లో గేటెడ్ కమ్యూనిటీ కింద గృహనిర్మాణంతో కూడిన లేఅవుట్‌లో 288924.11 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జోడింపు/మార్పు ఆమోదం కార్యాలయంలో అందుబాటులో ఉన్న మెటీరియల్ పేపర్ల ఆధారంగా పరిగణనలోకి తీసుకొనబడుతుందని తెలియజేయడమైనది.

సం/-
మెట్రోపాలిటన్ కమిషనర్ తరపున
డైరెక్టర్ ప్లానింగ్-II, HMDA.

DIPR R.O. No. : 9196-PP/CL/ADVT/1/2025-26, Date: 14-10-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో '1950' హెల్ప్‌లైన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక 1950 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్‌జిఆర్ఎస్) ఏర్పాటు చేశారు. 1950 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎపిక్ కార్డులు, మోడల్ కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాల అంశాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం పొందడమే కాకుండా, ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. 1950 హెల్ప్‌లైన్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటి వరకు 433 కాల్స్ రాగా 379 కాల్స్‌కు సమాధానం ఇచ్చారు.



## మాగంటి సునీతకు బి ఫామ్.. అందజేసిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్‌కు పార్టీ అధినేత కెసిఆర్ బి ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరఫున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపీనాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సబితా ఇంద్రారెడ్డి, టి. పద్మారావు గౌడ్, కాలేరు వెంకటేశ్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు ఉన్నారు.

### మాగంటి సునీతపై కేసు

జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కుమార్తె అక్షరతో పాటు స్థానిక కార్పొరేటర్ రాజ్ కుమార్ సహా మరో నలుగురిపై పోలీసు కేసు నమోదు చేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో శుక్రవారం నమాజ్ చేయడానికి వెళ్తున్న వారిని ఓటు వేయాంటూ ప్రభావితం చేశారని కాంగ్రెస్ నేతలు రిటర్నింగ్ అధికారి సాయిరాంకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించి ప్రార్థనా స్థలాల వద్ద అనుమతులు తీసుకోకుండా ఎన్నికల ప్రచారం చేశారని పేర్కొంటూ ఏ1గా మాగంటి సునీత, ఏ2 మాగంటి అక్షర, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోద చేశారు.

## డూప్లికేట్, నకిలీ ఓట్లను వెంటనే తొలగించాలి : కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉప ఎన్నికల సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అసాధారణంగా ఓట్లు పెరగడం పట్ల అనేక అనుమానాలకు దారి తీస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఓటర్ల జాబితాను కెటిఆర్ వివరించారు. డూప్లికేట్, నకిలీ ఓట్లను వెంటనే తొలగించాలని, ఈ ఓట్లను నమోదు చేసి, ఓట్ల అక్రమాలకు పాల్పడిన అధికారులందరిపైనా చర్యలు తీసుకోవాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం స్పందించాలన్నారు. తెలంగాణ ఓట్ చోరీ అంశంపైన రాహుల్ గాంధీ స్పందించా లన్నారు. దొంగ ఓట్లతో ఎన్నికలను గెలువాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 23 వేల ఓట్లు పెరిగితే, మరోవైపు 12,000 ఓట్లను తొలగించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్నికల కమిషన్ విధులను తన చేతుల్లోకి తీసుకుని అక్రమంగా ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారని ఆరోపించారు.మైనర్ బాల బాలికలకు కూడా ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణి చేశారన్నారు. ఓటర్ జాబితా పంపిణీకి సంబంధించిన అంశాల్లో సిఎం రేవంత్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. బూత్ నంబర్ 125లో ఒక ఇంట్లోనే 23 ఓట్లు ఉన్నాయని, 80 గజాల ఇంట్లో ఇంత మంది ఎందుకు వచ్చారో తమకు తెలువదని ఆ ఇంటి యజమానికి తమ దృష్టికి తీసుకొచ్చారని కెటిఆర్ వివరించారు.

# విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

'బెస్ట్ అవైలబుల్ స్కీమ్' బకాయిల వివరాలు పంపిస్తే, ఆ బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తాం

డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద పాఠశాలల వారీగా బకాయిల వివరాలను వెంటనే పంపిస్తే, ఆ బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. డిఇఒలు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను సందర్శించి, ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా? లేదా?, ఆయా పాఠశాలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయనే అంశాలపైన వెంటనే నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలి తప్ప, విద్యార్థులను బయటికి పంపించేందుకు వీలులేదన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్‌సిఎస్‌టి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'బెస్ట్ అవైలబుల్ స్కీమ్' ప్రగతిని సమీక్షించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద నిధులకు సంబంధించిన ఒప్పందం పాఠశాల యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్య జరిగింది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిష్టాత్మంగా తీసుకుందన్నారు. 'బెస్ట్ అవైలబుల్ స్కీమ్' కింద ఎంపికైన ప్రతి విద్యార్థి కూడా పాఠశాలలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యా హక్కు చట్టం, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ఏం చెబుతుంది, పాఠశాల యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య జరిగిన ఒప్పందంలో ఏ ఏ అంశాలు ఉన్నాయో పాఠశాలల యాజమాన్యాలను పిలిచి వివరించాలని భట్టి ఆదేశించారు. విద్యా, వైద్య రంగాలపై జిల్లా కలెక్టర్లు సీరియస్‌గా దృష్టి సారించాలని పెండింగ్ బిల్స్ ఏమైనా ఉంటే ఆర్థిక శాఖ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సిఎం కలెక్టర్లకు సూచించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులు ఎప్పటికప్పుడు రాకపోతే కొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉందని అధికారు లు నివేదిస్తున్నారని, కేవలం బెస్ట్ అవైలబుల్ స్కీమ్ నిధులపై ఆధారపడితే, ఆ పాఠశాల ప్రముఖ పాఠశాల ఏ విధంగా అవుతుందని జిల్లా కలెక్టర్లను భట్టి విక్రమార్క ప్రశ్నించారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని, ప్రస్తుతం ఆ విద్యార్థులంతా ఎక్కడ ఉన్నారు, ఏం చేస్తున్నారు?, ఉన్నత విద్యలో చేరారా? లేదా ? అనే వివరాలను సేకరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు స్వయంగా పర్యవేక్షించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కొనసాగుతున్న పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర

బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎపి ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టును ఆపే ఉద్దేశం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? లేదా? అని ప్రశ్నించారు. పాత తేదీతో సిడబ్ల్యుసికి ఉత్తరం రాస్తే ఏం ఉపయోగమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. ఒక వైపు ఎపి ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టును నిర్మించేందుకు వేగంగా ముందుకు కదులుతుంటే, మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తెలంగాణ ప్రజలను బ్యాక్ డేటెడ్ లెటర్లతో మభ్యపెడుతోందని ఆరోపించారు. గోదావరి నదీ జలాలను వరద జలాల పేరుతో తరలించేందుకు తలపెట్టిన ఎపి అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తోందని ఆయనమంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు మొదలు, డిపిఆర్‌కు టెండర్లను ఆహ్వానించే వరకు ప్రతి సారి రాష్ట్ర ప్రభుత్వానిన బిఆర్ఎస్ హెచ్చరిస్తూ నిద్ర లేపుతోందని అన్నారు. బనకచర్ల ద్వారా తెలంగాణ నీటి హక్కులను ఎపి కాలరాసే కుట్రలకు పాల్పడుతున్నదని ఎన్నిసార్లు ముల్లుకర్రతో పొడిచినా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని మండిపడ్డారు. బనకచర్లను అడ్డుకోవాలని బిఆర్ఎస్ నిలదీసిన ప్రతి సారి కూడా లేఖలు రాయడంతోనే రాష్ట్ర ప్రభుత్వం 'మమా' అనిపించి చేతులు దులుపుకోవడం రాష్ట్ర ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. బనకచర్ల డిపిఆర్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినప్పుడే దీనిని అడ్డుకోవాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి లేదా, నీటిపారుదల శాఖ మంత్రి ఇప్పటివరకు ఎందుకు ఉత్తరం రాయలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇదే విషయంలో తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎందుకు కేంద్ర జలశక్తి కార్యదర్శికి ఉత్తరం రాయడం లేదన్నారు.దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 1.54శాతం నమోదైతే, తెలంగాణరాష్ట్రంలోనెగిటివ్ ద్రవ్యోల్బణం నమోదవ్వడం మందగించిన ఆర్థిక పతనానికి సంకేతమని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు.అనాలోచిత విధానాలు, ఆర్థిక నిర్వహణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫ్యలమేనని, రాష్ట్రం తిరోగమ నం వైపు పయనిస్తోందని ఆరోపించారు. ప్రభు త్వ అనాలోచిత విధానాలు, ఆర్థిక నిర్వహణలో ఘోర వైఫల్యం కారణంగానే రాష్ట్రానికి ఈ దుస్థి తి వచ్చిందని హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రుణాత్మక ద్రవ్యోల్బణం మూడు సార్లు నమోదవ్వడం ఇదే మొదటి సారి అని అన్నారు. రాష్ట్రలో బుల్‌డోజర్ విధానాలను, ప్రతీకార రాజకీయాలను మానుకోని, నానాటికి చతికిల పడిపోతున్న రాష్ట్ర ఆర్థిక వృద్ధిపైన దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డికి సూచించారు.



## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ ఖాళీ

మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ ఖాళీ ఐపోతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సారు కారు 16 అని, ఈపార్టీకి పార్లమెంట్ ఎన్నికలో ఒక్క సీటు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా మంగళవారం వెంగళ్‌రావు నగర్‌లో డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, తుమ్మల నాగేశ్వర రావు, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ చిరునామా గల్లంతవుతుందన్నారు. పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ సున్నా సీట్లు ఇచ్చారన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు బిఆర్ఎస్, బిజెపిలదే బాధ్యత అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ, గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. సునీతపై తమకు సానుభూతి ఉందని, రాజకీ యాలకోసం ఆమెను ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాజకీయ వేదికలపై ఏడుపులు మంచి పద్ధతి కాదని సూచించారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ గతంలో రావణాసురిడిపాలన ఉండే, ఇప్పుడు ప్రజల పాలన నడుస్తోందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ బిఆర్ఎస్ దొంగ సోషల్ మీడియా అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. బిఆర్ఎస్ అవతలి వాళ్ల మంచి తనాన్ని చెడుగా చూపిస్తూ బతుకుతున్న పార్టీ అన్నారు. దొంగ ఓట్లకు వ్యతిరేకంగా పోరాడుతున్నది కాంగ్రెస్ పార్టీ అన్నారు. కెటిఆర్ వైఖరి దొంగే దొంగా దొంగా అని అరుస్తున్నట్టుగా ఉందని విమర్శించారు. నవీన్ యాదవ్ మన తమ్ముని లెక్క ఉంటాడని, మన ఏ పని అయినా చేస్తారని అన్నారు.

### 150 కోట్లతో అభివృద్ధి : నవీన్ యాదవ్

గత 3 నెలలుగా జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ఇన్‌చార్జులుగా నియమితులైన ముగ్గురు మంత్రులు కృషి చేస్తున్నారని, 150 కోట్లతో అభివృద్ధి పనులు చేయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. రేవంత్ రెడ్డి పాలనపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు.

## రైళ్లలో టపాసుల రవాణా నిషేధం

రైల్వే సిపిఆర్ఒ ఎ.శ్రీధర్



ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే రాబోయే దీపావళి పండుగ సీజన్ నేపథ్యంలో, రైళ్లలో, రైల్వే ప్రాంగణాలలో బాణసంపచాతో పాటు మండే స్వభావం గల వస్తువులను వెంట తీసుకుని వెళ్ళడాన్ని నిరోధించడానికి తనిఖీలు చేపడుతోందని చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైళ్లలో లేదా స్టేషన్లలో అటువంటి వస్తువులను తీసుకెళ్లడం వలన భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని, ఇది చుట్టుపక్కల ఉన్న ప్రయాణీకులందరికీ అత్యంత అసురక్షిత పరిస్థితిని అని ఆయన స్పష్టంచేశారు. రైలు ప్రయాణికులు, ప్రయాణికుల భద్రతకు, రైల్వే ఆస్తులకు హాని కలిగించే మండే స్వభా వం గల వస్తువులు,పేలుడు పదార్థాలు, బాణసంచాలను రైళ్లలో తీసుకెళ్లకూడదని శ్రీధర్ ప్రయాణికులను సూచించారు. రైలులో మండే ,పేలుడు స్వభావం గల వస్తువులను తీసుకెళ్లడం రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 164తో పాటు 165 ప్రకారం రూ.1000 వరకు జరిమానా లేదా 3 సంవత్సరాల జైలు శిక్ష లేదా రెండూ విధించడం జరుగుతుందని తెలిపారు. హెల్ప్‌లైన్ 139 కాల్ చేయాలని శ్రీధర్ కోరారు. దక్షిణ మధ్య రైల్వే రైళ్ళలో ప్రయాణీకులకు సురక్షితమైన,ఇబ్బంది లేని రైలు ప్రయాణాన్ని నిర్ధారించడానికి రైలు ప్రయాణీకుల సహకారాన్ని ఆయన కోరారు.



# రైల్వే టిసిల జాతీయ రికార్డు

ఒకే రోజు తనిఖీల్లో రూ.కోటి వసూలు

టికెట్ లేకుండా రైలులో ప్రయాణిస్తున్న వైనం

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రయాణికుల టికెట్ చెక్కింగ్‌లో దక్షిణ మధ్య రైల్వే జాతీయ స్థాయిలో రికార్డు సృష్టించింది. టిసి అధికారులు సోమవారం జరిపిన తనిఖీల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న 16,105 మంది ప్రయాణీకులపై కేసులు నమోదు చేసి రూ.1.08 కోట్లు జరిమానా కింద వసూలు చేశారు. భారతీయ రైల్వేల అన్ని జోన్లలో కంటే ఇదే అత్యుత్తమ టికెట్ చెకింగ్ ఆదాయం. దక్షిణ మధ్య రైల్వే సగటునా ప్రతి రోజు టిసిల తనిఖీల్లో 9,500 కేసుల నమోదుతో సుమారుగా రూ.47 లక్షల ఆదాయాన్ని సంపాదిస్తుంది. అయితే సోమవారం ఒక్కరోజు జరిపిన తనిఖీల్లో రూ.1.08 ఆదాయం ఆర్జించడం ద్వారా రైల్వే శాఖ చరిత్ర సృష్టించడం ఇదే తొలిసారి. దక్షిణ మధ్య రైల్వే దీపావళి, ఛట్ పండుగల సీజన్ నేపథ్యంలో రైలు ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు ప్రయాణించే భారీ రద్దీ దృష్ట్యా సోమవారం ఒక రోజంతా ముమ్మరంగా టిక్కెట్ల తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే జారీ చేసిన సూచనల మేరకు దక్షిణ మధ్య రైల్వేలోని ఆరు డివిజన్లైన సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు , గుంటూరు, నాందేడ్‌లలో తనిఖీ కార్యక్రమం జోన్ వ్యాప్తంగా నిర్వహించారు. విజయవాడ డివిజన్ అత్యధికంగా రూ. 36.91 లక్షలు, గుంతకల్లు డివిజన్ రూ. 28 లక్షలు, సికింద్రాబాద్ డివిజన్ రూ. 27.9 లక్షలు, గుంటూరు డివిజన్ రూ. 6.46 లక్షలు, హైదరాబాద్ డివిజన్ రూ. 4.6 లక్షలు, నాందేడ్ డివిజన్ రూ. 4.08 లక్షలు టికెట్ చెకింగ్ ఆదాయాన్ని అందించాయి. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ ప్రత్యేక తనిఖీ నిర్వహణపై అన్ని డివిజన్ల వాణిజ్య సిబ్బంది ,అధికారులను అభినందించారు. ఈ రకమైన కార్యాచరణ అధీకృత ప్రయా ణం గురించి సాధారణ ప్రజలలో అవగాహన పెంచుతుందని టిక్కెట్ అమ్మకాలను పెంచడంలో కూడా సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు.



## బస్సులో అగ్నిప్రమాదం

20 మంది సజీవ దహనం

మరో 16 మందికి తీవ్ర గాయాలు

రాజస్థాన్‌లోనిజైసల్మేర్-జోధ్‌పూర్ హైవేలో ఘటన

జైసల్మేర్ : రాజస్థాన్‌లో విషాద ఘటన జరిగింది. మంగళవారం జైసల్మేర్ నుండి జోధ్‌పూర్ వెళ్తున్న ప్రైవేట్ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ఘోర అగ్నిప్రమాద ఘటనలో 20 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. 57 మంది ప్రయాణికులతో బస్సు మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో జైసల్మేర్ నుండి బయలుదేరింది. జైసల్మేర్–జోధ్‌పూర్ హైవేలో బస్సు వెనుక భాగం నుండి పొగ రావడం ప్రారంభం కాగా, డ్రైవర్ రోడ్డు పక్కన బస్సును ఆపాడని, క్షణాల్లోనే మంటలు వాహనాన్ని చుట్టుముట్టాయని పోలీసులు తెలిపారు. స్థానికులు , బాటసారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలకు సహాయం చేయగా, సైనిక సిబ్బంది కూడా ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఫైర్ టెండర్లు, పోలీసులకు సమాచారం అందించగా, గాయపడిన ప్రయాణికులను చికిత్స కోసం జైసల్మేర్‌లోని జవహర్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన 16 మంది ప్రయాణికులను జోధ్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా, షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 20 మంది ప్రయాణికుల మృతి గురించి పోక్రాన్‌కు చెందిన ఎమ్మెల్యే ప్రతాప్ పూరి పిటిఐకి సమాచారం ఇచ్చారు. 'బస్సులో 19 మంది ప్రయాణికులు మరణించగా, ఒకరు జోధ్‌పూర్‌కు వెళ్లే దారిలో కాలిన గాయాలతో మరణించారని అని ఆయన అన్నారు. జసల్మేర్ నుండి బయలుదేరిన పది నిమిషాలకే బస్సు మంటల్లో చిక్కుకుందని ఆయన అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత, బాధితుల కుటుంబ సభ్యులకు వారి గుర్తింపును నిర్ధారించేందుకు సమాచారం అందించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. డిఎన్ఎ సరిపోలిక తర్వాత మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ జైసల్మేర్‌కు చేరుకుని అధికారుల ద్వారా ఆయనకు సమాచారం అందించారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే సహాయ, సహాయ చర్యలను ప్రారంభించినట్లు జైసల్మేర్ జిల్లా యంత్రాంగం తెలిపింది. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతాప్ సింగ్ అధికారులను ఆదేశించారు. గవర్నర్ హరిభావు బగాడే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోడ్, ఇతర నాయకులు ఈ విషాద సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు సరైన వైద్య చికిత్స అందించాలని, బాధితుడికి సాధ్యమైన అన్ని సహాయాలను అందించాలని ఆదేశాలు జారీ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

# పోలీసు శాఖలో మహిళా ఐపిఎస్‌లకు అగ్రస్థానం

● పలు కీలక విభాగాలకు మహిళా ఐపిఎస్ అధికారులే సారథులు ● జైళ్ల శాఖ, ఎస్ఐబి, ఎసిబి, సిఐడి, విజిలెన్స్, పోలీసు అకాడమీ, ఆర్మ్‌డ్ రిజర్వ్, సిసిఎస్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు బాస్‌లు మహిళా అధికారులు ● ప్రజాప్రభుత్వంలో దక్కిన గౌరవం ● గత ప్రభుత్వంలో మహిళా ఐపిఎస్‌లకు మొండిచెయ్యి

బిరుదరాజు వాసుదేవరాజు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజల సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేసిన అధికారుల కృషిని గుర్తించిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తాజాగా పోలీసు శాఖలోని పలు కీలక విభాగాల్లో అర్హత కలిగిన మహిళా ఐపిఎస్ అధికారులకు మంచి పోస్టింగులు ఇచ్చింది. కీలక విభాగాలలో మహిళా ఐపిఎస్‌ల నియామకాలతో పరిపాలనలో కొత్త ఉత్సాహం నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేసిన బదిలీలలో అనుభవజ్ఞులైన, నిబద్ధత గల అధికారులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రభుత్వం, కృషికి విలువ ఇచ్చే ప్రజాప్రభుత్వం తన వైఖరిని మరోసారి చాటిచెప్పింది. ప్రజల సేవలో ముందుండే అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించడం ప్రజలలో సానుకూల వాతావరణాన్ని సృష్టించింది. 'ప్రభుత్వం నిజంగా పనిచేసే వారికి గౌరవం ఇస్తోంది. ఫలితాల ఆధారంగా పోస్టింగులు ఇవ్వడం మంచి మార్పునకు నాంది' అని పలువురు ఐపిఎస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నియామకాలను పరిపాలనలో సమతుల్యత కోసం తీసుకున్న నిర్ణయాలుగా పేర్కొంటున్నాయి. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళా ఐపిఎస్ అధికారులు ప్రజా సేవలో మరింత చురుకుగా వ్యవహరించనున్నారని అంచనా. పోస్టింగ్‌లతో పాటు, విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించే దిశగా ఈ నియామకాలు జరిగాయని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి. ఒక ఐపిఎస్ మహిళ ఒక విభాగం చూడాలంటేనే తలకు మించిన భారం. అలాంటిది రెండేసి కీలక విభాగాలను సైతం సమర్థవంతంగా నడిపిస్తున్న మహిళా ఐపిఎస్‌లు తెలంగాణలో ఉండడం రాష్ట్రానికే గర్వకారణం.



### కీలక విభాగాలకు అధిపతులు

పోలీసు శాఖకే మణిహారం తెలంగాణ పోలీసు అకాడమి. ఈ అకాడమికి అధిపతిగా డైరెక్టర్‌గా డిజి అభిలాష బిస్త్ ఉన్నారు. ఇక్కడ కానిస్టేబుల్ నుంచి డిఎస్‌పి స్థాయి వరకు సిబ్బందికి శిక్షణ ఇస్తారు. అలాగే ఫైర్, ఫోరెన్సిక్ సైన్స్, తదితర విభాగాలకు చెందిన అధికారులు కూడా ఇక్కడే శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక తెలంగాణ జైళ్ల శాఖ కూడా కీలకమైన విభాగమే. ఈ విభాగానికి డిజి సౌమ్యా మిశ్ర సారథ్యం వహిస్తున్నారు. ఇక రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ విభాగాలకు సంబంధించి అవినీతిపై దృష్టి సారించే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ అధిపతిగా కూడా డిజి స్థాయి మహిళా అధికారి శిఖాగోయల్ కొనసాగుతున్నారు. శిఖాగోయల్ మరో కీలక విభాగమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు డైరెక్టర్‌గా కూడా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల అవినీతితో పాటు ప్రభుత్వ ధనాన్ని దోచుకునే బడా నేరస్తుల భరతం పట్టే అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)కి ఇన్‌చార్జ్ చీఫ్‌గా, మరోవైపు రాష్ట్రంలో జరిగే బడా కేసుల భరతం పడుతున్న సిఐడి చీఫ్‌గా కూడా చారు సిన్హా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక మహిళా అధికారి కీలకమైన ఎసిబి, సిఐడి విభాగాలను నడిపించడం సాధారణ విషయం కాదు. ఇక మావోయిస్టులు, ఉగ్రవాదలను అరికట్టేందుకు వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టే ఎస్ఐబి చీఫ్‌గా బి.సుమతి తన ప్రతిభను చాటుతున్నారు. ఇక రాష్ట్రంలోని హోంగార్డుల యోగక్షేమాలు చూసుకునేది కూడా మహిళా సీనియర్ ఐపిఎస్ స్వాతి లక్రా బాధ్యత వహిస్తున్నారు. ఇక రాష్ట్రంలోనే అతిపెద్ద కమిషనరేట్‌గా ఉన్న హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో మహిళా ఐపిఎస్‌ల హవా గతంలో కంటే ఈ సారి రెట్టింపు అయిందని చెప్పవచ్చు. హైదరాబాద్ పోలీసు పరిపాలన విభాగాన్ని మహిళా ఐపిఎస్ అధికారి నూతన పరిమళ నడిపిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎక్కడ అల్లర్లు జరిగినా, రాజకీయ బహిరంగ సభలు జరిగినా, నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, బంద్‌లు జరిగినా క్షణాల్లో సిబ్బందిని బందోబస్తుకు తరలించాల్సిన సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వ్ చీఫ్‌గా రక్షిత కృష్ణామూర్తి బాధ్యతలు వహిస్తున్నారు. నిఘా వర్గాల్లో కీలకమైన హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ విభాగాన్ని కూడా మహిళా ఐపిఎస్ అధికారి అపూర్వ రావు నడిపిస్తున్నారు. బడా నేరస్తులు, బడా చీటింగ్ నిందితుల భరతం పట్టే సిసిఎస్ డిసిపిగా శ్వేతారెడ్డి బాధ్యత వహిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న సైబర్ క్రైమ్‌ను అరికట్టే సైబర్ క్రైమ్ విభాగం చీఫ్‌గా డిసిపిగా డి.కవిత దిగ్విజయంగా తన విధులను నిర్వహిస్తున్నారు.

### శాంతి భద్రతలలో రాణిస్తున్న డిసిపిలు, ఎస్‌పిలు

పోలీసు శాఖలోని పలు కీలక విభాగాలలోనే కాకుండా శాంతి భద్రతల విభాగంలో కూడా మహిళా ఐపిఎస్ అధికారులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ఈ మూడు కీలక పోలీసు కమిషనరేట్లలో జోన్ డిసిపిలుగా ఏడు మంది మహిళా అధికారులే ఉన్నారు. రాచకొండలో నాలుగు జోన్‌లలో మూడు జోన్‌లలో శాంతిభద్రతలు కాపాడుతున్నారు. హైదరాబాద్‌లో మూడు జోన్‌లలో, సైబరాబాద్‌లో ఒక జోన్‌లో మహిళా ఐపిఎస్‌లు తమ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో సెంట్రల్ జోన్ డిసిపి కె.శిల్పవల్లి, నార్త్‌జోన్ డిసిపి ఎస్.రష్మీ పెరుమల, సౌత్ జోన్ డిసిపి స్నేహ మెహ్రా, రాచకొండలో ఎల్‌బినగర్ డిసిపి బి.అనురాధా, మల్కాజ్‌గిరి డిసిపి పివి.పద్మజా, మహేశ్వరం డిసిపి డి.సునితారెడ్డి, రాచకొండ సైబర్ క్రైమ్ చీఫ్ ఎస్‌వి.నాగలక్ష్మి , రాచకొండ అడ్మిన్ డిసిపి పి.ఇందిరా, సైబరాబాద్‌లో మాదాపూర్ డిసిపి రితిరాజ్, సైబరాబాద్ సైబర్ క్రైమ్ డిసిపి సాయిశ్రీ, సైబరాబాద్ మహిళా భద్రత విభాగం డిసిపి కె.సృజన కర్ణం విధులు నిర్వహిస్తున్నారు. ఇక రైల్వే పోలీసు ఎస్‌పిగా మహిళా ఐపిఎస్ అధికారి చందనా దీప్తి విధులు నిర్వహిస్తున్నారు. జాతీయ పోలీసు అకాడమీలో కూడా తెలంగాణ సీనియర్ ఐపిఎస్ అధికారి రోహిణి ప్రియదర్శిని తన సత్తా చాటుతున్నారు. ఇక జిల్లాలలో ఎస్‌పిలుగా కూడా రాణిస్తున్న వారిలో నిర్మల్ ఎస్‌పి జానకీ షర్మిల, మహబూబ్‌నగర్ ఎస్‌పి జానకీ ధరావత్‌లు ఉండడం గమనార్హం.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీలో మళ్లీ ఆంక్షలు

**న్యూఢిల్లీ :** శీతాకాలం సమీపిస్తున్న వేళ దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ పడగ విప్పుతోంది. స్థానికంగా వాయు నాణ్యత సూచీ దిగజారడంతో సెంట్రల్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ఈ సీజన్‌లో తొలిసారి ఆంక్షలు విధించింది. ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్1 నిబంధనలను అమల్లోకి తీసుకొచ్చింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ మంగళవారం 211గా నమోదైంది. ఇది పూర్ కేటగిరిలోకి వస్తుంది. కొన్ని రోజులు కాలుష్యం ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందనే వాతావరణ విభాగం, ఇతర సంస్థల అంచనాల మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. వాయు నాణ్యత మరింత క్షీణించకుండా నిరోధించేందుకు జిఆర్ ఎపి1 నిబంధనలను వెంటనే అమలు చేయాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.



# ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

### రాజకీయ పార్టీలకు ఇసి ఆదేశం

**న్యూఢిల్లీ:** నవంబర్‌లో బిహార్‌లో శాసన సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఇసి) రాజకీయ పార్టీలకు కీలక సూచనలు చేసింది. రాజకీయ ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందుస్తు అనుమతులు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రాజకీయ పార్టీలకు, పోటీ చేసే అభ్యర్థులకు ఇసి మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అభ్యర్థులు ఏదైనా ప్రకటనలను ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందడం తప్పనిసరి అని పేర్కొంది.



**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!**

ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో, అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసేటప్పుడు వారి అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను అందించాలని ఆదేశించింది. రాజకీయ ప్రకటనల కోసం ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలుమీడియా సర్టిఫికేషన్, ఎంసిఎంసిలను ఏర్పాటు చేసినట్లు ఇసి పేర్కొంది. రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. నిబంధనలను ఉల్లఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం, అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజుల్లోపు ప్రచార ఖర్చుల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు సమర్పించాలని సూచించింది. ఖర్చుల నివేదికలో ప్రకటనల కోసం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు చేసిన అన్ని చెల్లింపులు, అలాగే కంటెంట్ రూపొందించడం, ప్రచారం, సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం అయ్యే ఖర్చులు తప్పనిసరిగా ఉండాలని రాజకీయ పార్టీలకు (ఇసి) సూచించింది.

**వీడియో, ఆడియో సందేశాలపై నిషేధం!**

ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత 48 గంటల వరకు ఎలాంటి బల్క్ ఎస్‌ఎంఎస్‌లు, ఆడియో సందేశాలు చేయరాదని ఎన్నికల సంఘం హెచ్చరించింది. అలాగే టివి, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియోల్లో ఎన్నికలకు సంబంధించి రాజకీయ ప్రకటనలు చేయరాదని తెలిపింది. పోలింగ్ ప్రాంతంలో ఆడియో విజువల్ డిస్‌ప్లేలు నిషేధించినట్లు పోల్ ఆథారిటీ పేర్కొంది. బిహార్ నవంబర్ 6న మొదటి దశ పోలింగ్ ప్రారంభమవుతున్న తరుణంలో ఇసి నిర్ణయం తీసుకుంది. కాగా బిహార్‌లో నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో బిహార్ రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అధికార ఎన్‌డిఎ, ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ప్రస్తుతం బిహార్‌లో అసెంబ్లీ గడువు నవంబర్ చివరి వారంలో ముగియనుంది. ప్రస్తుతం అక్కడ ఎన్డీఏ పార్టీ అధికారంలో ఉంది.

# మహారాష్ట్ర ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు

### ఎన్నికల కమిషనర్‌కు ప్రతిపక్ష నాయకుల ఫిర్యాదు



**ముంబయి:** మహారాష్ట్రలో ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలను ప్రతిపక్షనాయకుల బృందం మంగళవారం ఆ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి దృష్టికి తీసుకువచ్చింది. ఓటర్ల జాబితాలో అవకతవకలను సరిదిద్దాలని ప్రతిపక్షనాయకుల బృందం డిమాండ్ చేసింది. ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ఎస్.చొక్కలింగంను కలుసుకున్న ప్రతిపక్ష నాయకుల ప్రతినిధిబృందంలో కాంగ్రెస్, వామపక్షాలు, పీజంట్స్,వర్కర్స్‌పార్టీ, సమాజ్‌వాదీపార్టీలకు చెందిన నాయకులు కూడా ఉన్నారు. ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు శరద్‌పవార్, శివసేన (యుబిటి) నాయకులు ఉద్ధవ్ థాక్రే, ఎంఎన్‌ఎస్ నాయకుడు రాజ్ థాక్రే తదితరులతో కూడిన ప్రతిపక్ష నాయకులబృందం మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఒ)ని కలిసి ఎన్నికల ప్రక్రియలో అవకతవకలను ఆయన దృష్టికి తీసుకువచ్చింది. అదే విధంగా ఈఏడాది చివరిలో లేదా వచ్చే ఏడాది ఆరంభంలో జరుగుతాయని భావిస్తున్న మహారాష్ట్ర స్థానిక ఎన్నికలలో వివిపిటిలను (వోటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉపయోగించాలని కూడా ప్రతిపక్ష నాయకులు సిఇఒను డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికలలో కలిసి పోటీ చేయాలనే లక్ష్యంతో ఇటీవల ఏకమైపోయిన శివసేన గ్రూపులకు చెందిన నాయకులు, బంధువులు ఉద్ధవ్ థాక్రే, రాజ్‌థాక్రే ఇద్దరు కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి రావడం కనిపించింది. ఐతే మహారాష్ట్ర నవ నిర్మాణసేన(ఎంఎన్‌ఎస్) ప్రధాన నాయకుడు కూడా ఈ విశాలమైన ప్రతిపక్ష కూటమిలో భాగస్వామిగా ఉంటారా? లేదా? అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఎన్నికల వేళ ప్రతిపక్ష నాయకులు ఏకమవుతూ ఉండటంతో ఉపముఖ్యమంత్రి, శివసేన అధిపతి ఏక్‌నాథ్ షిండే వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. "అది మహా వికాస్ ఈఘాడీ కాదు, మహా గందరగోళ అఘాడీ" అని విమర్శించారు.కాగా ముంబై కాంగ్రెస్ అధ్యక్షుడు వర్ష గైక్వార్డ్, శివసేన (యుబిటి) నాయకులు అంబదాస్ దన్వే, అరవింద్ సావంత్ లతో కూడిన మరో బృందం కూడా మహారాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను కలుసుకుని ఎన్నికల ప్రక్రియలో అవతవకలపైనే ఫిర్యాదు చేసింది. "ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలు ఏమిటో సిఇఒ దృష్టికి తీసుకువచ్చాం, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయి, దీన్ని బట్టే స్పష్టంగా అర్థమైంది, రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో, నియోజకవర్గాలలో అవకతవకలు జరుగుతున్నాయి" అని ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకుడు జయంత్ పాటిల్ పాత్రికేయులకు చెప్పారు. దీని వల్ల రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇదేవిధమైన గందరగోళ పరిస్థితులు కొనసాగుతాయని ఆయన అన్నారు. తమ ఆందోళనలు, తమ డిమాండ్లు తెలుసుకుని చర్చించడంకోసం అందరితో ఒక సమావేశం నిర్వహించాలని సిఇఒను తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు పదే పదే వచ్చాయని, ఒక ఇంట్లో 170 ఓట్లు ఉన్నాయని ఇది అవకతవకలకు పెద్ద తార్కాణమని పాటిల్ విమర్శించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపేముందుగా ఓటర్ల జాబితాలో ఉన్న తేడాలన్నింటినీ సరిదిద్దాలని కోరారు.

## రాష్ట్రం హక్కులను లాక్కుంటారా..?

**న్యూఢిల్లీ :** తమిళనాడు మద్యం కుంభకోణం కేసు మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను ఇడి లాక్కుంటుందా..? అలా చేయడం సమాఖ్య వ్యవస్థకు విరుద్ధం కాదా? అంటూ ఘాటుగా స్పందించింది. మద్యం రిటైలర్ 'టాస్మాక్'లో అవకతవకలపై తమిళనాడు పోలీసులు, అవినీతి నిరోధకశాఖ కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నాయి. అయితే, ఆయా కేసుల ఆధారంగా ఇడి సైతం మనీ లాండరింగ్ కింద కేసు దర్యాప్తు ప్రారంభించింది.

## టిక్కెట్లు ఇచ్చి... మళ్లీ వెనక్కి

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ మంగళవారం తెల్లవారుజామున అనేక మంది అభ్యర్థులకు పార్టీ టిక్కెట్లు ఇచ్చారు. యితే ఆయన కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఇంకా సీట్ల పంపకాల ఫార్ములాను అధికారికంగా ప్రకటించలేదని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆర్‌జెడి అధినేత భార్య, మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవికి కేటాయించిన బంగళా 10, సర్క్యులర్ రోడ్ వెలుపల తొక్కిసలాట లాంటి పరిస్థితి కనిపించింది. ఈ జంట ఢిల్లీలో కోర్టు ముందు హాజరై తిరిగి వచ్చినప్పుడు ఆ బంగళాలో తొక్కిసలాట సందడి నెలకొంది. పార్టీ నుండి ఫోన్ కాల్స్ అందుకున్న ఆశావహులు, నిమిషాల తర్వాత పార్టీ గుర్తు చేతుల్లో, ముఖాల్లో విశాలమైన చిరునవ్వుతో బయటకు వచ్చారు. అయితే, తల్లిదండ్రులు తిరిగి వచ్చిన కొన్ని గంటల తర్వాత ఢిల్లీ నుండి తిరిగి వచ్చిన యాదవ్, ఈ పరిణామంతో కలత చెందారని చెబుతున్నారు. ఆర్‌జెడి వర్గాల సమాచారం ప్రకారం, పార్టీ గుర్తు, అభ్యర్థుల ఫొటోలు, వీడియో క్లిప్‌లు కూటమి భాగస్వాములతో ఇంకా ఒప్పందం కుదరలేదు అని ఆయన తన తండ్రికి చెప్పారు. అందువల్ల, పార్టీ చిహ్నాల పంపిణీని నిలిపివేసి, అర్ధరాత్రి దాటిన తర్వాత, వాటిని పొందిన వారిని సాంకేతిక సమస్యల కారణంగా టిక్కెట్లను తిరిగి ఇవ్వమని కోరారు. ఆర్‌జెడిలో టికెట్లు పొందిన వారిలో గత వారం ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జెడియు నుండి వైదొలిగిన సునీల్ సింగ్ (పర్బట్టా), మతిహాని నుండి అనేకసార్లు మాజీ ఎమ్మెల్యేగా ఉన్న నరేంద్ర కుమార్ సింగ్ అలియాస్ బోగో ఉన్నారు. భాయ్ వీరేంద్ర, చంద్రశేఖర్ యాదవ్ (మాధేపుర), ఇజ్రాయెల్ మన్సూరి (కాంతి) వంటి అనేక మంది సిట్టింగ్ ఆర్‌జెడి ఎమ్మెల్యేలు కూడా పార్టీ చిహ్నాన్ని ఊపుతూ పార్టీ అధినేత ఇంటి నుండి బయటకు వచ్చారు.

## జార్ఖండ్‌లో ఈ ఏడాది 266 మంది నక్సల్స్ అరెస్టు

### 32 మంది మృతి, 30 మంది లొంగుబాటు

**రాంచి :** జార్ఖండ్‌లో సెప్టెంబర్ చివరి వరకు 266 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా, 32 మంది మరణించారని, 30 మంది భద్రతా దళాల ముందు లొంగిపోయారని మంగళవారం ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు ప్రాంతీయ కమిటీ సభ్యులు, ఒక జోనల్ కమాండర్, ఇద్దరు సబ్‌జోనల్ కమాండర్లు, సిపిఐ (మావోయిస్ట్), దాని చీలిక గ్రూపులకు చెందిన తొమ్మిది మంది ఏరియా కమాండర్లు ఉన్నారని ఆయన చెప్పారు. 'జనవరి 1 నుండి భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో మొత్తం 32 మంది నక్సలైట్లు మరణించారు. ఎన్‌కౌంటర్లలో మరణించిన ప్రముఖుల్లో వివేక్ అలియాస్ ప్రయాగ్ మాంఝీ, అనుజ్ అలియాస్ సహదేవ్ సోరెన్ ఉన్నారు. ఇద్దరూ సిపిఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యులపై ఒక్కొక్కరికి రూ. 1 కోటి రివార్డు ఉందని, ఐజి (ఆపరేషన్స్), జార్ఖండ్ పోలీసు ప్రతినిధి మైఖేల్ రాజ్ విలేకరులకు తెలిపారు. ఈ కాలంలో మొత్తం 30 మంది నక్సలైట్లు భద్రతా దళాల ముందు లొంగిపోయారని ఆయన చెప్పారు. లొంగిపోయిన వారిలో జోనల్ కమాండర్ రవీంద్ర యాదవ్ మరియు సిపిఐ (మావోయిస్ట్) సబ్‌జోనల్ కమాండర్ ఆనంద్ సింగ్, జార్కండ్ జన ముక్తి పరిషత్ (జెజెఎంపి) సబ్ జోనల్ కమాండర్, లావ్లేష్ గంజు అలియాస్ లోకేష్ గంజు కూడా ఉన్నారు. జనవరి 1 నుండి సెప్టెంబర్ 30 వరకు పోలీసులు భారీ ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 'పోలీసుల నుండి దోచుకున్న 58 ఆయుధాలు, 11,950 కాట్రిడ్జ్‌లు, 18,884 డిటోనేటర్లు, 394.5 కిలోల పేలుడు పదార్థాలు, 228 ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ పరికరాలు (ఐఇడిలు) సహా 157 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. గత తొమ్మిది నెలల్లో 37 మావోయిస్టు బంకర్లను కూడా ధ్వంసం చేశారు' అని పోలీసు ప్రతినిధి తెలిపారు. ఈ కాలంలో రూ. 39.53 లక్షల లెవీ మొత్తాన్ని కూడా జప్తు చేశారు. ఈ సంవత్సరం సైబర్ నేరస్థులపై పోలీసు శాఖ పెద్ద ఎత్తున చర్యలు చేపట్టిందని కూడా పేర్కొన్నారు. సైబర్ నేరస్థులపై మొత్తం 128 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, ఆగస్టు, సెప్టెంబర్‌లలో ఇటువంటి నేరాలకు సంబంధించి 105 మందిని అరెస్టు చేశారు. ఇంకా, ఈ ఆపరేషన్లలో 128 మొబైల్ ఫోన్లు, 166 సిమ్ కార్డులు, 60 ఎటిఎం కార్డులు, 15 పాస్‌బుక్‌లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 11 చెక్ బుక్‌లు, రూ.2.81 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.



## పూరణ్ కేసులో ట్విస్ట్.. మరో పోలీసు అధికారి ఆత్మహత్య

**చండీగఢ్ :** హర్యానా అదనపు డిజిపి వై.పూరణ్ కుమార్ ఆత్మహత్య కేసులో ట్విస్ట్ చోటు చేసుకుంది. పూరణ్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ తాజాగా మరో పోలీసు అధికారి ఆత్మహత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. పూరణ్‌పై అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ఎఎస్ఐ సందీప్ కుమార్ గన్‌తో కాల్చుకుని సూసైడ్ చేసుకున్నారు. ఆత్మహత్యకు ముందు ఆయన సెల్ఫీ వీడియోను రిలీజ్ చేశారు. రోహతక్ సైబ ర్ సెల్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సందీప్.. పూరణ్ కుమార్ అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆయన మంగళవారం గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. ఈ మేరకు సెల్ఫీ వీడియో రిలీజ్ చేశారు. అందులో పూరణ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. పూరణ్ ఓ అవినీతి అధికారి అంటూ ఆరోపించారు. అవినీతి కేసులో శిక్ష పడుతుందన్న భయంతోనే పూరన్ ఆత్మహత్య చేసుకున్నట్లు సందీప్ కుమార్ వెల్లడించారు. 'పూరణ్ కుమార్ ఓ అవినీతి అధికారి. అతని అవినీతి మామూలుగా లేదు. అదంతా బయటపడుతుందనే భయంతోనే ఆత్మహత్య చేసుకున్నాడు అని పేర్కొన్నారు. సత్యం కోసం తన ప్రాణాలను త్యాగం చేస్తున్నట్లు ఈ సందర్భంగా సెల్ఫీ వీడియోలో సందీప్ కుమార్ పేర్కొన్నారు.





## బిహార్‌లో 71 మంది అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా




**న్యూఢిల్లీ :** అధికార బిజెపి బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు మంగళవారం 71 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను విడుదల చేసి ఆశ్చర్యపరిచింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన స్పీకర్ నంద్ కిషోర్ యాదవ్‌కు టికెట్ నిరాకరించగా, దశాబ్ద కాలం తర్వాత ప్రత్యక్ష ఎన్నికల్లో డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరిని బరిలోకి దింపింది. శాసనమండలి సభ్యుడు, ఆరోగ్య, న్యాయ మంత్రి మంగళ్ పాండేను కూడా పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు పోటీకి నిలిపింది. 2010లో పర్బట్టా నుంచి ఆర్‌జెడి టికెట్‌పై అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన చౌదరి, పక్కనే ఉన్న తారాపూర్ నుంచి పోటీకి దిగగా, పాండేను సివాన్ నుంచి బిజెపి అభ్యర్థిగా ప్రకటించారు. ముఖ్యంగా, చౌదరి, పాండే ఇద్దరూ మాజీ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు. అయితే, తన కుమారుడికి టికెట్ ఆశిస్తున్నట్లు చెప్పబడుతున్న 72 ఏళ్ల మాజీ అసెంబ్లీ స్పీకర్, వెంటనే సోషల్ మీడియాలో 'నేను బిజెపి తీసుకున్న నిర్ణయంతో కట్టుబడి ఉన్నాను. నాకు ఎటువంటి ఫిర్యాదులు లేవు. కొత్త తరం నాయకత్వాన్ని నేను స్వాగతిస్తున్నాను' అని పోస్టు చేశారు. కిషోర్ యాదవ్ మొదట 1995లో పాట్నా తూర్పు నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు, 2008లో డీలిమిటేషన్ తర్వాత పాట్నా సాహిబ్‌గా పేరు మార్చారు, మాజీ డిప్యూటీ సిఎం సుశీల్ కుమార్ మోదీ మరణం తర్వాత రాష్ట్రంలో తన తరంలో మిగిలి ఉన్న చివరి బిజెపి కురవృద్ధుడిగా పరిగణించబడ్డారు. అభ్యర్థుల జాబితాలో ఆశ్చర్యకరమైన అంశం ఏమిటంటే, మాజీ కేంద్ర మంత్రి రామ్ కృపాల్ యాదవ్, తన మాజీ గురువు, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలు ప్రసాద్ పట్ల నిరాశ చెంది 2014లో బిజెపిలో చేరారు. ఆయన పాటలీపుత్ర లోక్‌సభ నియోజకవర్గంలో ప్రసాద్ కుమార్తె మిసా భారతిని రెండుసార్లు ఓడించారు. కానీ గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. పాట్నా శివార్లలోని దనాపూర్ స్థానం నుండి ఆయనకు పార్టీ టికెట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ స్థానానికి ఆర్‌జెడి బలమైన నాయకుడు రీత్ లాల్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఎన్నికల్లో లఖిసరాయ్‌లో హ్యాట్రిక్ సాధించిన ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హాను మళ్ళీ అదే నియోజకవర్గం నుండి పోటీకి నిలిపారు. రేణు దేవి (బెట్టయ్య), నితిన్ నబిన్ (బంకిపూర్), నితీష్ మిశ్రా (ఝంఝార్‌పూర్), జిబేష్ మిశ్రా (జాలే), సంజయ్ సరోగి (దర్భంగా), నీరజ్ కుమార్ సింగ్ బబ్లూ (ఛాతాపూర్), కేదార్ ప్రసాద్ గుప్తా (కుర్హానీ) సహా అనేక మంది మంత్రులు కూడా ఈ జాబితాలో ఉన్నారు. వీరందరూ వారి సిట్టింగ్ స్థానాల నుండి తిరిగి నామినేట్ చేయబడ్డారు. కళ, సంస్కృతి మంత్రి మోతీలాల్ ప్రసాద్‌ను తొలగించారు. ఆయన రిగా సీటు బైద్యనాథ్ ప్రసాద్‌కు దక్కింది. రెండవ అవకాశం ఇచ్చేందుకు నిరాకరించబడిన సిట్టింగ్ ఎమ్మెల్యేల సంఖ్య సుమారు 10 అని బిజెపి వర్గాలు పేర్కొన్నాయి. ఈ జాబితాలో ఐదు సంవత్సరాల క్రితం జముయి నుండి అరంగేట్రం చేసిన ఏస్ షూటర్ శ్రేయసి సింగ్‌తో సహా తొమ్మిది మంది మహిళలు ఉన్నారు.

## సురక్షిత ప్రాంతానికి పారిపోయిన మడగాస్కర్ దేశాధ్యక్షుడు

**అంటనానరివో:** ఆఫ్రికా ఆగ్నేయ తీరప్రాంత దేశం మడగాస్కర్‌లో యువకులు చేస్తున్న ఉద్యమం పరాకాష్ఠకు చేరుకోవడంతో పరిస్థితులు అదుపుతప్పాయి. దేశాధ్యక్షుడు ఆంధ్రీ రాజోలినా (51) అభిశంసన, శిక్షలనుండి తప్పించుకోవడం కోసం పార్లమెంటు (నేషనల్ అసెంబ్లీ)ను రద్దుచేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నందువల్ల దేశం వదిలి సురక్షితమైన ప్రదేశానికి వెళ్ళిపోయినట్లు ప్రకటించారు. ఐతే రాజోలినాను అభిశంసించేందుకు అభిప్రాయసేకరణగా జరిగిన ఓటింగ్‌ను కూడా ఆయన ఖండించి తరస్కరించారు. తనను అభిశంసిస్తూ ఓటింగ్ చేయడ రాజ్యాంగ విరుద్ధమని కూడా ఆయన ప్రకటించారు. ఈ ఓటింగ్‌లో ఎలాంటి ఫలితం వచ్చినా అది బుట్టదాఖలు కావాల్సిందేనని సోషల్ మీడియాలో ఆయన పోస్టింగ్ పెట్టారు. అభిశంసన ఓటింగ్‌కు ముందుగా 163 మంది ఎంపీలలో 110 మంది అభిశంసన ఓటింగ్ జరపాలన్న లేఖపై సంతకాలు చేశారు. పార్లమెంటు రద్దుపై సెనేట్ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకున్నాననీ, గుర్తుతెలియని ప్రదేశం నుండి ఫేస్‌బుక్ ద్వారా ప్రకటించిన డిక్రీలో ఆయన తెలిపారు. ఐతే దీని చెల్లుబాటుపై అస్పష్టత నెలకుంది. పార్లమెంటును రద్దుచేస్తూ జారీ చేసిన డిక్రీ చెల్లుబాటు కాదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీంతో గందరగోళం నెలకుంది. ఫ్రాన్స్ సైనిక విమానం ఎక్కి ఆదివారంనాడే రాజోలినా దేశం వదిలివెళ్ళిపోయినట్లు ప్రతిపక్షాలు, వైమానికదళ అధికారవర్గాలు, ఒక విదేశీ దౌత్యవేత్త చెప్పినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ తెలియజేసింది. ఐతే రాజోలినా మంగళవారంనాడు ఎక్స్ వేదికగా విడిగా మరో పోస్టింగ్ పెడుతూ, దేశంలో తిరిగి కొత్త పార్లమెంటును ఎన్నికల ద్వారా ఏర్పాటు చేసేందుకు చట్టసభను రద్దుచేస్తూ తాను నిర్ణయం తీసుకున్నానని, దేశంలో యువకుల మాట అందరూ వినాలని ఆయన పేర్కొన్నారు. ఇటీవల నేపాల్‌లో, అంతకుముందు బంగ్లాదేశ్‌లో, శ్రీలంకలో కూడా జనరేషన్ జెడ్ ఉద్యమాలు దేశ ప్రభుత్వాలను కూల్చివేశాయి. దేశంలో జనరేషన్ జెడ్ చేస్తున్న ఉద్యమం అదుపుతప్పిందని, పరిస్థితులు చేజారాయని ఆయన ప్రకటించారు. దేశాధ్యక్షుడు రాజోలినా రెండేళ్ళక్రితం ఎన్నికల్లో గెలుపు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఆయన అవినీతి, అక్రమాలకు పాల్పడి గెలిచారన్న ఆరోపణలు సర్వత్రా వ్యాప్తించడంతో దేశంలో యువకుల ఉద్యమం మొదలైంది. ఇన్నాళ్ళు ఆయనకు మద్దతుగా ఉన్న సైనికవర్గం కూడా ఆయనకు దూరమై యువకులకు మద్దతు ఇస్తోంది. సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని రెండు రోజుల క్రితం ప్రకటించింది. మరోవైపు జనరేషన్ జెడ్ ఉద్యమం ఉద్ధృతంరూపం దాల్చింది. ఈ ప్రతిష్ఠంభన మధ్య పార్లమెంటును రద్దుచేసి దేశం వదిలివెళ్ళిపోతున్నట్లు అధ్యక్షుడు రాజోలినా ప్రకటించారు. ఆ దేశంలో సంక్షోభం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు గుర్తుతెలియని శక్తులు కుట్ర చేస్తున్నాయని అధ్యక్ష భవనం రెండు రోజులక్రితం ప్రకటన చేసిన కొద్ది గంటలకే సైన్యంలోని చీలికవర్గం దేశాధికారాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. ఒకప్పుడు దేశాధ్యక్షుణ్ణి అధికారంలో నిలబెట్టేందుకు సహకరించిన సైన్యం ఇప్పుడు దేశంలో నిరసన ప్రదర్శకులతో చేతులు కలపడంతో చీలికవర్గం ఈ ప్రకటన చేసింది. సైన్యంలో త్రివిధ దళాలు తమ చెప్పుచేతల్లో ఉన్నాయని చీలికవర్గం తెలిపింది. 2009లో కుట్రద్వారా రాజోలినాను సైన్యం అధికారంలో కూర్చోబెట్టింది. ఇప్పుడు ఆయనకు ఎదురుతిరిగింది. 2023లో రాజోలినా ఎన్నిక వివాదాస్పదమైనప్పటినుండీ దేశంలో ప్రజాందోళన చెలరేగింది.



## వైద్య విద్యార్థినిపై అత్యాచారం కేసు.. సీన్ రీకన్‌స్ట్రక్షన్



**కోల్‌కతా :** వైద్య విద్యార్థిని అత్యాచారం కేసులో పశ్చిమ బెంగాల్ పోలీసులు మ అరెస్టు చేసిన ఐదుగురు నిందితులను, బాధితురాలి స్నేహితుడిని దర్యాప్తులో భాగంగా నేరాన్ని పునర్నిర్మించడానికి నేర స్థలానికి తీసుకెళ్లారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. అరెస్టు చేసిన వ్యక్తులను, బాధితురాలి స్నేహితుడిని పరానగంజ్ కాలి బారి శ్మశాన వాటిక పక్కన ఉన్న అడవిలోని నేర స్థలానికి తీసుకెళ్లి, శుక్రవా రం రాత్రి అక్కడ జరిగిన నేరానికి సంబంధించి వారి పాత్రలను పునరావృతం చేయమని ఆదేశించారు. ఈ పునర్నిర్మాణాన్ని వీడియోగ్రాఫ్ చేసి, ఆపై వారి వాంగ్మూలాలతో సరిపోల్చుతారు. బాధితురాలి వాంగ్మూలంతో కూడా తా ము దీనిని ధృవీకరిస్తామని దర్యాప్తు బృందంలో భాగమైన పోలీసు అధికారి పిటిఐకి తెలిపారు. నేరం పునర్నిర్మాణం కోసం వచ్చే ముందు దర్యాప్తు అధికారులు బాధితురాలి స్నేహితుడిని దాదాపు గంటసేపు విచారించారని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, నేరానికి సంబంధించి వారు దాచిపెట్టిన ఆధారాలను కనుగొనడానికి మంగళవారం ఉదయం అరెస్టు చేసిన ఐదుగురు నిందితులలో ఇద్దరిని వారి వారి నివాసాలకు తీసుకెళ్లామన్నారు. సోదాల సందర్భంగా పోలీసులు ఇద్దరి ఇళ్ల నుండి కొన్ని దుస్తులను స్వాధీనం చేసుకున్నారని, నేరం సమయంలో వారు వాటిని ధరించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నా రు. అంతకు ముందు దర్యాప్తులో భాగంగా అరెస్టు చేసిన మిగిలిన ముగ్గురు నిందితుల దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. ఈ దుస్తులను ఫోరెన్సిక్ పరీక్షకు పంపుతామని, వచ్చే ఫలితాలు తమ దర్యాప్తులో సహాయపడతాయన్నారు. అరెస్టు చేసిన ఐదుగురు నిందితులు గతంలో ఏదైనా నేరంలో పాల్గొన్నారా అని తెలుసుకోవడానికి వారి నేపథ్యాన్ని కూడా తనిఖీ చేశామని ఆయన అన్నారు. అరెస్టయిన ఐదుగురు నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లను కూడా పరీక్షల కోసం పంపామని, పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా బాధితురాలి తోటి విద్యార్థులను కూడా ప్రశ్నిస్తున్నారని ఆయన అన్నారు. అరెస్టు చేసిన ఐదుగురు నిందితులలో ఒకరు ప్రైవేట్ కళాశాల మాజీ సెక్యూరిటీ గార్డు, మరొకరు ప్రస్తుతం మరొక ఆసుపత్రిలో పనిచేస్తున్నారని పోలీసు అధికారి తెలిపారు. ఒక నిందితుడు స్థానిక పౌర సంస్థలో తాత్కాలిక ఉద్యోగి కాగా, మరొకరు నిరుద్యోగి.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @SCRailwayindia

దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1297/25

**ప్రొఫార్మా 10–1**
**బహిరంగ ప్రకటన**

ఈ కింద పేర్కొన్న సెక్షన్ లో పూర్తయిన సెక్షన్‌పై ఉన్న రైల్వే లైన్లు, ప్రాంగణాల వినియోగదారులందరికీ ఈ ప్రకటన చేయడమైనది.:

**సెక్షన్ హైదరాబాద్:** మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి ధోన్ (డిహెచ్ఎన్ఇ) సెక్షన్ మధ్య 2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త బ్రాడ్‌గేజ్ డబుల్ లైన్ నిర్మాణం. మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి మణ్యంకొండ స్టేషన్ల మధ్య ప్రయాణీకుల రైలు తీసుకువెళ్ళేందుకు 2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త బ్రాడ్‌గేజీ డబుల్ లైన్ ప్రారంభించుటకు -రిజిస్ట్రేషన్.

మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి మణ్యంకొండ (ఎంక్యూన్) స్టేషన్ల మధ్య **2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త డబుల్ లైన్** ఓహెచ్ఇ నుండి స్టేషన్స్ లొకేషన్ నెం: 112/17 (కి.మీ./సిహెచ్: 112/332.40ఎం) నుండి 127/48 (కి.మీ./సిహెచ్. 446/932.60ఎం) దక్షిణమధ్య రైల్వే మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి మణ్యంకొండ (ఎంక్యూన్) స్టేషన్లమధ్య, 25000 ఓల్టులు, 50 Hz., ఎసి ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లకు 01/11/2025 తేదీ నాటికి ఆ తర్వాత గానీ శక్తిని నింపడం పూర్తిచేయాలి. అదే తేదీనాటికి అప్పటినుండీ ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్‌ను ఎల్లవేళలా రాకపోకలకు అందుబాటులో ఉండేలా చూడాలి. మరియు పైన పేర్కొన్న ఓవర్‌హెడ్‌లైన్ సమీపంలో ఎన్‌జి అనధికార వ్యక్తులు వెళ్ళవచ్చు, పని చేయవచ్చు.

**ప్రొఫార్మా 10–2**
**(ఎసిటిఎం పేరా 21020,సంపుటం II, పార్ట్ I: దిద్దుబాటు చీటీ నెం.32, తేదీ: 09.10.2020)**
**ఎసి 25 కెవి ట్రాక్షన్ ప్రవేశం "రోడ్డు యూజర్లకు హెచ్చరిక"**

ఈ క్రింద పేర్కొన్న సెక్షన్‌లో 25 కెవి ఎసి ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ను ప్రవేశపెడుతున్నందువల్ల దీనికి సంబంధించి ప్రజలకు సమాచారము కొరకు తెలియజేయడమైనది:

**సెక్షన్ హైదరాబాద్:** 2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త బ్రాడ్‌గేజీ డబుల్ లైన్ నిర్మాణం: మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి ధోన్ (డిహెచ్ఎన్ఇ) సెక్షన్ మధ్య విద్యుదీకరణ

2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త బ్రాడ్‌గేజ్ డబుల్ లైన్ నిర్మాణం:

మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి మణ్యంకొండ (ఎంక్యూన్) స్టేషన్ల మధ్య ప్రయాణీకుల రైలు తీసుకువెళ్ళేందుకు 2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో బ్రాడ్‌గేజీ కొత్త డబుల్ లైన్ ప్రారంభించుటకు-రిజిస్ట్రేషన్.

మహబూబ్‌నగర్ (ఎంబిఎన్ఆర్) నుండి మణ్యంకొండ (ఎంక్యూన్) స్టేషన్ల మధ్య **2x25 కెవి ఎలక్ట్రిఫికేషన్‌తో కొత్త డబుల్ లైన్ ఓహెచ్ఇ** నుండి స్టేషన్స్ లొకేషన్ నెం: 112/17 (కి.మీ./సిహెచ్: 112/332.40ఎం) నుండి 127/48 (కి.మీ./సిహెచ్.446/932.60ఎం) **దక్షిణమధ్య రైల్వే, రోడ్డు స్థాయికి స్పష్టంగా గరిష్ఠస్థాయిలో 4.78 మీటర్ల ఎత్తులో అన్ని లెవెల్** క్రాసింగ్‌లవద్దా హై గేజెస్‌ను నిర్మించాలి. మితిమీరిన ఎత్తుకు లోడుచేసిన సరుకురవాణా చేసే వాహనాలను లైవ్ ట్రాక్షన్ విద్యుత్ సరఫరా వైర్లకు తగలకుండా, వాటికి దగ్గరగా వెళ్ళకుండా నివారించే దృష్టితో వీటిని నిర్మించాలి. ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, పైన పేర్కొన్న ప్రయోజనాలు నెరవేర్చడం కోసం అక్కడ నిర్దేశించిన ఎత్తును గమనించుకోవాలి. మితిమీరిన ఎత్తుకు లోడుచేసిన వాహనాల నిమిత్తం దీనిని నిర్దేశించడమైనది. రోడ్లపై సరుకు లోడును తీసుకువెళ్ళే వాహనాలు ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ హై గేజెస్‌కు తగలకుండా తక్కువ ఎత్తులో వాటికింద నుండి వెళ్ళాలి.

**సరుకును ఎక్కువ ఎత్తులో లోడుచేస్తే ఈ క్రింది ప్రమాదాలుండును:-**

i) ఎక్కువ ఎత్తుకు సరుకు లోడు చేయడంవల్ల హై గేజ్‌కు ప్రమాదం వాటిల్లును మరియు దానివల్ల రోడ్డుకు అదేవిధంగా రైల్వే లైనుకు కూడా ఆటంకం కలుగును.

ii) సరుకుకు ప్రమాదం సంభవించును లేదా తీసుకువెళ్ళే పరికరాలు లేదా వాహనాలకు ప్రమాదం సంభవించును.

iii) మంటలు చెలరేగే ప్రమాదం మరియు ఈ విద్యుత్ వాహకాలను తగిలినచో, సమీపించినచో ప్రాణాపాయ ప్రమాదం సంభవించును.

A1632 డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/I/C/SC) సికింద్రాబాద్.

ప్రజాపక్షం
బుధవారం, 15 అక్టోబరు

## సిరా తడి ఆరకముందే ఉల్లంఘన


ఇరవై నాలుగు గంటలైనా గడవక ముందే గాజా శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ తూట్లు పొడిచింది. హమాస్–ఇజ్రాయెల్ నడుమ మధ్యవర్తిత్వం వహించిన అమెరికా, ఈజిప్ట్, తుర్కియే, ఖతార్ దేశాధినేతలు ఈ ఒప్పందంపై సోమవారం సంతకాలు చేశారు. ఈజిప్ట్‌లో శాంతి నగరిగా పేరొందిన షెర్మ్ – ఎల్ – షేక్ వేదికగా, రెండు డజన్లకు పైగా దేశాధినేతల సమక్షంలో ఇది జరిగింది. ఒప్పందానికి తాము పూచీకత్తు అని ఘనంగా చెప్పుకున్నారు ట్రంప్ సహా మధ్యవర్తిత్వం వహించిన నలుగురు దేశాధినేతలు. కానీ, మరుసటి రోజే దానిని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తూ గాజాలో జరిపిన కాల్పుల్లో ఆరుగురు పాలస్తీనావాసులు హతమయ్యారు.

నోబెల్ శాంతి బహుమతి ఊహల్లో తేలియాడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నయానో, భయానో 20 సూత్రాల ఒప్పందంపై హమాస్‌ను ఒప్పించారు. అందుకు అనుగుణంగానే తొలిదశలో భాగంగా దాని ఆధీనంలో ఉన్న 20 మంది ఇజ్రాయెలీ బందీలను సోమవారం విడుదల చేసింది. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రతిగా తమ జైళ్లలో మగ్గుతున్న 1,718 మంది పాలస్తీనియన్లను విడిచిపెట్టింది. ఈ సందర్భంగా సంవత్సరాల తరువాత తమ వారిని చూసుకున్న కుటుంబాలు, బంధుమిత్రుల భావోద్వేగ దృశ్యాలు ఇరువైపులా గోచరమయ్యాయి. ఇజ్రాయెల్ వాసులు హర్షాతిరేకాలతో కేరింతలు కొడుతూ, వీధుల్లో నృత్యాలు చేస్తూ తమ వారికి స్వాగతం పలుకగా, గాజావాసులకు ఆ భాగ్యం దక్కలేదు. కోలాహలం లేకుండా తమ వారిని తీసుకెళ్ళాలని ఇజ్రాయెల్ దుర్మార్గ ఆంక్షలు విధించడంతో బందిఖానా ముక్తులైన పాలస్తీనా వాసులకు కంటతడిపెడుతూ మౌన స్వాగతం లభించింది.

ఇక శాంతి ఒప్పందంలో దీర్ఘకాలిక డిమాండ్‌గా ఉన్న రెండు దేశాల పరిష్కారం, లేదా పాలస్తీనా గుర్తింపు, స్వయం పాలన అంశాల ప్రస్తావనే లేదు. ఎట్టకేలకు మరోవైపు ఇజ్రాయెల్ విధ్వంసం కారణంగా దూరంగా వెళ్ళిపోయిన గాజావాసులు, నెమ్మదిగా తిరిగి తమ నగరాలకు చేరుకుంటున్నారు. వారికక్కడ హృదయవిదారక దృశ్యాలు స్వాగతం పలికాయి. తమ కష్టంతో కట్టుకున్న ఇళ్ళు, భవనాలు రాళ్ళ దిబ్బగా మారాయి. సర్వం కోల్పోయి తలదాచుకునేందుకు స్థలం లేక, తినేందుకు ఆహారం లేక నిస్సహాయంగా దీనంగా సాయంకోసం ఎదురుచూస్తున్నారు. ఒక అంచనా ప్రకారం గాజాలో 92 శాతం నివాసభవనాలు, 88 శాతం వాణిజ్య కేంద్రాలు ధ్వంసమయ్యాయి, 62 శాతం గాజావాసులు తమ ఆస్తుల పత్రాలను కోల్పోయారు. రెండేళ్ళ తరువాత స్వస్థలాలకు చేరుకోవడమే కాస్త ఊరట.

ఈజిప్ట్‌కు కంటే ముందు ఇజ్రాయెల్‌కు వెళ్ళిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. స్థానిక పార్లమెంట్ నెస్సెట్‌లో ఆయన చేసిన ప్రసంగంలో యుద్ధాన్ని ఆపిన ఘనతను తనకు తాను ఆపాదించుకోగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు(బీబీ) అందుకు వంతపాడారు. మూడు వేల ఏళ్ళ సంవత్సరాల సమస్యను పరిష్కరించానని ట్రంప్ జబ్బలు చరుచుకోగా, ఆయనను వేల సంవత్సరాలపాటు ఇజ్రాయెలీలు మరిచిపోలేరని బీబీ పొగడ్తల్లో ముంచెత్తారు. నోబెల్ శాంతి బహుమతి లభించని బాధలో ఉన్న ట్రంప్‌కు ఊరటగా ఇజ్రాయెల్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించారు. అంతేకాక వచ్చే ఏడాది మరోసారి నోబెల్ కోసం సిఫార్సు చేస్తామని కూడా బీబీ మాటిచ్చారు. ఉబ్బితబ్బిబ్బైన ట్రంప్ గతంలో నెతన్యాహుపై నమోదైన అవినీతి ఆరోపణలు మాసిపోయేట్లుగా క్షమాభిక్ష ప్రసాదించాలని నెస్సెట్‌లోనే ఇజ్రాయెల్ అధ్యక్షుడిని కోరారు. ఏదో బహుమతులుగా ఇచ్చిన వాటిని అవినీతిగా చూడొద్దన్నారాయన. తనకు తాను యుద్ధాన్ని ఆపానని చెప్పుకుంటున్న అధ్యక్షుడు ట్రంప్ తానే గాజాను ముట్టడించిన మార్కే ఆయుధాలను ఇజ్రాయెల్‌కు సరఫరా చేసినట్లుగా నెస్సెట్ సాక్షిగా ఒప్పుకున్నారు. దీనిని బట్టి ఆయన శాంతి కాముకుడా లేక యుద్ధానికి ఆజ్యం పోశాడా అనేది ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. ట్రంప్ ఏ శాంతి అధిపతిగానో లేదా యుద్ధ అధిపతిగానో ఉండవచ్చు తప్ప ఏకకాలంలో రెండు పాత్రల్లో ఉండలేరని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యాద్ అబ్బాస్ అరాగ్చీ చేసిన వ్యాఖ్యలు వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. శాంతి ఒప్పందంపై సంతకాల సిరా ఆరకముందే ఇజ్రాయెల్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. రెండేళ్ళ యుద్ధ కాలంలో కాల్పుల విరమణ ఒప్పందాలను ఆ దేశం ఉల్లంఘించడం ఇది మూడవసారి. రెండేళ్ళ పాటు గాజావాసులను ముప్పు తిప్పలు పెట్టి, నలువైపులా మూసేసి మానవహననానికి పాల్పడిన యుద్ధోన్మాది నెతన్యాహూ శాంతి ఒప్పందానికి కట్టుబడి ఉండడం సందేహమే!

# గాజాలో మారణహోమం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు



డాక్టర్ అరుణ్ మిత్ర
ప్రెసిడెంట్,
ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్(ఐడిపిడి)

ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ద్వారా దాదాపు రెండు సంవత్సరాలుగా పాలస్తీనా చిన్నారులు, మహిళలపై సాగుతున్న ఇజ్రాయెల్ సైన్యం మారణహోమానికి తెర పడుతుందనే ఆశను రేకెత్తించింది. అయితే, ఒప్పందం తర్వాత కూడా ఇజ్రాయెల్ తమ బాంబు దాడులను ఆపలేదని వార్తలు వస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ, రాబోయే రోజుల్లో ఈ దాడులు తగ్గుతాయనే ఆశ కొంత ఉంది. అయితే, ఈ మారణహోమం అనేక ముఖ్యమైన నిజాలను బయటపెట్టింది.

2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోకి హమాస్ చొరబడి 1200 మందికి పైగా అమాయక ప్రజలను చంపి, 251 మందిని బందీలుగా పట్టుకున్నప్పుడు, ఛేదించలేని భద్రతా కవచం ఉందనే ఇజ్రాయెల్ దీర్ఘకాలిక వాదన వీగిపోయింది. అమాయక ప్రజలు చంపబడటం లేదా బందీలుగా పట్టుబడటం వలన హమాస్ దాడిని ప్రపంచం తీవ్రంగా ఖండించింది. కానీ, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ గాజాలో జరిపిన భారీ మారణహోమం జాతి నిర్మూలనే తప్ప మరొకటి కాదు. ఇది అన్ని అంతర్జాతీయ మానవతా చట్టాలను ఉల్లంఘించడమే.

హమాస్ దాడి తప్పు అని, అది ఇజ్రాయెల్ ప్రతిచర్యలకు పురిగొల్పిందంటూ అనేకమంది ఇజ్రాయెల్ క్రూరమైన ప్రతిస్పందనను సమర్థించారు. అయితే, ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ ఉద్దేశాలు అప్పటికే స్పష్టంగా ఉన్నాయని, ఈ సంఘటన కేవలం దానికి ఒక సాకును మాత్రమే ఇచ్చిందని అర్థం చేసుకోవాలి. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నట్లుగా, "హమాస్ దాడి శూన్యంలో జరగలేదు. ఇది సంవత్సరాల తరబడి జరిగిన అణచివేత ఫలితం. శాంతియుత పాలస్తీనా విముక్తి ఉద్యమాన్ని (పిఎల్‌ఓ నాయకత్వంలో)బలహీనపరిచేందుకే ఇజ్రాయెల్ పరోక్షంగా హమాస్‌ను ఎదగనిచ్చిందని, దానికి నిధులు కూడా సమకూర్చిందని నివేదికలు సూచిస్తున్నాయి. హమాస్ సాయుధ విధానానికి ప్రపంచ మద్దతు ఎన్నటికీ లభించదు కాబట్టి, అది ఇజ్రాయెల్‌కు ప్రయోజనకారిగా మారింది.





ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు తమ దేశం హమాస్‌ను నిర్మూలిస్తుందని ప్రకటించినప్పటికీ, ఈ యుద్ధం హమాస్‌కు మాత్రమే పరిమితం కాలేదు. ఒకవైపు చిన్నారులు, మహిళలు, మరోవైపు భారీగా ఆయుధాలు కలిగిన ఇజ్రాయెల్ సైనికులు నిలబడ్డారు. ఆకలితో అలమటిస్తూ, నిరాశ్రయులైన పిల్లలు నీళ్ళు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తుండగా వారిని కూడా కాల్చి చంపారు. కొన్ని వార్తల ప్రకారం, 65,000 మందికి పైగా చనిపోయారు. వీరిలో 60 శాతం మంది మహిళలు, పిల్లలు. శిథిలాల కింద కూరుకుపోయిన వారిని కూడా లెక్కిస్తే మృతుల సంఖ్య 100,000 దాటవచ్చని కొన్ని నివేదికలు అంచనా వేస్తున్నాయి.

ఇదే సమయంలో, ఇజ్రాయెల్ ఆకాంక్షలు మరింత స్పష్టమయ్యాయి. ఇది సిరియా, లెబనాన్, ఇరాన్, యెమెన్ దేశాలపై దాడులు చేయడమే కాకుండా, వెస్ట్ బ్యాంక్‌లో చట్టవిరుద్ధంగా స్థావరాలను విస్తరించడాన్ని కొనసాగించింది. అక్కడ పాలస్తీనావాసులను వారి ఇళ్ల నుండి తరిమివేసి, వారి భూభాగాన్ని అనుసంధానం లేని ఎన్‌క్లేవ్(విదేశంలోని స్వదేశీ భాగాలు)గా విభజించింది. ఈ ప్రాంతాల మధ్య ప్రయాణించడానికి ఇప్పుడు ఇజ్రాయెల్ చెక్‌పోస్టులను దాటుకొని వెళ్లడం తప్పనిసరి, ఇది పాలస్తీనావాసుల దైనందిన జీవితాన్ని అత్యంత కఠినంగా చేసింది.

పాలస్తీనాను పూర్తిగా తుడిచిపెట్టి, గాజాను పర్యాటక, కార్పొరేట్, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ఆధునిక నగరంగా పునర్నిర్మించాలని అమెరికన్ సామ్రాజ్యవాదం లక్ష్యంగా పెట్టుకుందని ఇప్పుడు స్పష్టమైంది. ప్రధాన బహుళజాతి సంస్థలు, నిర్మాణ లాబీలు ఇప్పటికే గాజా పునర్నిర్మాణం ద్వారా లాభాల కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ పాలస్తీనియన్లు ఎక్కడికి వెళ్తారు?

ఒప్పందంలోని 12వ నిబంధన ప్రకారం, ఎవరూ గాజాను విడిచి వెళ్లడానికి బలవంతం చేయబడరు. వెళ్లాలనుకునే వారికి స్వేచ్ఛ ఉంటుంది, తిరిగి వచ్చేందుకు కూడా స్వేచ్ఛ ఉంటుంది. ప్రజలు అక్కడే ఉండాలని మేము ప్రోత్సహిస్తాము. మెరుగైన గాజాను నిర్మించే అవకాశాన్ని వారికి కల్పిస్తాము. అయితే, వారి స్వంత ఇళ్లకు తిరిగి రావడం గురించి ఏమీ ప్రస్తావించబడలేదు. ఇది గాజాలో పాలస్తీనా వాసులకు ఇక స్థానం లేదనేందుకు సూచన. పాలస్తీనావాసులకు పాలనపై పూర్తి నియంత్రణ ఉండబోదు.

గాజాలో ఉపయోగించిన అధునాతన ఆయుధాలు, బాంబులను నిరంతరం సరఫరా చేయడం ద్వారా ఇజ్రాయెల్ సైనిక శక్తిని నిర్వహించడంలో, బలోపేతం చేయడంలో అమెరికా ప్రధాన పాత్ర పోషించింది. ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్ ఇబ్బందులను ఎదుర్కొన్నప్పుడు సైతం అమెరికా నిఘా సమాచారం, మద్దతును అందించింది. ఖతార్‌లోని హమాస్ నాయకులను హత్య చేయడానికి కూడా ప్రయత్నాలు జరిగాయి. ఈ దేశాల్లోని ప్రజలు ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా అనేక నిరసనలు తెలిపినప్పటికీ, ఈ మారణహోమం అంతటా పాశ్చాత్య దేశాలు ఎక్కువగా ఇజ్రాయెల్‌కు అండగా నిలిచాయి.

1940లలో మారణహోమం సమయంలో యూదులపై జరుగుతున్న సామూహిక జాతి నిర్మూలన దాడుల గురించి ప్రపంచానికి పెద్దగా తెలియదు. కానీ నేడు, పిల్లల హత్యలు, ఆకలితో, దాహంతో బాధపడుతున్న వారి బాధను ప్రపంచం వాస్తవ సమయంలో చూసింది. అయినప్పటికీ మౌనం వహించింది. పాలస్తీనావాసులు ఇతర దేశాల నుండి మద్దతు ఆశించి ఉండవచ్చు. కానీ అరబ్ ప్రభుత్వాలు ఏవీ వారికి బహిరంగంగా మద్దతు ఇవ్వలేదు. వీటిలో చాలావరకు ప్రజాస్వామ్యం లేని రాచరికాలు. ఇక్కడ పాలకులు తమ ప్రజల ఇష్టాల కంటే అమెరికాతో తమ సంబంధాలకు ఎక్కువ విలువ ఇస్తారు. తమను తాము ఇస్లామిక్ రిపబ్లిక్ అని చెప్పుకునే, ఇస్లామిక్ నాటో కోసం వాదించే పాకిస్తాన్ కూడా పాలస్తీనా కోసం అర్థవంతంగా ఏమీ చేయలేదు. అదిప్పుడు అమెరికాతో సాన్నిహిత్యం కోసం ప్రయత్నిస్తోంది.


అదే సమయంలో కార్పొరేషన్‌లు ఈ మారణహోమం నుండి లబ్ధి పొందాయి. అనేక కంపెనీలు ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, డ్రోన్లు, నిఘా చిప్‌లను సరఫరా చేశాయని, ఇవి దాని సైన్యాన్ని బలోపేతం చేసి, సుదీర్ఘ సామూహిక జాతి నిర్మూలనను కొనసాగించాయని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించింది. ఈ యుఎన్ నివేదిక ఇజ్రాయెల్ 'జాతి నిర్మూలన'కు సహకరించిన కంపెనీలను జాబితాను తయారు చేసింది. ఇజ్రాయెల్ ఆక్రమణ, గాజాపై యుద్ధానికి సహాయం చేస్తున్న కంపెనీలలో అనేక అమెరికా దిగ్గజాలను పేర్కొంటూ యుఎన్ ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సిస్కా అల్బనీస్ ఒక నివేదికను విడుదల చేసింది. చైనా నుండి మెక్సికో వరకు ఇతర దేశాల కంపెనీల పేర్లు కూడా ఇందులో ఉన్నాయి. భారత ప్రభుత్వం తమ దీర్ఘకాలిక పాలస్తీనా అనుకూల వైఖరిని విడిచిపెట్టి, బహిరంగంగా ఇజ్రాయెల్‌కు మద్దతు పలికింది. అనేక భారతీయ కంపెనీలు కూడా ఇజ్రాయెల్‌కు సామాగ్రిని సరఫరా చేశాయి. పాలస్తీనియన్లను వారి ఉద్యోగాల నుండి తొలగించిన తర్వాత వారి స్థానంలో భారతీయ కార్మికులను (వారి జీవితాలకు ప్రమాదం ఉన్నప్పటికీ) ఇజ్రాయెల్‌కు పంపారు.

సాధారణ ఫాసిస్ట్ పద్ధతిలో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని యూదు వ్యతిరేకులు అనే ముద్ర వేశారు. భారతదేశంలో, పాలస్తీనాకు మద్దతు పలికిన గొంతులను అణచివేయడానికి ముస్లిం వ్యతిరేక హిస్టీరియా(కట్టడి లేని భావోద్వేగాల)ను ఉపయోగించారు. పాలస్తీనాతో భారతదేశ చారిత్రక సంఘీభావం బలహీనపడింది. బిజెపి పాలిత రాష్ట్రాలలో, పాలస్తీనాకు అనుకూలంగా బహిరంగ ప్రదర్శనలను నిషేధించడమే కాకుండా సమావేశ గదులలో చర్చలు నిర్వహించడానిని కూడా నిషేధించారు. అటువంటి సమావేశాలను భగ్నం చేయడానికి మితవాద హిందూ మత మౌఢ్య సమూహాలను సమీకరించారు. ఇది ఇజ్రాయెల్ జియోనిజం(యూదుమతవాదం), హిందుత్వ జాతీయవాదం మధ్య ఉన్న భావజాల సారూప్యతను బయటపెట్టింది.

ఈ పరిణామాలు ప్రపంచ భౌగోళిక రాజకీయాల భవిష్యత్తు గురించి, సామ్రాజ్యవాద, నయావలసవాద శక్తులు మళ్లీ ఇతర దేశాలపై ఆధిపత్యం చెలాయించడానికి ఎలా ప్రయత్నిస్తున్నాయనే దాని గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయి. దురదృష్టవశాత్తు, ఈ మారణహోమంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలబడిన డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు నోబెల్ శాంతి బహుమతి కోసం చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో రానున్న కాలంలో, శాంతి, న్యాయం, మానవ గౌరవం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి, ఐక్యంగా ఉండటం అత్యంత అవసరం.

## అనన్య సామాన్య ప్రతిభా మూర్తి...
# అబ్దుల్ కలాం



మహనీయుల జీవిత గాథలు చరిత్రకే అలంకారం. చరిత్ర సృష్టించడమే కాదు. 'చరిత్ర'కే నిర్వచనం చెప్పే నిస్వార్థ సేవకులు ఈ భరత ధరిత్రిపై జన్మించారు. అనేకరంగాల్లో తమ మేథస్సును చాటిచెప్పి, తాము దేశం కోసమే జన్మించామని, దేశం కోసమే తమ జీవితం అంకితమని నిరూపించి చరిత్రపుటల్లో నిలిచిపోయిన అనన్య సామాన్యమైన ప్రతిభా వంతులను, స్ఫూర్తి దాతలను స్మరించుకోవడం మన కనీస బాధ్యత. తుదిశ్వాస వరకు విద్యార్థులకు స్ఫూర్తిని రగిలించిన అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి పరిగణించడం భారతీయులకు అత్యంత గర్వకారణం. ఇది అబ్దుల్ కలాం సేవలకు నిజమైన గుర్తింపు. అహర్నిశలూ భారతదేశ ప్రగతికోసం తపించిన కలాం గురించి ఎంత చెప్పినా తక్కువే.

భారతీయ విజ్ఞానం అమోఘమైనది, అనితర సాధ్యమైనది. భారతదేశం పాలు పొంగే జీవగడ్డ. సంపదకు పురిటిగడ్డ. విజ్ఞానానికి వేదిక. ప్రాచీన కాలం నుంచీ భారతదేశం విజ్ఞానరంగంలో ముందంజలో ఉంది. శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రపంచానికి పరిచయం కాకముందే భారతదేశం ఈ రంగాల్లో అగ్రస్థానంలో ఉంది. అయితే అప్పట్లో మన పరిశోధనలకు, ప్రయోగాలకు ప్రాచుర్యం లభించలేదు. గ్రంథస్థం చేసే సౌలభ్యం ప్రాచీన కాలంలో లేదు. తాళపత్ర గ్రంథాలలోనో, సంస్కృత లిపిలోనో మనవైభవం నిక్షిప్తమై ఉండేది. కాలానుగుణంగా ఇవన్నీ జీర్ణించుకుపోయాయి. మన సంపదతో పాటు విజ్ఞానాన్ని కూడా పరాయి దేశాలు కొల్లగొట్టాయి. అయినప్పటికీ కొంత విజ్ఞానం ప్రపంచానికి తెలిసింది. నేడు ప్రపంచం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలోకి దూసుకుపోతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లోను, అంతరిక్ష పరిశోధనా రంగాలలోను అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఏ దేశమైనా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అన్నిరంగాల్లో పురోగతి సాధించాలి. దేశరక్షణ అనేది ప్రతీ దేశానికి తలకు మించిన భారంగా మారింది. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాలకు రక్షణావసరాలు అధికం. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుకోవాలంటే రక్షణరంగాన్ని పటిష్టపరచక తప్పదు. ప్రపంచంలో పలు దేశాలు అణ్వస్త్ర దేశాలు కావడం వలన మనం కూడా అణ్వస్త్ర పాటవం కలిగి ఉండక తప్పడం లేదు. భారతదేశం ఎప్పుడూ శాంతి కాముకదేశమే, పైగా 'నో ఫస్ట్ యూజ్ ఆఫ్ న్యూక్లియర్ వెపన్స్' అనే స్వయం నిబంధన విధించుకున్నాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఫోఖ్రాన్1 అణు పరీక్షలకు, వాజ్‌పాయ్ ప్రభుత్వం ఫోఖ్రాన్ 2 అణు పరీక్షలకు సాహసం చేయడం జరిగింది. ఫోఖ్రాన్2 అణుపరీక్షల్లో మన క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం పాత్ర శ్లాఘనీయం. భారతదేశం అణ్వస్త్ర రంగంలో ముందంజలో ఉంటేనే శత్రుదేశాలకు వెన్నులో వణుకు పుడుతుందని అబ్దుల్ కలాం భావించారు. భారతదేశంపై ఆర్థికపరమైన ఆంక్షలు విధించినప్పటికీ, అబ్దుల్ కలాం పై ఎన్ని ఒత్తిడులు వచ్చినప్పటికీ ఆయన తలొగ్గలేదు. అప్పటి ప్రభుత్వానికి కలాం చేసిన సూచనల ఫలితమే భారతదేశం అణ్వస్త్ర రంగంలో పురోగతి సాధించింది. బోటు నడుపుకునే కుటుంబం నుంచి వచ్చిన అతి నిరుపేద అబ్దుల్ కలాం తన తల్లిదండ్రుల కష్టాలను చూసి, వారికి చేదోడు వాదోడుగా ఉండాలనే దృఢ నిశ్చయంతో పేపర్ బాయ్‌గా పనిచేసి, భౌతిక శాస్త్రంలో పట్టా పొంది, మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎయిరో స్పేస్ ఇంజనీర్ గా బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టడం జరిగింది. డి.ఆర్.డి.వో నుంచి ఇస్రో వరకూ ఎక్కడ పనిచేసినా దేశం కోసమే కలాం తన సమయాన్నంతా వెచ్చించడం జరిగింది. హోమీ జహంగీర్ బాబా, సతీష్ ధావన్ లాంటి ప్రఖ్యాత శాస్త్రవేత్తలు నేటి తరానికి తెలియకపోవచ్చునేమో గాని అబ్దుల్ కలాం పేరు తెలియని వారంటూ ఎవరూ లేరు. యువతపైన, విద్యార్థుల పైన 'కలాం' ప్రభావం అసాధారణం.

అబ్దుల్ కలాం కేవలం శాస్త్రవేత్త, క్షిపణి పితామహుడు మాత్రమే కాదు ఆయనలో ఒక తత్వవేత్త, ప్రకృతి ప్రేమికుడు, పర్యావరణ మిత్రుడు, రచయిత దాగివున్నాడు. అబ్దుల్ కలాం ఒక దార్శనికుడు, సాత్వికుడు, స్వాప్నికుడు. ప్రతి ఒక్కరూ తమ స్వప్నాలను సాకారం చేసుకోవాలని, అందు కోసం అహర్నిశలూ కృషి చేయాలని, తమ స్వప్నాలను సాకారం చేసుకుని, దేశాభ్యున్నతికి పాటుపడాలని నేటి తరానికి దశా దిశా నిర్దేశించిన చైతన్య దీప్తి అబ్దుల్ కలాం. ఆయనకు ఎన్ని అవార్డులు వచ్చినా, వాటికి అతీతంగా నిగర్విగా, నిరాడంబరంగా జీవించిన నిజమైన దేశభక్తుడు భారతరత్న అబ్దుల్ కలాం. తాను రాష్ట్రపతిగా ఉన్నంతకాలం ప్రజలకోసమే తపించి, ప్రజల రాష్ట్రపతిగా పేరుగాంచారు. రెండు సూట్లు, నాలుగు చొక్కాలతో అతి నిరాడంబర జీవితం గడిపి, తుదిశ్వాస వదిలేముందు కూడా యువతను విద్యార్థులను తన చైతన్య వంతమైన ప్రసంగాలతో ఆకట్టుకున్న అపార ప్రజ్ఞాశాలి అబ్దుల్ కలాం. ఈ దేశానికి అబ్దుల్ కలాం లాంటి దేశభక్తులు, దార్శనికులు చాలా అవసరం. ఆయన కీర్తి అజరామరం,ఆచంద్ర తారార్కం. ఆయన ఆశించిన భారతావనికై యువత, విద్యార్థిలోకం నడుం బిగించాలి. కలాం స్ఫూర్తితో దేశాన్ని ముందుకు నడిపించాలి. భారతదేశం అభివృద్ధిలో ముందుకు సాగుతున్నా, ఆర్థిక అంతరాలకు ఆద్యంతాలు లేకుండా పోవడం ఆక్షేపణీయం. ఈ పరిస్థితులు మారాలి. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి. శ్రమశక్తిని గౌరవించాలి. ప్రభుత్వ వేతన జీవులంతా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలి. దేశంకోసం శ్రమించాలి. భారతదేశానికి శతృదేశాల పీడ అధికమవుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థను పటిష్ట పరచాలి. అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలను, రక్షణరంగ నిపుణులను తయారు చేయాలి.

*(అక్టోబర్ 15, అబ్దుల్ కలాం జయంతి, ప్రపంచ విద్యార్థుల దినోత్సవం)*

# విప్లవోద్యమ నిర్మూలన సాధ్యమేనా?

దేశంలో బిజెపి పాలన అమెరికా సుంకాలు, పెరిగిన నిరుద్యోగం, మతవిద్వేషాలు అంశాలతో పాటు ఇప్పుడు మావోయిస్టు ఉద్యమం భవితవ్యం పైన దేశవ్యాప్తంగా చర్చ సాగుతుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి వామపక్ష విప్లవోద్యమం ఏదో ఒక ప్రాంతంలో కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు 2026 మార్చి తర్వాత భారతదేశంలో నక్సలిజం ఇక ఉండదని మావోయిస్టు పార్టీని ఉండనివ్వబోమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రకటన కూడా చర్చనీయాంశమవుతుంది. ఇప్పుడు ఉన్న మావోయిస్టు పార్టీని లేదా విప్లవోద్యమ నిర్మూలన సాధ్యమేనా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. గడిచిన రెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం దండకారుణ్యంలో చేపట్టిన అనేక చర్యలు ప్రభుత్వానికి సానుకూల ఫలితాలను ఇచ్చి ఉండవచ్చు. సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల కోటల్లో పోలీసులు పాగా వేయవచ్చు. పోలీసులకు ప్రవేశం దొరకని చోట ఇప్పుడు బేస్ క్యాంపులు ఏర్పాటు చేయవచ్చు. ఎవరో ఒకరి సాయంతో మావోయిస్టు అగ్రనేతలను లోబర్చుకోవడమో లేదా వివిధ రూపాలలో హతమార్చడం కూడా జరిగి ఉండవచ్చు. భౌతికంగా మావోయిస్టులను ఏరివేయవచ్చు. శాశ్వతంగా విప్లవోద్యమ తుపాకుల జాడ వినిపించని స్థితికి విప్లవోద్యమ ప్రభావిత ప్రాంతాలను తీసుకురావచ్చు. కానీ విప్లవోద్యమ భావజాలం మాటేమిటన్నదే ఇప్పుడు ప్రశ్న. వ్యవస్థ మార్పుకోసం పోరాడుతున్న వారిని హతమార్చినంత మాత్రాన వ్యవస్థ మారాలన్న నినాదాన్ని నిలుపుదల చేయడం సాధ్యం కాదు. ఇప్పటి కేంద్రప్రభుత్వం చెబుతున్నట్లుగా మావోయిస్టు పార్టీ అంతకు ముందు పీపుల్స్‌వార్ ఇంకొంచెం ముందుకు వెళితే భారత కమ్యూనిస్టు పార్టీ, (మార్క్సిస్టు, లెనినిస్ట్) పార్టీ దేనికొరకు పోరాడుతున్నది అన్నది ప్రధానమైంది. ఏజెన్సీ ప్రాంతాలనే ఎందుకు ఎంచుకున్నది. 1960 దశకంలో భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలు ప్రారంభమైన తర్వాత సాయుధ బలగాలు సమాజ మార్పు కోసం తమదైన పంథాలో పనిచేస్తున్నాయి. తొలుత సమాజానికి దూరంగా వెలివేయబడి అభివృద్ధికి నోచుకోని కోట్లాదిమంది ప్రజల పక్షాన సాయుధులు తమ గొంతుక వినిపించారు. వారి హక్కుల కోసం పోరాడారు. సాయుధ ఉద్యమ ఫలితాలను పరిశీలించే ముందు సాయుధ పోరాటంలో పాల్గొన్న వారి త్యాగాలను కూడా మనం మననం చేసుకోవాలి. సాయుధ పోరాటంలోకి ఉన్నత విద్యను అభ్యసించి ఈ సమాజ మార్పును కోరుకునే వారే ప్రవేశించారు. అనేకమందిని పోగేశారు. ఎవరు ఔనన్న, కాదన్న భారతదేశ రాజకీయ చిత్ర పటంపై సమాజ మార్పుకు చేసిన కృషి చెరిపేయలేనిది ఇది వాస్తవం. సాయుధ పోరాటంలో కొన్ని తప్పులు జరిగి ఉండవచ్చు. వాటితో పాటే ప్రజల ఆలోచనా విధానంలోనూ మార్పులు వచ్చాయి. అంకిత భావం స్థానే అవకాశవాదం చోటు చేసుకుంటున్నది. ఏరోజు మేలుచేస్తే ఆరోజు గుర్తుంచుకుని మరుసటి రోజుకు మరిచిపోయే పరిస్థితులు నెలకొన్న ఈ రోజుల్లో మావోయిస్టులకు కొంతమేర మద్దతు తగ్గిందన్నది నిజం. కానీ మావోయిస్టుల సంఖ్య కూడా పరిమితం కావచ్చు. పోలీసులు చెబుతున్నట్లు వందలమంది లొంగిపోవడం, ఏ ఎన్‌కౌంటర్ జరిగినా పదుల సంఖ్యలో మావోయిస్టు సాయుధులు మరణించడం ఇక మిగిలింది వీరేనంటూ సంఖ్యలు, అంకెలు, పేర్లు చెబుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో 2026 మార్చి 31 నాటికి అసలు మావోయిస్టులే లేరన్న ప్రకటన కూడా రావచ్చు. అడవులను విముక్తి చేశాం అంటూనే అంబానీ, అదానీలు లేదా మరికొన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే పరిస్థితి రావచ్చు. మావోయిస్టు వ్యతిరేకులు సంబురాలు చేసుకోవచ్చు. కానీ ఆ భావజాలం అంతమవుతుందా. భారతదేశ వ్యాప్తంగా బిజెపి వ్యతిరేక భావజాలం పెరుగుతుంది. బూర్జువా పార్టీల నేతలు సైతం కమ్యూనిస్టుల అవసరాలను గుర్తిస్తున్నారు. బహిరంగవేదికల మీద కమ్యూనిస్టుల అవసరం ఉందని ఈ దేశంలో కమ్యూనిస్టులు ఉండాలంటూ నొక్కి చెబుతున్నారు. వాక్ స్వాతంత్ర్యానికి భంగం కలిగినప్పుడు మనిషిని మనిషి దోచుకునే పరిస్థితి ఏర్పడినప్పుడు మనిషిపై బలవంతపు భావజాలాన్ని రుద్దినప్పుడు, స్వేచ్ఛగా తన భావాన్ని వ్యక్తం చేయలేనప్పుడు తొలుత గుర్తుకు వచ్చేది కమ్యూనిస్టులు. హక్కులు కోల్పోతున్న వారి కి ఆదరణ కరువైన వారికి, ఆపదలో ఉన్న వారికి గుర్తుకు వచ్చేది కూడా కమ్యూనిస్టులే. ఎర్రజెండాను పట్టుకోలేని వారు గతంలో ఎర్రజెండాను కాదనుకున్న వారు సైతం ఇప్పుడు ఆ జెండాల గొప్పతనాన్ని, అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మావోయిస్టులను హతమార్చడం సాధ్యమేమో కానీ ఆ భావజాలాన్ని రూపుమాపడం సాధ్యం కాదు. భావజాలం బిజెపి విధానాలు మారనంత కాలం సంపదను కొంత మందికి దఖలు పరిచే విధానం పోనంతకాలం భావజాలం పెరుగుతూనే ఉంటుంది. పెరుగుతున్న ఆర్థిక అంతరాలు, నిర్బంధంలో నుంచి విప్లవోద్యమం ఎదుగుతూనే ఉంటుంది తప్ప అంతం కాదు. అది ఏదో ఒక రూపంలో మళ్లీ నవ యవ్వన శక్తితో ముందుకొస్తుంది. మావోయిస్టులను హతమార్చడం ద్వారా మాత్రం ఆ భావజాలం అంతం కాదని అది ఏదో ఒక రూపంలో బహిర్గతమవుతుందని గుర్తుంచుకోవాలి. వామపక్ష తీవ్రవాదం పుట్టుకకు కారణమైన వ్యవస్థలోని లోపాలను సరి చేయకుండా వామపక్ష తీవ్రవాద బలోపేతానికి కారణాలను అన్వేషించకుండా సాయుధ బలగాలతో పైచేయి సాధించినంత మాత్రాన విప్లవోద్యమం అంతం కాదు విప్లవోద్యమ లక్ష్యం నెరవేరితే తప్ప.



**ఏనుగు వెంకటేశ్వరరావు,** ఖమ్మం

# పరిశుభ్ర చేతులతోనే సురక్షిత జీవితం




చేతులు కడుక్కోవడం అనేది సూక్ష్మ జీవ వ్యాధుల వ్యాప్తిని అరికట్టే అత్యంత సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన ఆరోగ్య చర్య. ప్రపంచ ఆరోగ్య సంస్థ మరియు యునిసెఫ్ అంచనాల ప్రకారం, సబ్బుతో చేతులు కడుక్కోవడం ద్వారా డయేరియా వ్యాధులు 40 శాతం వరకు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు 25 శాతం వరకు తగ్గుతాయి. మానవ చర్మంపై కోట్ల సూక్ష్మ జీవులు సహజంగా నివసిస్తాయి; వీటిలో కొన్ని హానికరమైన పాథోజెన్స్‌గా మారి ఆహారం, తలుపుల హ్యాండిల్స్, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులను చేతులతో తాకడం ద్వారా వ్యాపిస్తాయి. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ నివేదిక ప్రకారం, సబ్బుతో 20సెకన్లపాటు చేతులు కడుక్కోవడం ద్వారా సూక్ష్మ జీవుల సంఖ్య 99శాతం తగ్గుతుంది.

**ప్రపంచ పరిశుభ్రత పాఠాలు :** 2020లో కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రత ప్రాధాన్యతను మరింతగా వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ హ్యాండ్ హైజిన్ ఫర్ ఆల్ అనే గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించింది. జపాన్, సింగపూర్, కొరియా వంటి దేశాలు సెన్సార్ ఆధారిత హ్యాండ్ వాష్ స్టేషన్లు ఏర్పాటు చేసి పరిశుభ్రతను సాంకేతిక మార్గంలో విస్తరించాయి. భారత్‌లో స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామీణ పాఠశాలల్లో తక్కువ ఖర్చుతో నీరు, సబ్బు సదుపాయా లు ఏర్పాటు చేయడం వలన కరోనా సమయంలో ఇన్ఫెక్షన్ల రేటు తగ్గింది. ఈ అనుభవం పరిశుభ్రత కేవలం వ్యక్తిగత చర్య కాదు, సామూహిక ఆరోగ్య రక్షణకు కీలకమైనదని ప్రపంచానికి గుర్తు చేసింది.

యునైటెడ్ నేషన్స్ నివేదికల ప్రకారం, ప్రపంచ జనాభాలో సుమారు 2.1 బిలియన్ మందికి చేతులు కడుక్కోవడానికి అవసరమైన నీరు లేదా సబ్బు సదుపాయం లేదు. ఇది ముఖ్యంగా ఆఫ్రికా, దక్షిణాసియా, లాటిన్ అమెరికా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా ఉంది. ఉదాహరణకు, నైజీరియాలో యునిసెఫ్ అమలు చేసిన శుభ్రమైన చేతులు ప్రాజెక్ట్ ద్వారా మూడు సంవత్సరాల్లో డయేరియా కేసులు 28 శాతం తగ్గాయి. బంగ్లాదేశ్‌లో ప్రారంభించిన సోపీ వాటర్ స్టేషన్లు అనే తక్కువ ఖర్చు విధానం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఒక చిన్న సీసా, కొంత నీరు, సబ్బుతో వందలమంది ప్రతిరోజూ చేతులు కడుక్కోగలిగే సదుపాయం అందించారు. ఈ ప్రయత్నాలు సామాన్య వనరులతో పెద్ద ఆరోగ్య మార్పులు సాధ్యమని నిరూపించాయి.

**ఆరోగ్యమే ఆర్థికాభి వృద్ధికి మూలం :** పిల్లల్లో పరిశుభ్రత అలవాటు పెంపొందించడం దీర్ఘకాల ఆరోగ్యానికి పునాది వేస్తుంది. కెన్యాలోని నైరోబీ పాఠశాలల్లో ప్రతిరోజూ హ్యాండ్ వాష్ కార్యక్రమం ప్రారంభించడంతో విద్యార్థుల హాజరు 20 శాతం పెరిగింది. భారత్‌లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో హ్యాండ్‌వాష్ హీరోస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశుభ్రత రాయబారులుగా మారుతున్నారు. ఈ చర్యలు విద్య, ప్రవర్తన మార్పు ఆధారంగా ఆరోగ్య సంస్కృతిని ఏర్పరుస్తున్నాయి. అలాగే వ్యాధి భారం తగ్గి, ఆరోగ్య ఖర్చులు తగ్గుతాయి, ఉత్పాదకత పెరుగుతుంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, పరిశుభ్రతలో పెట్టుబడి చేసిన ప్రతి ఒక డాలర్‌కు మూడు డాలర్ల లాభం వస్తుంది. ఇండోనేషియాలో హ్యాండ్ హైజీన్ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కార్యాలయాల్లో గైర్హాజరు రేటు 19 శాతం తగ్గింది. ఈ ఉదాహరణలు పరిశుభ్రత అనేది ఆరోగ్య చర్య మాత్రమే కాక ఆర్థిక అభివృద్ధికి కూడా ప్రేరణ అని చూపుతున్నాయి. డిజిటల్ యుగంలో గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే వంటి కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా కోట్లమంది ప్రజలను చేరుకుంటున్నాయి. మనం అమలు చేసే ఈ చిన్న చర్యతో ప్రపంచ ఆరోగ్యాన్ని కాపాడగలము. పరిశుభ్రమైన చేతులు సురక్షిత సమాజానికి బాటవేసే శాస్త్రీయ చర్యగా నిలుస్తాయి.

**జి.వెంకటరమణ గౌడ్,** 9866878769

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/కేశంపేట :** కేశంపేట మండలం లేమామిడి గ్రామానికి చెందిన సంపంగి ఆంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్యులు కాలుకు సర్జరీ చేసేందుకు సుమారుగా రెండు లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గోగు జగత్‌రెడ్డి తన వంతు సహాయంగా రూ.10వేలు, కౌకుంట్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఐదు వేల చొప్పున మొత్తం రూ.15వేల నగదును వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. ఆంజనేయులుది నిరుపేద కుటుంబమని, మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేసేందుకు కృషి చేయాలని దాతలు గోగు జగత్‌రెడ్డి, కౌకుంట్ల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు.

## బాక్సింగ్‌లో రాణించిన భవ్య తేజ




**ప్రజాపక్షం/కొందుర్గు:** అండర్–17 విభాగంలో మంగళవారం హన్మకొండలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో కొందుర్గు మండల కేంద్రానికి చెందిన ప్రథమ చికిత్స కేంద్రం డాక్టర్ కుమార్తె భవ్య తేజ బంగారు పతకం సాధించింది. హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పతకం అందజేసి భవ్యతేజను ప్రత్యేకంగా అభినంధించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే యువతీ, యువకులను క్రీడల్లో ప్రోత్సహిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. భవ్యతేజ మరెన్నో పతకాలను తెచ్చుకొని ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు భవ్యతేజ కృషి చేయాలని కోరారు.

## కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

### హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆటో సాయి నగర్ కాలనీ సమస్యలు పరిష్కారం దిశగా కృషి చేస్తామని హయత్ నగర్ డివిజన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆటో నగర్ సాయి నగర్‌లో కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు, శానిటేషన్ సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. సంబంధిత అధికారులతో సమిక్ష నిర్వహించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఏఈ హేము నాయక్, కాలనీ అధ్యక్షులు మాధవరెడ్డి, బిజెపి నాయకులు పార్వతి తదితరులు ఉన్నారు.

## శాంతిభద్రతలకు సహకరించాలి

### డిసిపి అనురాధకు చిలుక మధుర సత్కారం




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఎల్‌బినగర్ డిసిపిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బి.అనురాధను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి మంగళవారం మర్యాధ పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డిసిపికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిసిపి అనురాధ మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



**ప్రజాపక్షం/షాబాద్:** బిసిలకు 42 శాతం రిజరేషన్ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో పెట్టాలని బిసి సంఘం నేతలు తమ్మలి రవీందర్, మద్దూర్ పాండు డిమాండ్ చేశారు. షాబాద్‌లో మంగళవారం రిలే నిరహర దీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిలకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు రాపోలు నర్సిలు, చేవెళ్ల స్వామి, శ్రీనివాస్ గౌడ్, ఒగ్గు రాజు, మాసయ్య, లింగం, వెంకటయ్య గౌడ్, సందీప్, బర్క వెంకటేష్, సత్యనారాయణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌చారికి శుభాకాంక్షలు తెలిపిన వేణుగోపాల్‌యాదవ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** దిల్‌సుఖ్‌నగర్ టూ వీలర్స్ మెకానిక్ ఆసోసియేషన్ అధ్యక్షుడిగా హరీష్‌చారి ఎన్నిక కావడం హర్షనీయమని గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లో హరీష్‌ను కలిసి వేణుగోపాల్ శాలువాను కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శరత్‌యాదవ్, సంజయ్, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అపరిశుభ్ర హోటళ్లకు జరిమానా

**ప్రజాపక్షం/గండిపేట:** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు జరిమానా విధించారు. మంగళవారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనీ పలుహోటళ్లలో తనిఖీ నిర్వహించారు. శుభ్రత ప్రమాణాలు పాటించని హోటల్ యజమానులకు రూ.28 వేల జరిమానాలు విధించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, జవాన్లు సిబ్బంది పాల్గొన్నారు.

## నిర్మాణాలకు అడ్డుగా కరెంట్ తీగలు

**ప్రజాపక్షం/గండిపేట:** ఇంటి నిర్మాణానికి అడ్డుగా ఉన్న కరెంటు తీగలను ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడి తీయిస్తామని మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మణికొండ మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన సందర్శించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ఆలస్యం అవుతుండడంతో అడ్డుగా ఉన్న విద్యుత్ వైర్లను విద్యుత్ అధికారుల తో మాట్లాడి వాటిని తీపిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రవణ్ కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో గొలుసు చోరీ

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై బ్యాట్ తో దాడి చేసి కారంపొడి జల్లి మెడలో పుస్తెలతాడు లాక్కొని వెళ్లిన ఘటన శంకర్ పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుంబారి సిద్ధారెడ్డి హోటల్ నిర్వాహకుడు.. అతను హోటల్ సమీపంలో ఉంటున్నాడు. ఉదయం హోటల్లో పని ముగించుకున్న భార్య ఇంటికి వెళ్లింది. ఎంతకు భార్య రాకపోవడంతో మధ్యాహ్నం సమయంలో భార్యకు ఫోన్ చేశాడు..భార్య ముందు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. కొద్ది సేపటి తరువాత ఫోన్ చేసి ఓగుర్తు తెలియని వ్యక్తి దాడిచేసి పుస్తెలతాడు తెంచుకెళ్లినట్లు తెలిపింది. సిద్ధారెడ్డి వెంటనే ఇంటికి వెళ్లి చూడగా భార్య తలకు గాయమై పడి ఉంది. భార్య చెప్పిన విషయాన్ని తెలుసుకున్న సిద్ధారెడ్డి దుండగుడు పారిపోయిన దారిలో వెళ్ళగా సమీపంలోని వాటర్ వాష్ దగ్గర ఓ వ్యక్తిని ప్రవీణ్ అతని పనివారు పట్టుకున్నారు. అతని దగ్గర బ్యాగులో మంకీ క్యాప్, కారంపొడి ప్యాకెట్ ఇతర వస్తువులు దొరకడంతో దొంగతనానికి పాల్పడింది అతనే అని నిర్ధారించుకొని పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. గాయపడిన సిద్ధారెడ్డి భార్యను ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోలీసులు నిందితుడి నుంచి మూడున్నర తులాల బంగారు తాడును స్వాధీనం చేసుకున్నారు. స్పందించి దొంగను పట్టుకున్న స్థానికులను శంకర్‌పల్లి సిఐ శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

## బాణాసంచాకు అనుమతి తప్పనిసరి

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** బాణాసంచా దుకాణాలు పెట్టుకునేవారు తప్పనిసరిగా పోలీస్ వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు పెట్టుకోవాలని సిఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాణాసంచా దుకాణాలు పెట్టుకునే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీరు,ఇసుక తదితర సామాగ్రి తమ దుకాణాల పక్కన పెట్టుకోవాలని సూచించారు.

# యూనిట్ మాల్‌లో మాదిగలకు 50శాతం వాటా

### మాదిగ మేధావుల ఫోరం గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం లిడ్‌క్యాప్ (చర్మ పరిశ్రమ) కోసం గచ్చిబౌలిలో కేటాయించిన 42 ఎకరాల భూమిలో 5.16 ఎకరాల్లో నిర్మించబోయే యూనిట్ మాల్‌లో మాదిగ యువతకు వ్యాపారాల నిమిత్తం 50 శాతం వాటా ఇవ్వాలని మాదిగ మేధావుల ఫోరం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం విజ్ఞప్తిచేశారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం అధ్యక్షులు డా.ఆరెపలి రాజేందర్‌తో కలిసి ప్రొఫెసర్ కాశీం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిగల అభివృద్ధి కోసం 625 ఎకరాలను లిడ్‌క్యాప్‌కు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టు 18న గచ్చిబౌలిలోని లిడ్‌క్యాప్ భూములను ఇతర వ్యాపారాలకు కేటాయిస్తూ తెచ్చిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లిడ్‌క్యాప్ ఎండి, చైర్మన్, డైరెక్టర్‌లను తొలగించి, మాదిగ అధికారులకు అవకాశం ఇవ్వాలని కోరారు. అప్పుడే లిడ్‌క్యాప్ భూముల ఆక్రమణను అడ్డుకోవచ్చన్నారు. సమావేశంలో ఫోరం నేతలు నర్సింగ్ రావు, సిహెచ్.సత్యనారాయణ, సల్ల సతీశ్, మాన్కర్ శివకుమార్, వశపాక నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## 18న బిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు

### ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక వెల్లడి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా బిసి జెఎసి ఈనెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్రబంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ముదిరాజ్ సంఘాల ఐక్యవేదిక తెలిపింది. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదిక రాష్ట్ర కన్వీనర్ డా.గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ మాట్లాడుతూ బిసిల్లో అతిపెద్ద జనాభా ఉన్న ముదిరాజ్‌లను బిసి జెఎసిలో విస్మరించడం బాధాకరమన్నారు. ఏదేమైనా బిసి రిజర్వేషన్ల సాధన ఉద్యమంలో ముదిరాజ్‌లు అగ్రభాగాన ఉంటారని తెలిపారు. సమావేశంలో వేదిక నేతలు అల్లుడు జగన్, పండుగ బాలు, బొళ్ల వెంకట్, బొక్క శ్రీనివాస్, సతీశ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.




## మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి : అంజయ్య



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సరైన సమయంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు దళారులకు విక్రయిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాలు పంటలను కోసి నిల్వ చేసుకుంటున్నారని, ప్రభుత్వ తక్షణమే మద్దతు ధర ప్రకటించి కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉందని, ఇదే తరహాలో ప్రతి రైతులకు ఇచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు ప్రతి క్లస్టర్ పరిధిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకొని అన్నదాతలను ఆదుకోవాలని కోరారు.

# ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ధాన్యం సేకరణలో అక్రమాలకు తవ్వివకుండా, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా కొనుగోళ్ళు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వానాకాలం పంట ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి కొనుగోలు కేంద్రాల అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులతో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అందుకు అనుగుణంగా జిల్లాలో 6 లక్షల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. అన్ని శాఖలతో పరస్పర సమన్వయం పెంపొందించుకుని వరి ధాన్యం కొనుగోళ్ళు సజావుగా జరిగేలా కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, తగిన నీడ వంటి కనీస వసతులు అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా సంఖ్యలో వాహనాలను సమకూర్చుకోవాలని, ధాన్యం ఎగుమతులు, దిగుమతులు వెంట వెంట జరిగేలా హమాలీలను సైతం నియమించుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, బాగా ఆరబెట్టిన, శుభ్రపర్చిన ధాన్యం మిల్లులకు పంపాలన్నారు. తూకం యంత్రాలు, గ్రెయిన్ క్యాలిపర్స్, తేమ కొలిచే యంత్రాలు వంటివి సరిపడా అందుబాటులో ఉండాలన్నారు. ట్రక్ షీట్లలో అవకతవకలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డిఎస్‌ఒ వనజాత, సివిల్‌సప్లైస్ డిఎం హరీష్, డిసిఒ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష, వ్యవసాయశాఖ అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# గృహలక్ష్మి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారు?

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జంగయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** మహిళలకు గృహలక్ష్మి పథకం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఆరు గ్యారంటీల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటి మహిళ యాజమానికి నెలకు రూ.2500 ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో కేవలం ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల వరకు ఉచిత కరంటు ఇస్తున్నారని, కానీ చాలా మంది పేదలకు మాత్రం అందడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎస్సీ, ఎస్టిలకు ఆరు లక్షలు ఇస్తామని చెప్పి నేడు ఐదు లక్షలు మాత్రమే ఇస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పి రూ.12వేలకు కుదించారన్నారు. ఇప్పటికయిన ప్రభుత్వం ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల వెంకటేష్, సహాయ కార్యదర్శులు కాలపురం బాలరాజ్, ఎండి షబ్బీర్, మండల కార్యవర్గ సభ్యులు వీరేశం, లింగమయ్య పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సంజు గౌడ్

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా సంజుగౌడ్‌కు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని సంజుగౌడ్‌కు యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్‌రెడ్డి అందజేశారు కార్యక్రమంలో రోష్ని జైస్వాల్, యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరమల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రిక గారు, కర్మాన్ ఘాట్ హనుమాన్ ఆలయ డైరెక్టర్ విష్ణురెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శశిధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు శివ తదితరులు వున్నారు.



## విద్యుత్ అధికారుల బస్తీబాట



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కాలనీలో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కారం చేయడంతో చేయడం జరిగిందని కాలనీ అధ్యక్షులు పొగుల రాంబాబు అన్నారు. విద్యుత్ లైట్, విద్యుత్ స్తంభాలు లేని చోట నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రాజేంద్ర కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ శివకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్, నాగరాజు, వేణుగోపాల్, రామ్నాథ్‌రెడ్డి, ప్రభాకర్ రావు, ఈమని కృష్ణ, రాజ్ కిషోర్, శ్రీనివాస్, నూరుద్దీన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేవీ రంగంలో మహిళలకు అపార అవకాశాలు

### ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రహమాన్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నేవీ రంగంలో మహిళలకు అపార అవకాశాలు కల్పించాలని, మహిళా సాధికారత సాధించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని మెర్సెంట్ నేవీ శిక్షణ సంస్థ(డైరెక్టరేట్ జనరల్ షిప్పింగ్)ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రహమాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ అశుతోష్ కుమార్ అపండ్కర్ అన్నారు. మంగళవారం డిజి షిప్పింగ్ సాగర్ మే సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా సరూర్ నగర్ మండలం విక్టోరియ మెమోరియల్(విఎం హోమ్) స్కూల్ విద్యార్థులకు, ఇబ్రహీంపట్నం మండలం పరిధిలోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెర్సెంట్ నేవీ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో డిజి షిప్పింగ్ ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్ రహమాన్, ప్రిన్సిపాల్ అశుతోష్ కుమార్ అపండ్కర్ మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు మెర్సెంట్ నేవీలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. మెకానికల్ ఇంజనీరింగ్ తరువాత మర్చంట్ నేవీలో ఒక సంవత్సరం శిక్షణ ఉంటుందని, వెంటనే 100 శాతం ఉద్యోగం మంచి జీతంతో దొరుకుతాయని తెలిపారు. ట్రైనింగ్ షిప్ రహమాన్ మెర్సెంట్ నేవీ శిక్షణలో అనేక కోర్సులు అందిస్తుందని వివరించారు. రాష్ట్రంనుంచి నేవీలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మెర్సెంట్ నేవీ విద్యార్థిని భీమగాని సత్య, సంస్థ అధ్యాపకులు మనీషా పాండే, సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ హెడ్ వెంకటరమణ, ఫ్యాకల్టీ శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ భీమగాని మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్కు రక్షించాలని మంత్రి పొంగులేటికి వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** పార్కు స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లను వెంటనే రద్దు చేయాలని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న చత్రపత్రి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, రిజిస్ట్రేషన్‌లను వెంటనే రద్దు చేయించాలని మంత్రిని వినతి పత్రంలో కోరారు. 1967లో కాలనీ లే అవుట్ ఏర్పాటు చేయడం సమయంలో సుమారు 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం, కాలనీ కమ్యూనిహాల్ కోసం స్థలం కేటాయించడం జరిగిందని, దానికి కొంత మంది కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆయన ఆరోపించారు. బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని వినతి పత్రంలో కోరారు. మంత్రి స్పందించి సంబంధిత వ్యక్తులపై, సబ్ రిజిస్ట్రార్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు కార్పొరేటర్ లచ్చిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాలు కాపాడడంలో మంత్రి చొరవ చూపాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, కాలనీవాసులు పాశం విట్టల్‌రెడ్డి, కల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, కండె రాజేందర్, చిగురింత శ్రీధర్‌రెడ్డి, జెల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

## యువత బాల్య వివాహాలను నిర్మూలించాలి

### డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయలక్ష్మీ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బాల్య వివాహాల నిర్మూలనకు యువత నడుం బిగించాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఫరూక్‌నగర్ మండల పరిధిలోని చించోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ మాసం, బాల బాలికలకు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు వివాహ వయస్సు రాకుండానే వివాహాలు చేయడం వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని వివరించారు. మండల విద్యాధికారి మనోహార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో చించోడు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచందర్, ప్రగతి ఎన్‌జిఒ టీం నవ్య, తులసి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## పలు కాలనీలలో ఉదయాన్నే కమిషనర్ పర్యటన



ప్రజాపక్షం/దమ్మాయిగూడః దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి మంగళవారం కీసర పరిధిలో విస్తృత పర్యటన చేశారు. ఉదయమే ప్రారంభమైన ఈ పర్యటనలో కమిషనర్ ప్రధాన రహదారులు, కాలనీలు, మార్కెట్ ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగునీటిపారదల, చెత్త సేకరణ, హరితహార కార్యక్రమాలను సంమర్థవంతంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంకిరెడ్డిపల్లి గ్రామంలో రచ్చబండవద్ద పెద్దలు, స్థానిక ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానంగా రోడ్డు వెడల్పు, గుంతలు, డ్రైనేజీ సదుపాయాలపై ప్రజలు సమస్యలు వివరించగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## త్రోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు మహేష్ ఎంపిక



ప్రజాపక్షం/శామీర్‌పేట : ఏసియన్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మున్సిపాలిటి, లింగాపూర్ తాండాకు చెందిన దివ్యాంగుడైన దీరావత్ మహేష్ ఎంపికయ్యారు. డిసెంబర్ నెలలో 8–12 వరకు శ్రీలంకలోని రతన్‌పూర్‌లో నిర్వహించే త్రోబాల్ పోటీలకు భారతదేశం తరపున కెప్టెన్‌గా మహేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో కెప్టెన్‌గా ఎన్నుకున్నందుకు త్రో బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అల్బర్ట్ ప్రేమ్‌కుమార్, కోచ్ అయినటువంటి సింగారపు బాబు, నాకు వెన్నంటి ఉంటు సహకరిస్తున్న నా తల్లిదండ్రులు దీరావత్ రాంచెందర్, బుజ్జిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఎమ్మార్వో కార్యాలయం ఎదుట యువకుడు ఆత్మహత్యా యత్నం

ప్రజాపక్షం/దుండిగల్ః దుండిగల్ గండిమైసమ్మ మండల కార్యాలయం ముందు దుండిగల్ 1 తాండాకు చెందిన సిద్దూ నాయక్ అనే యువకుడు ఎమ్మార్వో సయ్యద్ అబ్దుల్ మతీన్ తన భూమిని ఓ బడా సంస్థకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని తమ కు న్యాయం చేయాలంటూ బాధితు లు బానోతు సిద్దూ నాయక్, బానో తు స్వాతి అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గాగిల్లాపూర్ గ్రామం సర్వే నంబర్ 148/ఇ లోని ఐదు గుంటలు, సర్వే నంబర్ 150/ఇ లోని రెండు గుంటలు 1950 నుండి తమ వారసుల ద్వారా సంక్రమించిందన్నారు. 2006లో ఆర్ఓఆర్ ప్రొసీడింగ్ నంబర్ 2037/06 మా కుటుంబీకులకు బదిలీ చేశారన్నారు. పట్టా నంబర్ 614 ద్వారా పాస్‌బుక్ 484935, పట్టా నంబర్ 615 ద్వారా పాస్‌బుక్ నంబర్.484932 భూదాన్ ల్యాండ్ పేరుతో పాస్‌బుక్‌లు మంజూరు అయ్యాయన్నారు. పాస్‌బుక్ లు ఇవ్వకుండా తమ భూమిని బడా నిర్మాణ సంస్థకు కట్టబెట్టేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్నారని భూమిమీద ఆధార పడి మా కుటుంబం జీవిస్తుందన్నా రు. గతంలో హై కోర్ట్ ను ఆశ్రయించగా హై కోర్ట్ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ 202396, 202397 ప్రొసీడింగ్స్ ప్రకారం భూదాన్ ల్యాండ్ కాదని తేల్చారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు 22ఏ ప్రకారం ప్రొబిషన్ లిస్టులో చేర్చారన్నారు. పాస్‌బుక్ లు ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేశారని ఇవ్వనందుకే ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల ఆందోళనను విరమింపజేసిన పోలీస్‌లు సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుల ఆందోళనతో దిగివచ్చిన తహసీల్దార్ త్వరలో పాస్ బుక్‌లు అందజేస్తానంటూ హామీ ఇచ్చినట్లు తెలిపారు.





## మానవ మనుగడకు చెట్లు దోహదం : డాక్టర్ అనిత

ప్రజాపక్షం/శామీర్‌పేట : మానవ మనుగడకు చెట్లు దోహదపడతాయని ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ డిగ్రీ మహిళా గురుకుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె. అనిత అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో కళాశాల తరపున నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో ఆరవ రోజు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు పచ్చదనం, వృక్ష సంరక్షణ, మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను గ్రామస్థులకు వివరించారు. ఫ్లాష్‌మొబ్‌ను ప్రదర్శించి ఇంటింటికి వెళ్లి గ్రామ ప్రజలపై సర్వే నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ సభ్యురాలు ధనవేణి, పీడి హైమావతి, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులులేని పటాకుల షాపులపై కఠిన చర్యలు : జినోమ్‌వ్యాలీ ఇన్‌స్పెక్టర్



ప్రజాపక్షం/శామీర్‌పేట : దీపావళి పండగకు పటాకులు విక్రయ దుకాణ యజమానులు అనుమతులు తప్పకుండా తీసుకోవాలని లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ గురువయ్య మీడియాతో మాట్లాడుతూ దీపావళి పండగకు తాత్కాలికంగా పటాకులు అమ్మే వారు, పర్మినెంట్ దుకాణాల యజమానులు ముందస్తుగా పర్మిషన్‌కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తుర్కపల్లి పోలీ స్‌స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరగుతుందన్నారు. బాణసంచ అమ్మకాలకు దుకాణదారులు 16వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పెట్టుకోవాలని చెప్పారు. ముందస్తు అనుమతులు లేకుండా పటాకుల షాపులు ఏర్పాటుచేస్తే చట్టరిత్యా కఠిన చర్యలు ఉంటాయని పెర్కొన్నారు. నిబంధనలు పాటించని వారి దరఖాస్తులు తిరస్కరించబడుతాయని చెప్పారు. పూర్తి వివరాలకు జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ గురువయ్య సూచించారు.



## దుర్గగుడి పాలకమండలి సభ్యుడికి అభినందనలు

ప్రజాపక్షం/నాగారంః విజయవాడ కనకదుర్గ దేవాలయం పాలక మండలి సభ్యునిగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ఐటిడిపి హరికృష్ణను నాగారం టిడిపి అధ్యక్షులు కొండా జంగారెడ్డి ఆధ్వర్యంలో నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎల్ నగర్ కాలనీ ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు సుంకరి వెంకటేష్, వేముల సంజీవగౌడ్, జగన్మోహన్ రెడ్డి, కృష్ణారావు,ప్రతాప్‌రెడ్డి, కోటేశ్వరరావు, బ్రహ్మయచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

**నీరుకొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో...**

విజయవాడ దుర్గగుడి పాలకమండలి సభ్యునిగా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన తాళికోట హరికృష్ణను తెలంగాణ టిడిపి రాష్ట్ర నాయకులు నీరుకొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ శివానంద్, నారగం ఉమాశంకర్‌గౌడ్, గోబేరు రమేష్, నిమ్మల శ్రీనివాస్, వెంకటేష్, శ్రీకాంత్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు స్వీకరణ

ప్రజాపక్షం/తాండూర్ : తాండూర్ మార్కెట్ యార్డ్ నందు దడువాయిగా పనిచేయదలిచిన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాని ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ తాండూర్ నందు రైతు యొక్క సరుకును తూకం వేయుటకు నూతనముగా 9మందికి దడువాయి లైసెన్స్‌లు జారీ చేయుటకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ అనుమతించినట్లు తెలిపారు. తాండూర్ మార్కెట్ దడువాయి పనిచేయదలచిన వ్యక్తులు అక్టోబర్ 22లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరలకు 7330733618 ను సంప్రదించాలని తెలిపారు.


# ఆకాశమే హద్దుగా...

# అక్రమ బహుళ అంతస్థుల భవనాలు

* రాజీవ్ గాంధీ నగర్‌లో ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల నిర్మాణాలు
* మామూళ్ల మత్తులో కార్పొరేషన్ అధికారులంటూ ఆరోపణలు
* అసలే గుట్టలు, కొండల ప్రాంతం.. ప్రమాదం జరిగితే ఏమిటి పరిస్థితి.. ప్రశ్నిస్తున్న ప్రజలు ...







ప్రజాపక్షం/నిజాంపేట్ : ఆకాశమే హద్దుగా అక్రమంగా బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలు జోరందుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలను నిర్మిస్తూ హైటెక్ సిటీ తలదన్నేలా మురికివాడలు వెలుస్తున్నాయి. అసలే మురికివాడలు, ఇక నోటరీ పత్రాలపై కొనుగోలు చేసుకున్న ప్లాట్లు, ఇళ్లు. ఇంకేముంది ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారు. మురికివాడల్లో బహుళ అంతస్థుల నిర్మాణాలకు అనుమతులు అవసరం ఉండదా. ఇది హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో కొనసాగుతున్న తంతు. వివరాల్లోకి వెళితే.. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అత్యధికంగా కాలనీలు ఉన్నాయి. ఒకటి, రెండు మురికివాడలు తప్ప మిగతావన్నీ కాలనీలే అధికం. కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్, ఇందిరానగర్, సాయినగర్ నగర్, నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప, ఎన్‌టిఆర్ నగర్, ఇందిరమ్మ కాలనీలు మాత్రమే మురికివాడలు ఉన్నాయి. గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ స్థలాల్లో ఈ మురికివాడలు వెలిశాయి. ఈ మురికివాడల్లో ప్లాట్లను కొనుగోలు చేయాలంటే కేవలం నోటరీ పత్రాలతో మాత్రమే సాధ్యం. ఇదిలా ఉండగా ఇటీవల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ మురికివాడల్లో జివో నంబర్లు 58, 59ల కింద కొంతమంది పట్టాలను, మరికొంతమంది రిజిస్ట్రేషన్‌లను చేసుకున్నారు. అయితే కొందరు మురికివాడల్లో పేదల నుండి ప్లాట్లను కొనగోలు చేసుకుని ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారు. అయితే ఈ మురికివాడల్లో రెండు అంతస్థుల కంటే ఎక్కువ అంతస్థులు నిర్మించడానికి అనుమతులు ఉండవు. కానీ అధికారులను మేనేజ్ చేసుకుని ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారనే ఆరోపణలు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాజీవ్ గాంధీ నగర్‌లో సుమారు పదికి పైగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలు నిర్మాణంలో ఉన్నా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కనీసం చూడకపోవడం విడ్డూరంగా ఉంది. రాజీవ్‌గాంధీ నగర్‌లో అధికంగా కొండలు, గుట్టలు ఉంటాయి. కొంతకాలం నుండి ఆ కొండలు, గుట్టలపైనే పేదలు నిర్మాణాలను చేసుకుని నివాసముంటున్నారు. కానీ ఇటీవలన కొందరు వ్యక్తులు పేదల నుండి ప్లాట్లను కొనుగోలు చేసుకుని ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్థుల భవనాలను అక్రమంగా నిర్మిస్తున్నా కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కనీసం భవన నిర్మాణదారులకు నోటీసులను కూడా ఎందుకు జారీచేయడం లేరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి అక్రమ బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**మామూళ్ల మత్తులో టౌన్ ప్లానింగ్ విభాగం చైర్ మెన్‌లు...**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఏడు, ఎనిమిది అంతస్థుల అక్రమ భవనాల నిర్మాణాలు జరుగుతున్నా నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేరు. కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో కేవలం చైర్ మెన్‌లు మాత్రమే కాలనీలు, బస్తీల్లో తిరుగుతూ అందినకాడికి లాగుతున్నారనే ఆరోపణలు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి. అసలు టౌన్ ప్లానింగ్ విభాగం ఉందా అనే అనుమానాలు కార్పొరేషన్‌లో లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టౌన్ ప్లానింగ్ విభాగంలో సరైన సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రమాదాలు జరిగితే ఏంది పరిస్థితి... ?**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, రాజీవ్‌గాంధీ నగర్‌లో బహుళ అంతస్థుల అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. అసలే మురికివాడ ఆపై కొండలు, గుంటల ప్రాంతం. ఇక్కడ ఏడు, ఎనిమిది అంతస్థుల అక్రమ బహుళ అంతస్థుల నిర్మాణాలు జోరందుకున్నాయి. అయితే కనీసం సెట్ బ్యాక్‌లు లేకుండా నిర్మించడంతో పాటు మొదటి అంతస్థు నుండి బాల్కనీలు సైతం రెండు, మూడు అడుగుల వరకు రోడ్డు మీదకి నిర్మించడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. ఆకాశమే హద్దుగా జరుగుతున్న నిర్మాణాల్లో ఏదేనీ ప్రమాదం వాటిల్లితే అప్పుడు పరిస్థితులు ఏ విధంగా ఉంటాయో అన్న ప్రశ్నలు స్థానికంగా నెలకొన్నాయి. ఉన్నతాధికారులు బహుళ అక్రమ అంతస్థుల నిర్మాణాల పై కట్టడి చేయకపోతే పెనుప్రమాదాలు తప్పవా అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### నోటీసులను జారీ చేశాం, చర్యలు తీసుకుంటాం : కమిషనర్ సాబెర్ అలీ

నోటీసులను జారీ చేశామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబెర్ అలీ అన్నారు. రాజీవ్ గాంధీనగర్‌లో జరుగుతున్న బహుళ అంతస్థుల పై వివరణ కోరగా జారీ చేశామని తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## డిసిసి అభ్యర్థుల ఎంపికలో కొత్త ఒరవడి

### టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

ప్రజాపక్షం/కూకట్‌పల్లిః రాహుల్ గాంధీ ఆలోచనకనుగుణంగా తెలంగాణాలో డిసిసి అభ్యర్థుల ఎంపికలో కొత్త ఒరవడి సృష్టిస్తున్నారని టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గం ఇంచార్జీ బండి రమేష్ అధ్యక్షతన మూసాపేటలోని లియో ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐసిసి కార్యదర్శి పరిశీలకురాలు డా.అంజలి నింబాల్కర్, డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులకే పార్టీ అధిష్టానం పట్టం కడుతుందని అన్నారు.అనంతరం సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసేందుకు డిసిసి నియామకాలు పార్టీ అధిష్టానం చేపడుతున్నదని తెలిపా రు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ పుష్పారెడ్డి, టిపిసిసి ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, కార్యదర్శులు దండుగుల యాదగిరి, గాలి బాలాజీ, సీనియర్ నాయకులు శేరి సతీష్‌రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, ఎండీ సలీం, తమూ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి వ్యక్తి మృతి



ప్రజాపక్షం/కొడంగల్ : శుభకార్యానికి వచ్చి తన స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడిన ఘటన కొడంగల్ నియోజకవర్గంలోని బోంరాస్‌పేట మండల పెద్ద చెరువులో చోటు చేసుకుం ది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు హైద్రాబాద్‌కు చెందిన మున్నామియా(42) బోంరాస్‌పేట మండల పరిధిలోని బూరాన్‌పూర్ గ్రామాంలోని తన బంధువుల పెళ్లి శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి రావ డం జరిగింది. పెళ్లికి వచ్చిన సమీప బంధువు అఖిల్ పాషాలతో కలిసి బోం రాస్‌పేట పెద్ద చెరువుకు చెరుకుని అక్కడ సరదాగా ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మున్నామియాకు ఈత రాకపోవ దంతో నీళ్లలోకి జారుకుని మృత్యువాత పడటం జరిగిందన్నారు. దీంతో పెళ్లింట విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తన భార్య పిల్లలు కన్నీటిపర్యంతమైయ్యారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపారు.

## కుటుంబ యజమాని మరణిస్తే రూ.20వేలు ఆర్థిక సాయం

### కేంద్ర ప్రభుత్వ జాతీయ కుటుంబ ప్రయోజన పథకం



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు చెందిన కుటుంబ యజమాని అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబాన్ని ఆదుకొనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బిఎస్) కింద 20 వేల రూపాయలు ఆర్థిక సాయంగా లభించనుందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. కుటుంబాన్ని పోషించే యజమాని వయస్సు 18 నుండి 60 ఏళ్ల లోపు ఉండాలని, తెల్ల రేషన్ కార్డుదారులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. దీంతోపాటు ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలకు సైతం ఈ పథకం వర్తిస్తుందని, అవసరమైనవారు సంబంధిత ప్రాంత తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

## భూ కబ్జాదారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోండి : రచ్చ కిషన్

ప్రజాపక్షం/బోడుప్పల్ : మేడిపల్లి మండలం పరిధిలో జంట కార్పొరేషన్‌లో ప్రభుత్వ స్థలములను కబ్జాదారుల చెర నుంచి రక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ తహసిల్దార్ హసీనా కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ ఫేస్ 3, బిస్కెట్ గోదాం దగ్గర, డబల్ బెడ్ రూమ్ వెనుకభాగంలో ప్రభుత్వ స్థలంలో భూ కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే అక్రమ నిర్మాణాలపైన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌ని కోరారు. భూకబ్జాదారులపై చర్యలు తీసుకోనిచో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## బిసి రిజర్వేషన్‌లపై బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ఃబిసి రిజర్వేషన్‌లపై బంద్‌కు సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ సిపిఐ తరపున సంపూర్ణ మద్దతు తెలిపారు. బిసి రిజర్వేషన్‌లను అమలు చెయ్యాలని ప్రజలంతా కోరుతున్న సందర్భంలో బిసి రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే ఇవ్వడం తగదని వెంటనే రిజర్వేషన్‌లను కల్పించాలని కోరుతూ ఈ నెల 18వ తేదీన బిసి సంఘాల జెఎసి ఇచ్చిన బంద్‌లో సిపిఐ జిల్లా శ్రేణులన్నీ పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్‌లు అమలు చెయ్యాలని ప్రజలు, రాష్ట్రాలు కోరుతుంటే బిజెపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పుడు బిజెపి అసలు స్వరూపం బయట పడుతుందని అన్నారు.

అగ్రవర్ణ కులాల వెనుకబడిన వారికీ ఏ రాష్ట్రం కానీ, ప్రజలు కానీ అడగలేదని, ఎక్కడా ధర్నాలు కానీ నిరసనలు జరగలేదన్నారు. కానీ బిజెపి ప్రభుత్వం 10శాతం కూడా లేని వారికి 10శాతం రిజర్వేషన్‌లు ఇచ్చి పార్లమెంట్‌లో అమోదింప చేసుకొని సుప్రీమ్‌కోర్టు విధించిన 50శాతం పరిమితి కూడా మించి పోయిందని అన్నారు. ఇది బిజెపికి, అగ్రవర్ణాలకు ఇచ్చే సహకారమని, కానీ బిసిలు అడిగితే మాత్రం చెయ్యట్లేదని, ఇప్పటికైనా బిజెపి నాటకాలు మానేసి బిసి బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని లేకపోతే బిసి లు బిజెపిని రాను న్న ఎన్నికల్లో తిరస్కరిస్తారని అన్నారు.బిసి రిజర్వేషన్‌లు అమలు అయ్యేంత వరకు సిపిఐ కార్యకర్తలు పోరాటాలకు నాయకత్వం వహించాలని కోరారు.

## ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పకడ్బందీగా చర్యలు : కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్ :వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా జరుగకుం డా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదేశించారు. అక్రమ ఇసుక రవాణాపై విస్తృత తనిఖీలు చేపట్టడంతో పాటు సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇరిగేషన్, గ్రౌండ్‌వాటర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో పనిచేసి రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎడిమైన్స్ సత్యనారాయణ, గ్రౌండ్ వటార్ ఎడిరవి, ఎఓ పర్వీన బేగం తదితరులు పాలొౕగన్నారు.



**కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల యోగ క్షేమాలపై ఆరా**

వికారాబాద్ జిల్లాలో కరోనా సమయంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు జూమ్ ద్వారా సమావేశం నిర్వహించి పిల్లల యోగ క్షేమాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆరా తీశారు. ఈ సందర్భంగా పిల్లలతో మాట్లాడు తూ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు సమావేశంలో పిల్లల యోగ క్షేమాలను , ఆరోగ్యం, విద్యగురించి, ఆర్థిక సహాయం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందరు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**పత్తికి మద్దతు ధర పోస్టర్ ఆవిష్కరణ :** పత్తికి మద్దతు ధర పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అవిష్కరించారు. 2025–26 సంవత్సరానికి కనీస మద్దతు ధర కు సంబంధించినదానిని మార్కెటింగ్ అధికారి సారంగపాణి , వ్యవసాయ మార్కెట్ కమిటి తాండూర్ కార్యదర్శి శ్రీ.యం శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : బలరాంనగర్‌లో రూ 10 లక్షల వ్యయంతో చేపట్టినఅండర్ గ్రౌండ్ డ్రైనేజి మరియు సిసి రోడ్డు పనులను మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో దశల వారీగా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నానని తెలిపారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనుమతులు లభించిన పనులకు బడ్జెట్‌లోంచి నిధులు వాడు కోలేక పోవటం వల్ల బడ్జెట్ వృథా అవుతోందన్నారు. ఇటీవలి వర్షాల కారణంగా పాడైపోయిన రహదార్ల మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, లేకపోతే వాహనదారులు ప్రమాదాలకు గురవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు నవీన్, రమేష్, కాలనీవాసులు హిమావంత్, రఘువీర్, వెంకటేష్, గోపాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

ప్రజాపక్షం/చర్లపల్లిః చర్లపల్లి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఉప్పల్ ఎంఎల్ఏ బండారు లక్ష్మారెడ్డి అన్నారు.మంగళవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని సాయి నగర్,చక్రీపురం,రామకృష్ణనగర్, డబుల్ బెడ్ రూమ్, లక్ష్మి నగర్, డిసికాలనీ, చర్చి కాలనీ,పెద్ద చర్లపల్లి, శ్రీసాయి గణేష్‌నగర్, ఇసీ నగర్, బిఎన్‌రెడ్డి నగర్ మంజూరైన పనులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

# ఆస్ట్రేలియా సిరీస్ ముగిశాక 'రోకో' వీడ్కోలు?




బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కామెంట్

ఈ నెల 19 నుంచి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో భారత స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ బరిలోకి దిగనున్నారు. ఈ సిరీస్‌లో దంచేశారంటే సరే. లేదంటే ఈ లెజెండరీ క్రికెటర్ల భవితవ్యం ఏంటీ? వచ్చే వరల్డ్ కప్ ఆడుతారా? .. వంటి ప్రశ్నలు అభిమానుల బుర్రలో మెదులుతున్నాయి. ఇటీవలకాలంలో సెలెక్టర్లు కుర్రాళ్లకు పెద్ద పీట వేస్తున్నందున ఈ దిగ్గజ ఆటగాళ్ల కెరీర్ ఇంకెన్ని రోజులు కొనసాగనుంది? అనేది తెలియడం లేదు. ఈ నేపథ్యంలో బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'రోహిత్ శర్మ, కోహ్లీలకు ఆస్ట్రేలియా పర్యటన ఎంతో ఉపయోగపడనుంది. వారిద్దరు గొప్ప ఆటగాళ్లు. అనుభవజ్ఞులైన వీరి సమక్షంలో ఆస్ట్రేలియాను ఓడిస్తాం. అందరూ అనుకుంటున్నట్టు రోకోకు ఇదే ఆఖరి సిరీస్ కాదు. అలా అనీ ఎవరూ చెప్పలేదు. ఇప్పుడే మేము దిగ్గజ ఆటగాళ్ల వీడ్కోలు గురించి ఆలోచించడం లేదు. చెప్పాలంటే.. ఎప్పుడు రిటైర్మెంట్ ప్రకటించాలి? అనేది పూర్తిగా క్రికెటర్ల నిర్ణయం. అందుకే.. మళ్లీ చెబుతున్నా హిట్‌మ్యాన్, కోహ్లీకి ఇదే ఆఖరి సిరీస్ కాదు' అని ఎన్ఐఏతో శుక్లా వెల్లడించాడు. ఆయన మాటలతో కోహ్లీ, రోహిత్ మరో వన్డే సిరీస్ ఆడడంపై అయితే క్లారిటీ వచ్చేసింది అభిమానులకు. ఇక రావాల్సిందల్లా వరల్డ్ కప్‌లో ఆడుతారా? లేదా? అనే అంశంమీదనే. ఐపిఎల్ 18వ సీజన్ తర్వాత టీమిండియా జెర్సీ వేసుకోని విరాట్ రోహిత్ ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఘనమైన రికార్డు కలిగిన రోకో.. ఆసీస్‌పై చెలరేగాలని భావిస్తున్నారు. వచ్చే వన్డే వరల్డ్ కప్ సన్నద్ధతలో ఉన్న భారత జట్టుతో పాటు రోహిత్, కోహ్లీలకు కూడా ఈ సిరీస్ కీలకం. ఇప్పటికే టెస్టులకు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు కొనసాగుతున్న ఏకైక ఫార్మాట్ ఇదే. అందుకే వీరిని ప్రపంచ కప్ ఆడించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ, టోర్నీకి ముందు వీరి ఫామ్, ఫిట్‌నెస్‌ను బట్టి సెలెక్టర్లు నిర్ణయం తీసుకోనున్నారు.


## శ్రీలంకను ముంచిన వరుణుడు

సొంతగడ్డపై విజయంతో వరల్డ్ కప్‌లో బోణీ కొట్టాలనుకున్న శ్రీలంకను వరుణుడు నిండా ముంచాడు. ప్రేమదాస మైదానంలో న్యూజిలాండ్‌పై భారీ స్కోర్ చేసి విజయంపై ధీమాతో ఉన్న లంక వర్షం దెబ్బకు పాయింట్ పంచుకోవాల్సి వచ్చింది. లంక ఇన్నింగ్స్ ముగియగానే వాన మొదలైంది. కట్ ఆఫ్ సమయానికి కూడా తెరిపినివ్వకపోవడంతో ఇరుజట్ల కెప్టెన్లతో మాట్లాడిన అంపైర్లు ఆట రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దాంతో.. ఇదివరకే ఆస్ట్రేలియాతో మ్యాచ్ వర్షార్పణంకాగా.. ఇప్పుడు మరో మ్యాచ్ కూడా ఫలితం తేలకపోవడం చమరి ఆటపట్టు బృందాన్ని ఎంతగానో బాధిస్తోంది. వరల్డ్ కప్‌లో తొలి విజయం కోసం శ్రీలంక నిరీక్షించాల్సి వస్తోంది. తొలి పోరులో భారత్ చేతిలో ఓడిన లంక.. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో తలపడగా.. వర్షం కారణంగా అది రద్దయ్యింది. అనంతరం ఇంగ్లాండ్ చేతిలో 89 పరుగుల తేడాతో ఓడింది ఆతిథ్య జట్టు. దాంతో.. ఎలాగైనా గెలవాలనే కసితో మంగళవారం న్యూజిలాండ్‌పై భారీ స్కోర్ చేసింది శ్రీలంక. కెప్టెన్ చమరి ఆటపట్టు(53), నీలాక్షి డిసిల్వా(55 నాటౌట్) అర్ధ శతకాలతో మెరవగా 258 రన్స్ చేసింది. బ్యాటర్ల మెరుపులతో కివీస్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన లంకకు బౌలర్లు విజయం కట్టబెట్టాలనుకున్నారు. కానీ, లంకను వర్షం కంగారెత్తించింది. సాయంత్రం 6:30కి వర్షం మొదలైంది. వరుణుడు శాంతిస్తే ఓవర్లు కుదించి ఆడించాలని అంపైర్లు భావించారు. కానీ, రాత్రి 9:30 దాటినా వాన తగ్గకపోవడంతో కట్ ఆఫ్ సమయం కూడా దాటిపోయింది. ఇక చేసేదేమీ లేక మ్యాచ్‌ను రద్దు చేస్తూ ఇరుజట్లకు చెరొక పాయింట్ ఇచ్చారు.



మ్యాచ్ రద్దుతో చెరొక పాయింట్!

గత మ్యాచ్‌లో విఫలమైనా కెప్టెన్ చమరి ఆటపట్టు (53) అర్ధ శతకంతో కదం తొక్కగా.. ఓపెనర్ విష్మీ గుణరత్నే(42), హాసిని పెరీరా (44) సాధికారిక ఇన్నింగ్స్ ఆడింది. అయితే.. మిడిల్ ఓవర్లలోన్యూజిలాండ్ బౌలర్లు కీలక వికెట్లు తీయగా స్కోర్ 220 దాటడమే గగనం అనిపించింది. కానీ, డెత్ ఓవర్లలో నీలాక్షి డిసిల్వా(55 నాటౌట్) బౌండరీలతో రెచ్చిపోవడంతో లంక 6 వికెట్ల నష్టానికి 258 రన్స్ చేయగలిగింది. ఈ ప్రపంచ కప్‌లో డిసిల్వాదే వేగవంతమైన హాఫ్ సెంచరీ. బంగ్లాదేశ్ బ్యాటర్ షోర్నా అక్తర్ దక్షిణాఫ్రికాపై 35 బంతుల్లో.. భారత్‌పై ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ 35 బంతుల్లో అర్ధ శతకాలు సాధించారు.



# ఫోకస్ మహిళ

## ఆర్థిక వెనుకబాటు..



గ్రామీణ మహిళ భారతీయ ఆర్థిక వ్యవస్థలో అత్యంత నిర్లక్ష్యమరచిన కార్మిక వర్గం. నేషనల్ సాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఒ) నివేదికల ప్రకారం, వ్యవసాయ రంగంలో మహిళల భాగస్వామ్యం 55 శాతం పైగా ఉన్నప్పటికీ, వారిలో కేవలం 13 నుంచి15 శాతం మంత్రి మాత్రమే భూమి యజమానులు. మిగతావారు కూలీలు లేదా సహకార కార్మికులు. పంటల సాగు, విత్తనాల నాటకం, తడిపంటల మార్పు, కోత, పొలం శుభ్రపరిచే పనులన్నీ ఆమె చేస్తుంది. కానీ కూలీ విషయంలో లింగ అసమానత తీవ్రంగా ఉంది. పురుషులు పొందే వేతనంతో పోలిస్తే మహిళలకు కనీసం 20 నుంచి 30 శాతం తక్కువగా చెల్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మైక్రో ఫైనాన్స్, స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) ద్వారా కొంతమంది మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. అయితే, ఇలాంటి పథకాల్లోనూ, మహిళలకు తమకు అందిన మొత్తాలను తిరిగి ఇంటి ఖర్చులకు వెచ్చించడం లేదా కుటుంబ సభ్యులకు ఇవ్వడం వంటి కారణాలతో ఆర్థిక వెనుకబాటు కొనసాగుతునే ఉంది.

## గ్రామీణ మహిళల జీవితాలు బాగుపడేది ఎన్నడో?



ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాల్లో గ్రామీణ మహిళలు ఆర్థిక, సామాజిక వివక్షకు గురవుతున్నారు. మన దేశంలోనూ అదే పరిస్థితి. దశాబ్దాలుగా వారి జీవన స్థితి ఏమాత్రం బాగుపడలేదు. వెనుకబాటు తప్పడం లేదు. ఇది అత్యంత ఘోరమైన వాస్తవం. దేశ జనాభాలో సుమారు 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారిలో సగానికి పైగా మహిళలే. కానీ ఈ సమూహం దేశ అభివృద్ధిలో ప్రధాన బలం అయినప్పటికీ, నిర్ణయాధికారంలో, ఆర్థిక స్వాతంత్ర్యంలో, విద్యలో, ఆరోగ్యంలో, సమాన అవకాశాలలో తీవ్ర వెనుకబాటుతో ఉంది. చారిత్రక అంశాలను పరిశీలిస్తే, గ్రామీణ భారతంలో మహిళల పాత్ర శతాబ్దాలుగా ద్వంద్వ స్వభావాన్ని కలిగి ఉంది. ఒకవైపు ఆమె కుటుంబపు ఆర్థిక స్థితిని నిలబెట్టే శక్తి, మరోవైపు సమాజం విధించిన పరిమితులలో బందీ. వేదకాలంలో విద్య, ఆస్తి హక్కులు మహిళలకు అందుబాటులో ఉండేవి. కానీ మధ్యయుగ కాలం నుండి పితృస్వామ్య వ్యవస్థ బలపడడంతో మహిళల హక్కులు క్రమంగా లుప్తమయ్యాయి. బ్రిటిష్ కాలంలో విద్యావ్యాప్తి మొదలైనప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో దాని ప్రభావం తక్కువగానే మిగిలింది. గ్రామీణ మహిళల సామాజిక స్థానం నేటికీ కుటుంబానికి, భర్తకు, వంశపారంపర్య సంప్రదాయాలకు లోబడే కొనసాగుతున్నది. పితృస్వామ్య ధోరణి కారణంగా ఆమె స్వతంత్రతకు అవకాశాలు దాదాపుగా లేకుండాపోయాయి. పిల్లల పెంపకం, వంట, పశుపోషణ, వ్యవసాయం, నీరు తేవడం, ఇంధనం సేకరించడం వంటి పనులు అంతా ఆమె భుజాల మీదే. కానీ ఇవన్నీ ఉద్యోగంగా లేదా ఉత్పత్తిగా గుర్తింపుకు నోచుకోవు. ఇది ముమ్మాటికీ సాంఘిక అన్యాయమే.

## విద్యలోనూ అదే స్థితి..



'బేటీ బచావో... బేటీ పఢావో' వంటి ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా, ఎన్ని పథకాలను తెచ్చినా, మహిళల్లో విద్యాశాతం తక్కువగానే ఉంటున్నది. ప్రత్యేకించి గ్రామీణ మహిళల విద్యా స్థాయి దేశ అభివృద్ధి సూచికల్లో అత్యంత ఆందోళనకరమైన అంశంగా మారింది. దేశంలో స్త్రీల సగటు అక్షరాస్యత శాతం సుమారు 70కి చేరినా, గ్రామీణ ప్రాంతాల్లో అది 55 శాతం దాటడం లేదన్న విషయాన్ని గుర్తించాలి. పేదరికం, పాఠశాలలు అందుబాటులో లేకపోవడం, బాల్యవివాహాలు, కుటుంబ పరిమితులు కారణంగా బాలికల విద్య మధ్యలోనే ఆగిపోతుంది. సర్వశిక్షా అభియాన్, బేటీ బచావో బేటీ పఢావో వంటి పథకాలు కొంత మార్పు తెచ్చినప్పటికీ, ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. మహిళల విద్య పట్ల తల్లిదండ్రుల అవగాహన కూడా పెరుగుతోంది. కానీ విద్యావ్యాప్తి తీరు, నాణ్యత, ఉపాధి అవకాశాలకు అనుసంధానం వంటి అంశాలు ఇంకా బలహీనంగానే ఉన్నాయి.

(నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం)



## భవిష్యత్తు ఆశాజనకం

గ్రామీణ మహిళలు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, భవిష్యత్తు ఆశాజనకంగానే కనిపిస్తున్నది. ఇటీవల కాలంలో, గ్రామీణ మహిళల్లో స్వీయ గౌరవం పెరుగుతోంది. విద్య, మీడియా, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు మహిళల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నాయి. డిజిటల్ యుగం మొదలైన తర్వాత, ఎంతో మంది సోషల్ మీడియా వేదికగా తమను తాము కొత్తగా ఆవిష్కరించుకుంటున్నారు. ఎంతో మంది ఆర్థికంగానూ లాభపడుతున్నారు. దేశంలోని మహిళా రైతులు ఇప్పుడు ఆర్గానిక్ వ్యవసాయం, హ్యాండీక్రాఫ్ట్, చిన్న పరిశ్రమల ద్వారా ఆదాయ మార్గాలను సృష్టిస్తున్నారు. కుటుంబాల్లో నిర్ణయాధికారంలో కూడా మహిళల పాత్ర క్రమంగా పెరుగుతోంది. మహిళా సాంకేతిక శిక్షణ కేంద్రాలు, రూరల్ బిపిఒలు, డిజిటల్ లిటరసీ ప్రోగ్రామ్‌లు కొత్త అవకాశాలు కల్పిస్తున్నాయి. గ్రామీణ మహిళల సమగ్ర అభివృద్ధి లేకుండా భారత దేశ అభివృద్ధి అసాధ్యం. అందుకే, మహిళల్లో విద్య, నైపుణ్యాభివృద్ధికి ప్రయత్నించాలి. కేవలం చదువు కాదు, ఉపాధికి అనువైన నైపుణ్యాలు పెరిగేలా శిక్షణ ఉండాలి. భూమి, బ్యాంకు రుణాలు, సాంకేతిక సహాయం మహిళల పేరుతో ఉండాలి. అప్పుడే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుంది. మహిళను బలహీనురాలిగా కాకుండా సహనాయకురాలిగా చూడాలి. సామాజిక దృక్కోణం ఈ మార్పు అత్యవసరం. ఏకంగా చూసినా, గ్రామీణ భారతీయ మహిళ అనేది శ్రమ, త్యాగం, ధైర్యం, సహనం, సృజనాత్మకతల ప్రతీక. ఆమె కేవలం ఇంటి చుట్టూ తిరిగే వ్యక్తి కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ఆమెకు సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు లభించినప్పుడే భారతదేశం నిజమైన ప్రజాస్వామ్య దేశంగా నిలుస్తుంది. గ్రామీణ మహిళల పురోగతి అంటే దేశం పురోగతి. ఎందుకంటే ఆమె చేతుల్లోనే ఆ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ ధర్మబిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలో ఉన్న బిసి నాయకులంతా వారిపై ఉన్న నాయకత్వానికి భయపడి బిసి 42 శాతం బిల్లుని అడ్డుకుంటే భవిష్యత్తు తరాలు క్షమించరని ఆయన వెల్లడించారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బిసి రిజర్వేషన్లు 42 శాతం ఆమోదించాలని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో సిపిఐ తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అన్ని వర్గాల బిసి సంఘాలు మద్ధతు తెలిపి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిపిఐ సూర్యాపేట పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, దేశ అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి అని, వారి పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే, మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని బోధన్ ఎమ్మెల్యే నివాసంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభల లోగోను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏ సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలు ఇచ్చే సాధన విద్య అని, ఆ విద్యతోనే దేశాభివృద్ధికి బాటలు వేయవచ్చని, దీనికి సాధకులు విద్యార్థులు అన్నారు. దేశ అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి ఉండాలన్నారు. నేడు సమాజంలో జరుగుతున్న మార్పులను విద్యార్థులు గమనించాలని, విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి అవినీతి, అన్యాయాలపై ఉద్యమించాలని కోరారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఎఐఎస్ఎఫ్ పోరాటాలు అభినందనయమన్నారు. జిల్లాలో నవంబర్ 20–22 తేదీల్లో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని ఈ సమహాభసలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు నగేష్‌రెడ్డి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు పి.సుధాకర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వరదపట్టు వేణురాజ్, నాయకులు అంజలి, రఘురాం, కుషాల్, సుభోద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎఐఎస్ఎఫ్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి అజిత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారత స్వాతంత్ర పోరాటంలో విద్యార్థులు, యువకులను ఏకం చేసిన ఏఐఎస్ఎఫ్ 90 వసంతాలు పూర్తి చేసుకుందని, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో విద్యార్థులు భాగస్వాములై విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రతిభా కళాశాలలో ఎఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య కార్పోరేట్, ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై విద్యార్థులు సంఘటితం కావాలని కోరారు. విద్యార్థిలోకం శాస్త్రీయ విద్యావిధానాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎఐఎస్ఎఫ్ నిర్వహించే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్, మణిక్యాల వినయ్ కళ్యాణ్, వనిత, వందన తదితరులు పాల్గొన్నారు.



## ఆటో కార్మికులను ఆదుకోవాలి



**ప్రజాపక్షం/మణుగూరు :** ఆటో కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ ఎఐటియుసి మహాసభ రాయల బిక్షం అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సరెడ్డి పుల్లారెడ్డి హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఏర్పడిందని, మహిళలకు ఉచిత బస్ సౌకర్యంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆటో కార్మికులను అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు మాట్లాడుతూ ఆటో కార్మికుల ఐకమత్యంతో కలిసి మెలిసి అన్న, తమ్ముడు లాగా జీవించాలని, ప్రయాణికులతో మంచిగా నడుచుకోవాలని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఆదర్శంగా నిలవాలని మీకు అండగా ఎఐటియుసి, సిపిఐ నిలబడుతుందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మ్యాజిక్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చారి, సిరిగదే సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతరం నూతన కమిటీ ఎన్నిక...** ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ (ఎఐటియుసి) అధ్యక్షుడిగా ఎన్ఎన్.రాజు, కార్యదర్శిగా మందారి పుల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా చారిని ఎన్నుకున్నారు.

## కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో విద్యార్థులపై ఫీజు భారం తగదు

విసికి విద్యార్థి సంఘాల వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను భారీగా పెంచారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాకతీయ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఖమ్మంలో పర్యటించిన సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విసి ప్రతాపరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ మాట్లాడుతూ కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ రకాల ఫీజులు భారీగా పెంచిందన్నారు. పెరిగిన ఫీజులతో ఒక్కో విద్యార్థిపై గతంలో కంటే రూ.1,910లు అదనంగా భారం పడుతుందన్నారు. పేద విద్యార్థులు పెరిగిన ఫీజులను చెల్లించి విద్యను అభ్యసించే పరిస్థితిల్లో లేరని, తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేసి ఫీజులు భారాన్ని తగ్గించాల కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్యామల, రాము, శివ, గోపి, మనోజ్, శ్రీనాథ్, లోకేష్, సాత్విక తదితరులు పాల్గొన్నారు.



## అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలు : ఎఐటియుసి



**ప్రజాపక్షం/తంగళ్ళపల్లి :** అసంఘగటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎఐటియుసి సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, హమాలీ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చుపల్లి శంకర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపెల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో హమాలీ కార్మికులతో కలిసి ఈ నెల 26న వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో నిర్వహించే ఎఐటియుసి జిల్లా 4వ మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా వుండే హమాలీ కార్మికులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వీరు సంవత్సరాలుగా పల్లెలను నమ్ముకొని సొంతంగా పని చేసుకుంటున్నారని, ప్రభుత్వాలపైన అధారపడడం లేదన్నారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, జిల్లాలో ఇఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం చేయాలన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామపంచాయతీ, మిడ్ డే మీల్స్, అటెండెర్స్, స్కావేంజర్స్, లాంటి అసంఘటిత కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కాంట్రాక్టు పద్ధతి కాకుండా అన్ని రంగాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే కార్మికులను ఉద్యోగులుగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్మిక హక్కుల సాధాన కోసం ఎఐటియుసి నిర్వహిస్తున్న 4వ జిల్లా మహాసభలలో అన్ని రంగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ తంగళ్లపెల్లి కార్యదర్శి సోమ నాగరాజు, నాయకులు బట్టు చంద్రం, బర్ల గంగయ్య, ఆకారపు ఎల్లయ్య, ఆకారపు శ్రీనివాస్, ఎర్ర మల్లయ్య, బట్టు మధు తదితరులు పాల్గొన్నారు..

## జిపి కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రామస్వామి

**ప్రజాపక్షం/చందంపేట :** గ్రామపంచాయతీ కార్మికుల మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి నల్లగొండ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని చందంపేట మండల ఎంపిడిఒ కార్యాలయం ముందు మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రామస్వామి పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం గీన్ ఛానల్ ద్వారా ఇస్తామని చెప్పి ఇప్పటికి మూడు నెలలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలకు రూ.9500 ఇవ్వాలని, ఉన్న కొన్ని జిపిలలో తక్కువ వేతనాలు ఇస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. జిపిలకు కనీస వేతనం నెలకు రూ.25వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, నెల నెల ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీపావళి తర్వాత నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లయ్య, జిపి కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొజ్జనాయక్, దేవరాజ్, ఇద్దయ్య, దేవాచారి, లక్ష్మ, ముత్తయ్య, అంజమ్మ, శ్రీను, పద్మ, లక్ష్మ య్య తదితరులు పాల్గొన్నారు





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆరోగ్య కేంద్రంలో రిజిస్ట్రర్‌ను పరిశీలించి వైద్యులు సమయ పాలన పాటించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని వాటర్ సంప్ రిపేర్ గురించి తెలుసుకొని సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. విధులలో ఉన్న ఫిల్డ్ స్టాప్ గురించి అడిగి తెలుసుకొని ఫీల్డ్ స్టాఫ్ గ్రామాల్లో సమయపాలన పాటిస్తూ యూనిఫాంలో ఉండాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మసాన్‌పల్లి గ్రామంలోని ఉప కేంద్రంలో ఏఎన్‌ఎం లేనందున డిఎంహెచ్‌వోతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డా. ప్రవీణ్‌కుమార్, ఎంపిడివో చండీరాణి, ఎంపివో సలీం, సిహెచ్‌వో వెంకటేశం ఉన్నారు.

## నకిలీ విత్తనాలు... వరిసాగు రైతుల్లో కలవరం



ప్రజాపక్షం/కోదాడ రూరల్ : నకిలీ విత్తనాలతో వరిసాగు చేసిన రైతుల్లో కలవరం మొదలైంది. మండలంలోని కూచిపూడి గ్రామంలో రైతులు సాగు చేసిన సన్నరకం వరి విత్తనాలను కోదాడ పట్టణంలోని పలు దుకాణాల్లో కొనుగోలు చేసి సాగు చేశారు. దాదాపు 150 మంది రైతులు 300 ఎకరాలలో వరిసాగు చేయగా పొట్టదశకు రావడంతో ముందుగా ఈనడంతో అవన్నీ దొడ్డురకంగా రైతులు గుర్తించారు. ఇదే విషయాన్ని వారు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ల దుకాణాల వద్దకు వెళ్ళి మోసం చేయడంపై వారిని నిలదీశారు. దీంతో ఆయా కంపెనీల డీలర్లు పంటలను పరిశీలించేందుకు గ్రామానికి వచ్చారు. దీనిపై వారు ఏ విషయం సమాధానం చెప్పకపోవడంతో రైతులు వారితో వాగ్వివాదానికి దిగారు. నకిలీ విత్తనాలను అండగట్టి తమను మోసం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎకరాకు 5 బస్తాల వరకు బెరుకులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

**నకిలీలు కాదు బెరుకులు : వ్యవసాయాధికారిణిని రజిని**

ఇదే విషయమై మండల వ్యవసాయాధికారిణి రజినిని వివరణ కోరగా సన్నరకంలో నకిలీ లేవని కేవలం బెరుకులు మాత్రమేనని చెప్పారు. కూచిపూడి గ్రామంలో నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చిందని తెలిసిన వెంటనే ఆమె అక్కడికి వెళ్ళి పరిశీలించారు. 74 ఎకరాల వరి పంట కొంత మేరకు నష్టం వాటిళ్ళవచ్చని శాస్త్రవేత్తలను తీసుకొని అవగాహన కల్పిస్తామంటే రైతులు ఒప్పుకునే అవకాశం లేదన్నారు. నష్టపోయిన రైతులకు తగు న్యాయం చేస్తామని చెప్పారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల: రాష్ట్రంలోని రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఆరెగూడెం గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల అభివృద్ధి చెందడానికి అనేక రకాలైన ఆలోచనలతో ముందుకెలుతున్నారని అన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పక్షాన నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కళ్ళాలలో అధికారులతో కలిసి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా వీరేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో జయలక్ష్మి, వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, నాయకులు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, పిశాటి భీష్మారెడ్డి, బొంతల అంజిరెడ్డి, జనగాం రవిందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు చురుకుదనాన్ని పెంపొందిస్తాయి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : క్రీడలు నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో చురుకుదనంతో పాటు శారీరక ఆరోగ్యం తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ అన్నారు.మంగళవారం నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఏర్పాటుచేసిన ఎస్ జి ఎఫ్ క్రీడ పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోవడము సహజమన్నారు.ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుబాటి విమల మాట్లాడుతూ అండర్ 14, 17 విభాగాలలో ఖో ఖో టోర్నమెంట్ కం సెలక్షన్ జరుగుతుందని దీంట్లో సెలెక్ట్ కాబడినటువంటి విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆడవలసి ఉంటుందని అక్కడినుండి రాష్ట్ర జాతీయస్థాయిలో ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్లు శోభారాణి, జయ రాజు, రాజశేఖర్ రెడ్డి, జంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, శ్రీదేవి యుగంధర్ రెడ్డి కవిత,రాజశేఖర్ రెడ్డి, ఆశ్రఫ్ గఫార్ మురళి పాల్గొన్నారు.

## ఏకకాలంలో 23 ప్రాంతాల్లో పోలీస్ నాఖాబంది : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా 23 ప్రాంతాల్లో పోలీస్ నాఖాబంది నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం మండలంలోని గ్రామ సమీపంలోని ఖమ్మం జాతీయ రహదారిపై పోలీసులు నిర్వహిస్తున్న నాఖాబంది కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా ఎఫెక్టీవ్ పోలీస్, విజువల్ పోలీసింగ్ ఉద్దేశ్యంలో భాగంగా సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు జిల్లాలోని అన్ని మార్గాలు, సరిహద్దులను అష్టదిగ్భందనం చేసి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ నాఖాబంధి ద్వారా అక్రమ రవాణా, అనుమానితుల, రౌడీషీటర్స్ కదలికలు, గంజాయి, పశు, నిషేద్ధిత పదార్థాల అక్రమ రవాణా, అంతర్‌రాష్ట్ర, జిల్లా నేరస్తుల కదలికలను గుర్తించి నేరాలను అదుపు చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా అంతర్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన రామాపురం ఎక్స్ రోడ్డు, దొండపాడు, పులిచింతల ప్రాజెక్ట్, అంతర్ జిల్లా సరిహద్దు ప్రాంతాలైన తిరుమలగిరి, వెలిశాల, మద్దిరాల, నూతనకల్, బిక్కుమళ్ళ, జిల్లెపల్లి, జాన్‌పహాడ్, మట్టపల్లి బ్రిడ్జిలలో ఇలా అన్ని ప్రాంతాలలో ఒకే కాలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పెన్‌పహాడ్, సూర్యాపేట రూరల్ ఎస్‌ఐలు శ్రీకాంత్, బాలు నాయక్, ఆర్‌ఐ అశోక్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థికీ 70శాతంపైగా మార్కులు

మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని
జిల్లా కలెక్టర్ తేజస్ అధికారులకు ఆదేశం



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ప్రభుత్వ రెసిడెన్సియల్, కెజిబివి పాఠశాల, కళాశాలల్లో చదివే ప్రతి విద్యార్థి 70 శాతానికి పైగా ప్రతి సబ్జెక్ట్‌లో మార్కులు సాధించేలా సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ విసి హాల్‌లో సంక్షేమ అధికారులు, విద్యాశాఖ, కెజిబివి ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెసిడెన్షియల్, కెజిబివి పాఠశాల, కళాశాలలకు ఇక నుండి ఆకస్మిక తనిఖీ చేపట్టినప్పుడు ఎవరైనా విధుల్లో లేకపోతే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సిబ్బంది సమయపాలన పాటించాలని, సిబ్బంది హాజరు వివరాలు, విద్యార్థుల హాజరు వివరాలు ప్రతిరోజు నివేదిక ఇవ్వాలని సూచించారు. అధికారులు పాఠశాలలకు వచ్చే గుడ్లు, పాలు, చికెన్, వంట సామాగ్రి సమయానికి చేరిందా లేదా తెలుసుకోవాలన్నారు. అలాగే కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఆర్‌బిఎస్‌కె వైద్యులచే ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ కార్డు తయారు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. కెజిబివిలలో ఎక్కడైనా అవసరం ఉంటే త్రాగునీరు, టాయిలెట్స్, ట్యాప్స్, సీలింగ్ ఫ్యాన్స్, లైట్స్ లాంటి వాటికి మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకి మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఆరోగ్యం బాగుండేలా చూసి, నాణ్యమైన భోజనం అందించి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, డిఈఓ అశోక్, జిసిడిఓ పూలన్, టిజిఈ డబ్ల్యుఐ సిడిఈ రమేష్, డిసిఓలు, కెజిబివి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

**బెస్ట్ అవైలబుల్ విద్యార్థుల సంక్షేమంపై నిరంతరం పర్యవేక్షించాలి**

బెస్ట్ అవైలబుల్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వృద్ధులు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత సంక్షేమ శాఖల అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న విద్య, భోజనం, వారి సంక్షేమం పట్ల సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని చెప్పారు. అంతకుముందు రాష్ట్ర మంత్రులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు సహకారం అందించాలి
నల్లగొండజిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.మంగళవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2025/26 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పై సంబంధిత శాఖల అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ వానాకలం ధాన్యం కొనుగోలులో రైతులు నాణ్యతా ప్రమాణాలతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మిల్లులకు పంపించే విధంగా జిల్లా యంత్రాంగం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాణ్యత ప్రమాణాల విషయంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అన్ని మండలాలలో అందుబాటులో ఉండి రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తే తక్షణమే మిల్లులకు పంపించే విధంగా చూడాలని, మిల్లర్లు తక్షణమే మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలని కోరారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ట్రాన్స్పోర్టర్లు ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హమాలీల సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. వానాకాలం ధాన్యం కొనుగోలు లో భాగంగా రైస్ మిల్లర్లు 5 రోజుల్లో బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని కోరారు. మిల్లర్లకు సంబంధించిన సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ధాన్యం మద్దతు ధరపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. జిల్లా రైస్ మిల్లర్ల సంఘం తరపున ప్రజల ఆరోగ్య సంక్షేమానికై ఎక్స్ రే యంత్రాన్ని అందించడం పట్ల జిల్లా కలెక్టర్ రైస్ మిల్లర్లను అభినందించారు.ఈసమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,రైస్ జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి, మిల్లర్ల అధ్యక్ష, కార్యదర్శులు,ప్రతినిధులు శ్రీనివాస్, నారాయణ, భద్రాద్రి, యాదగిరి,తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# బౌద్ధం మతం కాదు...జీవన విధానాన్ని తెలిపే ధర్మమార్గం



పుణె యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ మహేష్

ప్రజాపక్షం/నందికొండ: బౌద్ధం ఒక మతం కాదని అది జీవన విధానం తెలిపే ఒక దర్మ మార్గమని పుణె యూనివర్సిటీ ప్రొఫసర్ డాక్టర్ మహేష్ దియోకర్ అన్నారు.మంగళవారం నాగార్జునసాగర్ లోని బుద్ధ వనములో దమ్మ విజయ వేడుకలను బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట బుద్ధ వనములోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫసర్ మహేష్ దియోకర్ మాట్లాడుతూ బుద్ధుని దమ్మచక్ర ప్రవర్తన సారాంశాన్ని విస్తరిస్తూ అశోకుడు బౌద్ధాన్ని స్వీకరించిన రోజుని దమ్మ విజయముగా చెప్పబడుతుందన్నారు. ఇదే రోజున డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ బుద్ధుని బోధనలకు అమితంగా ఆకర్షకులై బౌద్ధాన్ని స్వీకరించారు అన్నారు. బుద్ధ వనంలో బుద్ధుని బోధనలు తెలియజేసేలా ఒక విద్యా కేంద్రం ఏర్పాటు చేయాలని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య కు సూచించారు.అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ బుద్ధవనం తెలంగాణకు ల్యాండ్ మార్కుగా నిలుస్తుంది అనడంలో అతిశయోక్తి లేదన్నారు. బుద్ధిష్ట స్టడీస్ లో సర్టిఫికేషన్ విద్యను అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం హైదరాబాద్ రెడ్డి మహిళా కళాశాల కార్యదర్శి ముత్యం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో బుద్ధ వనంలో బౌద్ధ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అనంతరం బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ బుద్ధ ధమ్మం తెలంగాణలో ఎలా ప్రవేశించింది వివరించారు. బుద్ధవనాన్ని మరింతగా అభివృద్ధి పరిచేందుకు కృషి జరుగుతుందని ఇప్పటికే డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత, బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర, నల్గొండ జిల్లా టూరిజం అధికారి శివాజీ, బుద్ధవనం ఆర్ట్స్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు, బౌద్ధ అభిమానులు, బీసీ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాలాజీ నాయక్ బాధితులకు న్యాయం చేస్తాం : ఎస్‌పి



ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి: అధిక వడ్డీ పేరుతో బాలాజీ నాయక్ చేతిలో మోసపోయిన బాదితుల కొరకు అడిషనల్ ఎస్‌పి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలాజీ నాయక్ పైన,అతని బినామీల పైన ఉన్న ఆస్తులను కోర్ట్ ద్వారా జప్తు చేసి బాధితులను న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాం అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. దేవరకొండ సబ్ డివిజన్ పరిధిలో గుడిపల్లి పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్‌పి ఆకస్మిత తనిఖీ చేసి స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిసరాలు, స్థితిగతులు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ క్రైమ్ రికార్డ్,జనరల్ రికార్డ్స్‌లు తనిఖీ చేసి మాట్లాడుతూ కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే బాధిత ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుం డా వారి పట్ల తక్షణమే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలాజీ నాయక్ పైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ పంపడం జరిగిందన్నారు. మోసపోయిన బాదితుల కొరకు సిఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని బాధితులు ఎవరైన ఉంటే తమ యొక్క ఫిర్యాదులు నేరుగా పోలీస్ స్టేషన్ కి వచ్చి పిర్యాదు చేస్తే పూర్తి విచారణ చేపట్టి కోర్టులో నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఏఎస్‌పి మౌనిక ఐపీఎస్, అడిషనల్ ఎస్‌పిరమేష్, కొండమల్లపల్లి సిఐ నవీన్ కుమార్,గుడిపల్లి ఎస్ఐ నరసింహులు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# ఎన్‌జి కళాశాల గ్రౌండ్‌కు ఒక మంచి గుర్తింపు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణం లోని ఎన్‌జి కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.మంగళవారం ఆమె ఎన్‌జి కళాశాల మైదానంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు విషయమై ఉదయపు నడక ద్వారా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఎన్‌జి కళాశాల మైదానం కు ఒక మంచి గుర్తింపు అని అన్నారు. ఎన్ జి కళాశాల మైదానంలో మంచి క్రీడా సౌకర్యాలను కల్పించే విషయంలో మున్సిపల్ లేదా జిల్లా యంత్రాంగం నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా సింథటిక్ వాకింగ్ ట్రాక్, హైమాస్ లైట్లు , ప్రస్తుతం ఉన్న ఓపెన్ జిమ్ కు మరమ్మతులు, అదనంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు వంటి అత్యవసర సౌకర్యాలన్నిటిని కల్పించే విషయంపై దృష్టి సారిస్తామని ,ఇందుకుగాను సంబంధిత అధికారులు అంచనాలు రూపొందించి సమర్పిస్తే త్వరితగతిన వాటిని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఎన్ జి కళాశాల మైదానం స్థలాన్ని ఎవరు ఆక్రమించుకోకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ,వాకర్స్ అసోసియేషన్ నుండి బండారు ప్రకాష్, రేపాల మదన్మోహన్, డాక్టర్ పుల్లారావు , ఎంవి గోన రెడ్డి ,శౌరయ్య, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, లింగయ్య, మాజీ కౌన్సిలర్ మిర్యాల యాదగిరి, రాచకొండ గిరి, వెంకన్న, యాస వెంకట్ రెడ్డి ,సరళ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ ను శాలువా, మొమెంటులతో సత్కరించారు.



## రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/బీబీనగర్ : భూభారతి రెవిన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను, క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖి నిర్వహించారు. జనన, మరణాల, ధృవీకరణ పత్రాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలని అన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వేగంగా క్లియర్ చేయాలి అన్నారు. సాదాబైనామ పరిష్కారానికి నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించలన్నారు. మండలంలో సర్వే కోసం దరఖాస్తులు ఎక్కువగా ఉండటం, సర్వే చేయడానికి, ఎక్కువ సమయం తీసుకోవడం, సర్వే చేసిన వాటిలో ఎక్కువ రిజెక్ట్ చేయడం వంటివి తన దృష్టికి రావడంతో మెమో జారీ చేయమని అధికారులు ఆదేశించిన జిల్లా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పోషన్ అభియాన్‌లో భాగంగా బీబీనగర్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో పోషణమాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరంఎం ఎల్‌ఎచ్‌పికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బీబీనగర్ మండలం గూడూరు పల్లె దవాఖానని ఆకస్మిక తనిఖీ చేయడంతో తాళం వేసి ఉండటంతో ఎంఎల్‌ఎచ్‌పికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

## టెక్స్‌టైల్ పార్కు సందర్శించిన అధికారులు



ప్రజాపక్షం/చౌటుప్పల్ : మండలంలోని దండు మల్కాపురంలోని టెక్స్ టైల్ పార్కును చేనేత జౌళి శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్వి రావు మంగళవారం సందర్శించారు. ఈ పార్కులో ఉత్పత్తి చేసిన వస్తువులను అమ్మకానికి ఏర్పాటుచేసిన ప్రదర్శనశాలను ఆయన పరిశీలించారు. ప్రఖ్యాత చిత్రకారిణి రిజిమ కళాఖండాలను తిలకించి ప్రశంసించారు. కళాకారుడు శ్రవణ్ వెదురుతో తయారుచేసిన ఉత్పత్తులను పరిశీలించారు. ప్రాచీన బాతిక్, బ్లాక్, స్క్రీన్, టై అండ్ డై పద్ధతులను నవీకరించి ప్రముఖ అష్ట కళాకారుడు కే. కృష్ణమూర్తి తయారుచేసిన వస్త్రాలను పరిశీలించి అభినందించారు. ఈ పార్కులోని మరమగాలపై దేవాలయాలకు సరఫరా చేయడానికి కండువాలను tgsco ద్వారా తయారు చేయిస్తున్నట్టు తెలిపారు. మరమగాలపై నేస్తున్న కండువాలను పరిశీలించారు. టెక్స్టల్ పార్కులో సౌకర్యాలు కల్పించాలని, నిర్వహణ బాధ్యతలను టీజీ ఐఐసీకి అప్పగించాలని ఐలా సర్వీస్ కమిటీ అధ్యక్షుడు ఎంకేడి ప్రసాద్ వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, ఐఐహెచ్‌టి సహాయ ప్రిన్సిపల్ కుమార్, సలహాదారు కోప్రసాచారి, చేనేత జౌళి శాఖ ఏడి శ్రీనివాసరావు, అభివృద్ధి అధికారి బాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజులుగా నీళ్ల కష్టాలు

ప్రజాపక్షం/నందికొండ: మున్సిపాలిటీ పైలాన్ కాలనీ లోని వార్డులలో గత ఏడు రోజులుగా నీటి మోటార్లు చెడిపోవడంతో కాలనిలో నీటి సరఫరాలేక కాలనీవాసులు విలవిలలాడుతున్నారు. దీనితో సహనం నశించిన కాలనీవాసులు బిందెలు, నీళ్ల డ్రమ్ములు, బకెట్లతో రోడ్డెక్కి రాస్తారోకోకు దిగారు. వీరికి మద్దతుగా మాజీ కౌన్సిలర్ హీరే కార్ రమేష్ జి నిలవడంతో రాస్తారోకో వేడెక్కింది. గత వారం రోజులుగా మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకునే నాధుడు లేడని ఈ విషయంలో ఎన్ఎస్పి అధికారులు చేస్తున్న నిర్లక్ష్యం దారుణమని రమేష్ జి అన్నారు. మోటార్లు చెడిపోతే రిపేరు చేయించి నీటి సరఫరా అందించాలన్ని కనీస బాధ్యత ఎన్ఎస్పి అధికారులు మరిచారని తక్షణమే ఎన్ఎస్పి అధికారులు మోటార్లను రిపేరు చేయించి కాలనీలో నీటి సరఫరా చేయాలని ఈ విషయంలో అలసత్వం వహించిన అధికారులపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సభావత్ చంద్రమౌళి,కొండలు, సైదులు, మన్సూర్, కోట్ల సైదులు, యూసుఫ్, అంజయ్య, రాములు, వెంకటేశ్వర్లు ఏడుకొండలు, లక్ష్మణ్, సిద్దయ్య, తిమ్మలు వెంకటేశ్వర్లు, రషీద్, కృష్ణ, సైదాబీ, వీణబాయ్ అరుణ, సులోచన, పద్మ, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఎసిబి వలలో విద్యుత్‌శాఖ లైన్‌మెన్



**ప్రజాపక్షం/వంగూర్ :** లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు పట్టుబడిన సంఘటన మండలపరిధిలోని మాచోనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఏసిబి అధికారి బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మాచోనిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజు తన వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కోసం గత ఆరునెలలనుండి విద్యుత్‌శాఖ అధికారులచుట్టూ తిరిగిన డబ్బులు ఇస్తేనే ట్రాన్స్‌ఫార్మర్ పెడతామని లైన్‌మెన్ నాగేందర్ రూ.20వేల రూపాయలు డిమాండ్ చేశారు. అంత డబ్బులు ఇవ్వలేమని రైతు రూ.15వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని పథకం ప్రకారం అవినీతిశాఖ అధికారులకు రైతు ఫిర్యాదు చేశారు. మంగళవారం మాటువేసి లంచం తీసుకుంటున్న లైన్‌మెన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అవినీతి నిరోధ క శాఖ డిఎస్‌పి బాలకృష్ణ తెలిపారు. విచారణ కోసం బుధవారం ఏసిబి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండల పరిధిలోని దేవరపల్లి గ్రామ శివారులో శ్రీరాంగనర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న జమ్ములమ్మ చెరువు నీటిలో అలుగు కట్ట వద్ద రైల్వేట్రాక్ పక్కన ఒక గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. ఇట్టి యువకునికి వయసు దాదాపు 40 నుండి 45 సంవత్సరాలుగా ఉండవచ్చును. మృతిని శరీరంపై ఎలాంటి బట్టలు లేవు గుర్తించుటకు కుడి కాలుకు నల్లటి దారం కలదని తెలిపారు. నీటిలో ఉన్న మృతదేహం ఒక్కే ఉన్నది ఎవరైన గుర్తించినచో ఆత్మకూరు ఎస్సై సెల్ నెంబర్ 8712670631 ఆత్మకూరు సిఐ శివకు మార్ నెంబర్ 8712670630కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## ఉచితంగా వేరుశనగ విత్తనాల పంపిణీ



**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట మండలం పలకపల్లి గ్రామంలో వేరు శనగ విత్తనాలు రైతులకు ఉచితంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అందజే శారు. గ్రామపంచాయతీ ఆవరణలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంటకు ప్రతిరైతుకు వందకి లోల వేరుశనగ విత్తనాలు ఉచితంగా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈవిత్త నాలు నేషనల్ ఆయిల్‌సీడ్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద విత్తనాలు పంపి ణీచేయబడుతున్నాయని తెలిపారు. గతంలో తామూ రైతులకు రైతుభరోసా ఇస్తూ రైతులను ఆదుకున్నట్లు తెలిపారు. రైతులు పంటలకు తక్కువ పెట్టు బడిపెట్టి ఎక్కువ లాభాలు గడించాలని, రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటల విస్తరణ, సమర్థవంతమైన సాగుపద్ధతులు, నీటివినియోగంపై అవ గాహన కల్పించేందుకు రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈఅ వకాశాన్ని వినియోగించుకొని అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో అచ్చంపేట మండలకాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, విజయ డైరీ అధ్యక్షుడు నర్సయ్యయాదవ్, వ్యవసాయ అధికారులు, మండలపార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మక్తల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



**ప్రజాపక్షం/మక్తల్ :** మాగనూరు మండల నేరేడ్గం గ్రామంలోని శ్రీ సిద్ధ లింగేశ్వర విద్యాలయం విద్యార్థులు మంగళవారం మక్తల్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భనలో విద్యార్థులకు పోలీస్ శాఖ దినచర్య, విధులు, పనితీరు, పోలీస్ స్టేషన్లో జరిగే వివిధ కార్యకలాపాలు విద్యార్థు లకు వివరించారు. వైర్లెస్ సెట్ ద్వారా మాట్లాడే విధానం, పోలీసు లాకప్, ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ విధానం, పహారా డ్యూటీలు, సీసీ కెమెరాల పనితీరు, సీసీ కెమెరా మానిటరింగ్ సిస్టమ్, డయల్ 100 సేవలు, మహిళా భద్రత చర్యలు, పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదుదారులకు రిసెప్షన్‌లో విధంగా రిసీవ్ చేసుకుంటారు. పోలీస్ చట్టాలపై అవగాహన తదితర అంశాలను ప్రాక్టి కల్‌గా చూపించి విద్యార్థులకు అవగాహన కల్పించిన మక్తల్ సీఐ రామ్‌లాల్ ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర పరిస్థి తుల్లో పోలీసులు ఎలాంటి వేగవంతమైన చర్యలు తీసుకుంటారో, ఫిర్యా దులు వచ్చిన వెంటనే స్పందించే విధానం, సంఘటన స్థలానికి చేరుకో వడం. విద్యార్థులు లేదా గ్రామ ప్రజలు ఎటువంటి అనుమానాస్పద సంఘ టనలు గమనించినా, అపరిచితులను చూసిన ధైర్యంగా పోలీసులకు సమా చారం ఇవ్వాలని సూచించారు. మహిళా ఎస్సై రేవతి, మక్తల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సన్మానం

**ప్రజాపక్షం/మాగనూర్:** నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన డి.నందినిని ముదిరాజ్ సంఘ నాయకులు మంగళవారం శివాలయం దగ్గర ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ నందిని మంచి ప్రజ్ఞశాలని, క్రమశిక్షణ కలిగిన విద్యతోనే నీట్ యూజీ పరీక్షలలో 455 మార్కులు సాధించి మెడికల్ సీట్ సాధించు కున్నందుకు అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. విద్యార్థినిని ప్రోత్సా హిస్తూ ముందు చదువులు చదివిస్తున్న నందిని తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఎంబిబిఎస్‌లో శ్రద్ధతో చదివి, వైద్యురాలిగా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం కృషి చేయాలి

**ప్రజాపక్షం/మద్దూర్ :** పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రోజు కుష్టు వ్యాధి నివారణ బృందం సందర్శించారు. ఈ సంధర్బంగా జేఎండి సంపత్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఏఎన్ఎం ,ఆశావర్కర్లకు కుష్టు వ్యాధి నివారణ పట్ల తీసుకొవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.ఈ వ్యాధిని ప్రాథమిక దశ లోనే గుర్తించి ఎంటిడి డ్రగ్స్, మాత్రలను వాడితే నిర్మూలించడంతో పాటు అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు అన్నారు. అలాగే కుష్టు వ్యాధి సమాజం కొరకు వైద్య సిబ్బందితో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యాక్రమంలో కుష్టు వ్యాది నివారణ రాష్ట్ర సభ్యులు డిప్యూటి పిఎమ్‌ఓలు వెంకటేశ్వర చారి, సకల రెడ్డి, సురేందర్, జిల్లా అధికా రులు డిప్యూటి పీఎంఓ శ్రీనివాస్ ,వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కేసులో పారదర్శకత తప్పనిసరి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి సూచ నలను సంక్షిప్తంగా వివరిస్తూ, జిల్లా పోలీసు వ్యవస్థలో వాటి అమలు కోసం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ''మన ప్రధాన లక్ష్యం ప్రజలకు భద్రత, న్యాయం, నమ్మకం కల్పించడం. ప్రతి పోలీసు స్టేషన్ స్థాయిలో పారదర్శ కత, క్రమశిక్షణ, సమయపాలన ఉండాలి'' అని అన్నారు. ఎస్పీ ప్రతి విభాగం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తూ. వారెంట్లు పెండింగ్ ఉన్న వాటిని ప్రాధాన్యతగా అమలు చేసి, ప్రతి వారానికి నివేదిక సమర్పించాలి.

## ప్రతి కార్యకర్తను కలుపుకుపోయే నాయకుడికి డిసిసి పదవి

ఏఐసిసి జిల్లా అబ్జర్వర్ నారాయణ స్వామి



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** జిల్లాలో ప్రతి కార్యకర్తను కలుపుకుపోయే నాయకుడికి డిసిసి అధ్యక్ష పదవి కేటాయిస్తామని పాండిచ్చేరి మాజీ ముఖ్య మంత్రి ఏఐసిసి జిల్లా అబ్జర్వర్ నారాయణ స్వామి అన్నారు. జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఏఐసిసి అబ్జర్వర్ పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి తో పాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి మాట్లాడుతూ ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు భారత్ జోడో యాత్ర ప్రారంభించడం జరిగిం దని ఈ యాత్రలో ప్రతి పేద కుటుంబాన్ని తో పాటు మహిళలను యువకు లను వివిధ వర్గాల వారిని కలిసి సాధక బాధలు తెలుసుకున్నారని వార న్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కింది స్థాయి నాయకులకు ప్రజల సమస్యల పరిష్కారమే తమ అసలైన ధ్యేయమని నేతలు స్పష్టం చేశారు. రైతులు, కూలీలు, యువత, మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజల మధ్యకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని వారు పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు, రైతులకు సమయానికి నీరు, ఎరువులు, సబ్సిడీలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని గుర్తు చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పాదయాత్రలు అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచిం చారు. ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరవేయాలని, ప్రజల విశ్వాసాన్ని సంపాదించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, పిసిసి రాష్ట్ర కార్యదర్శి సంధ్యారెడ్డి, పెండెం మన్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ముఖ్యమంత్రిని స్వాగతం పలికిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి...**

పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఏఐసిసి జిల్లా అబ్జర్వర్ నారాయణస్వామిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, ఏఐసీసీ అబ్జర్వర్ నారాయణస్వామి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆయనను మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సంద ర్భంగా వనపర్తి నియోజకవర్గ పరిధిలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, సింగిల్ విండో అధ్యక్షులు, యూత్ నాయకులు, పట్టణ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొని నారాయణస్వా మిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గ అభి వృద్ధి, పార్టీ బలోపేతం, రాబేయే ఎన్నికల వ్యూహాలపై సమగ్రంగా చర్చించు కున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తత్వాలు, ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పనిచేయాలని నారాయణ స్వామి సూచించారు.

## విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు


కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమంపై జరుగుతున్న చర్యల వివరాలను జిల్లా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా కలెక్టర్ సమగ్రంగా వివరించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సమస్యలపై రాష్ట్ర ఎస్సి, ఎస్టి సంక్షేమశాఖల మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, రాష్ట్ర ఉన్నతాధికారులతోక లిసి జిల్లాల కలెక్టర్లతో మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్ట రేట్ వీడియో సమావేశ మందిరం నుండి, బిసి, ఎస్సి, మైనార్టీ, ట్రైబల్‌కార్పొ రేషన్ , సంబంధితశాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సం తోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్‌శాఖపరిధిలో మొత్తం 8బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు పనిచేస్తున్నా యని, వీటిలో 208మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. సామాజిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న 9బెస్ట్ అవైలబుల్ పాఠశా లల్లో 1159 మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. విద్యార్థుల సంక్షేమందృష్ట్యా ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సక్రమంగా ఉప యోగపడుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి సమస్యలులే వని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు వసతి, భోజనం, విద్యా సౌక ర్యాలు అన్ని సమృద్ధిగా అందుతున్నాయని, పాఠశాలల నిర్వహణ సక్ర మంగా జరుగుతుందని వివరించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరు గుపర్చడంలో, విద్యార్థుల సంక్షేమంకోసం అన్నివిధాల సహకరిస్తున్నట్లు కలెక్టర్ ఉపముఖ్యమంత్రికి తెలిపారు. జిల్లాగిరిజన అభివృద్ధిశాఖ అధికారి ఫిరంగి, జిల్లామైనార్టీ సంక్షేమశాఖ అధికారి గోపాల్‌నాయక్, సాంఘికసంక్షే మశాఖ పర్యవేక్షకురాలు రాగమణి, కవిత పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందిపై దాడులు సేవ నిరతికే కళంకం

డాక్టర్ రంగా అజ్మీర జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు ఊపిరి పోస్తున్న డాక్టర్లపై వైద్య సిబ్బందిపై దాడులు దౌర్జన్యాలు యావత్ సేవ దృక్పథ నిరతికే తీవ్రమైన కళంకం అని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా అన్నారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహసభలలో రాష్ట్ర గౌరవ అధ్యక్షు లుగా ఎన్నికైన ఎం.మధుసూదన్ రెడ్డిలకు మంగ ళవారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసు పత్రి సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సూపరింటెండెంట్ డా.రంగా మాట్లాడుతూ సేవ రంగంలోనే అత్యు న్నతమైనది వైద్య రంగమని వైద్య రంగం లేక పోతే సమాజ ఆరోగ్య అభివృద్ధి శూన్యమని అన్నారు. వైద్యులపై సిబ్బందిపై భౌతిక దాడులు ఈ మధ్యకాలంలో పెరిగిపోతున్నాయని ఇలాం టి ధోరణి మంచిది కాదని అన్నారు. సత్యనారా యణరెడ్డి మధుసూదన్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో ఉన్నత పదవులు పొందడం ఎంతో సంతోషించే విషయ మని అన్నారు. వామపక్ష భావజాలంతో పనిచే స్తున్న ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ ఎంప్లా యిస్ యూనియన్ నేతృత్వంలో సత్యనారాయణ రెడ్డి మధుసూదన్‌రెడ్డి వైద్య ఉద్యోగుల హక్కులకై పోరాటం చేస్తూ ఉద్యోగుల తలలో నాలిక వలె ఉన్నారని కొనియాడారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరం గంలో పని చేస్తున్న రెగ్యులర్ ఎంప్లాయిస్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కార్మి కుల సంక్షేమానికై ప్రత్యేక సమగ్ర విధానం ప్రక టించాలని కోరారు. మహబూబ్‌నగర్ ఆసుప త్రిలో 28 సంవత్సరాలు సుదీర్ఘంగా అనేక మంది వైద్యాధికారులతో పనిచేశానని ఇక్కడే సత్కారం జరగడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ అనస్తీ సియా విభాగ హెచ్ఓడి డా. మాధవి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రేరణ, నర్సింగ్ సూపరింటెండెంట్ అల్బిన, సునీత, సుజాత, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు కోటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, కిషోర్, భాస్కర్, వరప్రసాద్, సిహెచ్ఓ వెంకటేశ్, వెంకటేశ్వర రెడ్డి, కురుమయ్య, కర్ణ, సతీష్ రెడ్డి, గోపాల్ నాయక్, సత్యం, చెన్నయ్య, రంగయ్య, దేవానంద్, బాలకోటి, అంజి, యాద య్య, రామ కృష్ణ, నైసన్, భీమయ్య, జగ్గా నాయ క్, కొండయ్య, బాలరాజు, శంకర్, ప్రశాంత్, గోవ ర్ధన్, ప్రవీణ్, నర్సింగ్ ఆఫీసర్స్ ప్రవళిక రెడ్డి, శ్రావణి, కార్మికులు వరలక్ష్మి మంజుల, ఇంది రా, జ్యోతి, మల్లమ్మ, లక్ష్మి , చంద్రకళ, సునీత, బుజ్జి, బాలమణి, మమత, అలివేల, లక్ష్మి , బాల మణి పాల్గొన్నారు.

## సిఎంఆర్ ధాన్యాన్ని అప్పగించని వారిపై చర్యలు

అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**ప్రజాపక్షం/వనపర్తి :** గత ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఎఫ్.సి.ఐ అప్పగించాల్సిన ధాన్యా న్ని యుద్ధ ప్రాతిపదికన అప్పగించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్ రైస్ మిల్ల ర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం అద నపు కలెక్టర్ తన ఛాంబర్‌లో సివిల్ సప్లై అధికా రులు, రైస్ మిల్లర్లతో సమావేశాన్ని నిర్వహిం చారు. గత ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుండి ధాన్యం సేకరించి రైస్ మిల్లర్లకు అప్పగించిన వడ్లు ఎన్ని, ఇప్పటి వరకు ఎంత బియ్యం అప్పగించారు అనే వివరాలను సమీక్షించారు. 202425 ఖరీఫ్ సీజ న్‌లో జిల్లాలోని మిల్లర్ల నుండి రావాల్సిన సి.యం.ఆర్ ధాన్యం 95,909 మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటి వరకు 80,815 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించడం జరిగింది. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఇంకా 15,094 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించాల్సి ఉంది. రబీ సీజన్ కు సంబంధించి 1,57,796 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 61,710 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించడం జరిగింది. ఇంకా 96,697 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుండి రావాల్సి ఉంది. గత ఖరీఫ్ సీజన్‌కు సంబందించి ఎఫ్.సి.ఐకి అప్పగించా ల్సిన ధాన్యం గడువును నవంబర్ 12 వరకు పొడిగించిన నేపథ్యంలో పెండింగ్ ఉన్న సి.యం. ఆర్ ధాన్యం ఎఫ్.సి.ఐకు సివిల్ సప్లైకు అప్పగించా ల్సిన ధాన్యం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌కు సంబం ధించిన బియ్యాన్ని సైతం యుద్ధ ప్రాతి పదికన మిల్లింగ్ ఆడించి ధాన్యం అప్ప గించాలని ఆదేశించారు. మిల్లింగ్ ఆశించ కుండా, బియ్యం అప్పగించకుండా ఎంచేస్తున్నా రని మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వా నికి అప్పగించాల్సిన ధాన్యం అప్పగించకుంటే బ్లాక్ లిస్టు లో పెట్టడమే కాకుండా రెవెన్యూ రిక వరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. జిల్లా సివిల్ సప్లై అధి కారి విశ్వనాథ్, డి.యం సివిల్ సప్లై అధికారి జగ న్మోహన్, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## బేషరతుగా ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

బిసి సంఘాల నేతలు

మాజీ శాసనసభ్యులు ఎర్రశేఖర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఇసుక మాఫియాను నడి పారా, రియల్ ఎస్టేట్ పేరుతో పేదల భూములు లాక్కున్నారా, నియోజకవర్గ ప్రజలను ఎప్పుడైనా భయభ్రాంతులకు గురి చేశారా, ప్రభుత్వ భూములను ఏమైనా లాక్కున్నారా మూడు దఫా లుగా జడ్చర్ల నియోజకవర్గం శాసనసభ్యులుగా నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేసిన గొప్ప నేతగా ఆయనకు పేరు ఉందని అలాంటి నేత బీసీ అయి నందుకు అగ్రకుల అహంకారం తట్టుకోలేకపో తుందా ఆయన ఎక్కడ ఫ్యాక్షనిజం చేశారో మీపై ఎప్పుడు దాడి చేశారో రుజువు చేస్తారాని జడ్చర్ల శాసనసభ్యులు అనిరుధ్‌రెడ్డిని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. మాజీ శాసనసభ్యులు ఎర్రశేఖర్‌పై ఆరోపణల ను వెనక్కి తీసుకుని బహి రంగ క్షమాపణ చెప్పాలని, బీసీ కుల సంఘాల నాయకులు డిమాండు చేశారు. పట్టణంలోని అంబేద్కర్ కళాభవనంలో ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో బీసీ జాగృతిసేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ , ఎల్‌హెచ్‌పిఎస్ నాయ కులు చింతకుంట రవి నాయక్, మన ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల నరసిం హులు ముదిరాజ్‌లు మాట్లాడుతూ జడ్చర్ల నియో జకవర్గం మూడు దఫాలు శాసనసభ్యులుగా బాధ్యత వహించిన ఎర్రశేఖర్, సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పని చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్తులు అక్రమణలకు గురికాకుండా కాపాడారని ప్రజా సంక్షేమం కోసం పనిచేశారని తెలిపారు. తన స్వప్రయోజనం కోసం అధికా రాన్ని వాడుకున్న దాఖాలాలు లేవని ఆయన ఫ్యాక్షనిజం ఎక్కడ చేశారో నిరూపించాలని డిమాండ్ చేశారు. జడ్చర్ల నియోజకవర్గం ప్రజల్లో అజాతశత్రువుగా, అందరివాడిగా పేరుపొందిన గొప్ప ప్రజానేత ఎర్రశేఖర్ ని అన్నారు. ఎర్రశేఖర్ ఫ్యాక్షనిస్తు అని అతను పార్టీలోకి వస్తే, తనకు ప్రాణహాని ఉంటుందని అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఏ రకంగానూ మీరు ఆయనకు సరికాదని ఇది రాజరిక వ్యవస్థ కాదని ప్రజాస్వామ్య దేశంలో ఇష్టం వచ్చిన పార్టీలో చేరే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందని అన్నారు. మీడియా ముఖంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేని యెడల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్ర మాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో మాచారం చారి, లింగంపేట శేఖర్, మాచారం శ్రీనివాస్ బోలేమోని నిరంజన్, గొడుగు నరసింహులు, అనిల్, వెంకటేశ్, పరుశ దేది, గుండు వెంకటేశ్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు త్వరలో నిధులు అందిస్తాం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఇందిరమ్మ ఇండ్ల సమస్యలపై త్వరలోనే తీరుస్తా మని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రగృహ నిర్మాణశాఖ హౌజింగ్ గృహశాఖ అధికారులతో చర్చించామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లస్థాయిని బట్టి బిల్లులు తయారయ్యాయని త్వరలో లబ్ధిదారు లకు నిధులు అందుతాయని, ఎవరూకూడా ఇబ్బంది పడొద్దని, అపోహాలు చెందవద్దని అన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డిఇ, ఏఈలతోపాటు అచ్చం పేట నియోజకవర్గపు ఎంపిడిఓలు, టెక్నికల్ అధికారులు పాల్గొన్నారు.

## యాప్‌పై రైతులకు అవగాహన



కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ కొత్తగా తీసుకువచ్చిన కపాస్ కిసాన్ యాప్ గురించి జిల్లా రైతులకు అవగాగాహన కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖకు సంబంధించి వరి ధాన్యం, పత్తి కొనుగోళ్ల మద్దతు ధరలను తెలిపే గోడ ప్రతులను మంగళవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో కొత్త యాప్ విధానాన్ని అమలు చేయడం ద్వారా మిల్లుల వద్ద పత్తి రైతులు నిరీక్షించే పరిస్థితి ఉండదని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్న రైతులు వారం రోజుల లోపు ఎప్పుడైనా పత్తిని మిల్లులకు తీసుకెళ్లి విక్రయించుకోవచ్చని ఆమె చెప్పారు. జిల్లాలో ఈసారి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వరి ధాన్యం, పత్తి కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి బాలామణి, సివిల్ సప్లై డీ.ఎం. సైదులు, డి.ఎస్,వో బాల్ రాజ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతి, సూపర్ వైజర్ లక్ష్మ ణ్ పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన న్యాయవాదులు



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** జిల్లా నూతన ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళ వారం రోజు జిల్లా ఎస్పీ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు, ఆకుల బాలప్ప, మేనుశ్రీ, ప్రభాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మా నించి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ మరియు న్యాయవ్యవస్థ (ప్రాసెక్యూషన్ డిపార్ట్ మెంట్)మధ్య సత్సంబంధాలు కొనసాగి, కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంలో సమన్వయం కీలకమని, కేసులు త్వరగా పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ఎస్పీ తెలిపారు. న్యాయవ్యవస్థలో పీపీలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, వారితో సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

## వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్పి తనిఖీ



**ప్రజాపక్షం/ వనపర్తి :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల బాధితులకు పోలీసు అండగా ఉన్నారనే నమ్మకం, భరోసా కల్పిస్తూ వారి పట్ల అధికా రులు, సిబ్బంది మార్యాదపూర్వకంగా వ్యవహారించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిదర్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పరిధిలోని వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలలో భాగంగా వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ చేరుకున్న ఎస్పీకి పోలీసు అధికారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో రికార్డ్స్‌ను, పరిసరాలను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ రిసెప్షన్, లాకప్, మెన్ బ్యారేక్, టెక్నికల్ రూం, పరిసరాలను పరిశీలిం చారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి. పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను వనపర్తి పట్టణ ఎస్సై హరిప్ర సాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వార్డుకు పోలీసు అధికారిని కేటాయించి విపిఓ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ గ్రామాలకు సంబంధించిన విపిఓలు రోజు గ్రామా లను సందర్శించి అక్కడ ప్రజలతో స్నేహపూర్వకమైన సంబంధాలు కొనసా గించాలి ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం జరగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ, కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతి రెడ్డి, వనపర్తి పట్టణ 2వ ఎస్సై, శశిధర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## 'ఐయామ్ ది గాయ్' పాట విడుదల

విష్ణు విశాల్ స్టూడియోస్, శుభ్ర, ఆర్యన్ రమేష్‌లతో కలిసి నిర్మించిన 'ఆర్యన్' అనే గ్రిప్పింగ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రవీణ్ కె దర్శకత్వం వహించారు. 'ఐయామ్ ది గాయ్' అనే సాంగ్ రిలీజ్ చేశారు. జిబ్రాన్ స్వరపరిచిన ఈ పాటనకు సామ్రాట్ సాహిత్యం అందించారు. జిబ్రాన్, శ్రీకాంత్ హరిహరన్ పాడారు. ఆర్యన్ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. హీరో నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో శ్రేష్ట్ మూవీస్ ద్వారా విడుదల చేయనున్నారు. అనేక బ్లాక్ బస్టర్లను అందించిన ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ బ్యానర్ మద్దతుతో ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. శ్రేష్ట్ మూవీస్ గతంలో విక్రమ్, అమరన్, థగ్ లైఫ్ వంటి చిత్రాలను విడుదల చేశారు. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు.

## సందీప్ కిషన్ హీరోగా 'సూపర్ సుబ్బు' సిరీస్



సందీప్ కిషన్ హీరోగా రూపొందిన కొత్త సిరీస్ 'సూపర్ సుబ్బు'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ 2026లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ 'సూపర్ సుబ్బు' ఆలోచన ఒక అబ్జర్వేషన్ నుంచి పుట్టింది. సుబ్రహ్మణ్యం అనే పాత్ర ద్వారా అవగాహన ఎలా కలిగిస్తారో చూపించాలనుకున్నాం అన్నారు. నటి మిథిలా పాల్కర్ మాట్లాడుతూ సూపర్ సుబ్బు కామెడీ, భావోద్వేగాలు, కుటుంబ బంధాలు అన్నీ కలగలసిన కథ. సుబ్బు అనే దురదృష్టపు యువకుడు చిన్న పట్టణ వాస్తవాలతో, కఠినమైన తండ్రితో ఎలా పోరాడతాడో ఈ సిరీస్ చెబుతుంది అన్నారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ ఇప్పుడు మనం ఒక అందమైన కథా కాలంలో ఉన్నాం. కథలు మరింత ధైర్యంగా, భావోద్వేగంగా, మన జీవితాల్లో భాగంగా అనిపించేలా మారాయి. 'సూపర్ సుబ్బు' కథ విన్న వెంటనే ఇది చెప్పదగ్గ నిజమైన కథ అని నమ్మాను. ప్రేక్షకులు ఈ కథను ప్రేమిస్తారని అనిపించింది. పాత్రల ఉత్సాహం, రచనలోని హాస్యం.. ఇవన్నీ సిరీస్ మొత్తాన్ని చిరునవ్వుతో నింపుతాయి. ఈ సిరీస్‌కు రాజీవ్ చిలకా, నిర్మాతగా వ్యవహరించారు.



## 'మిత్ర మండలి' నచ్చకపోతే.. నా సినిమాలు చూడకండి

### ప్రీ రిలీజ్ వేడుకలో ప్రియదర్శి

బివి వర్క్స్ బ్యానర్ మీద బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్ మీద కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, డా. విజేందర్ రెడ్డి తీగల నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ మూవీలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం హీరో హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమాకు విజయేందర్ దర్శకత్వం వహించారు. బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, సత్య, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, విటివి గణేష్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని 16న విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో శ్రీ విష్ణు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీ విష్ణు 'తిప్పరామీసం' టైంలో విజయ్ ఏడీగా పని చేశారు. 'మిత్ర మండలి' పెద్ద హిట్ అవుతుంది. విజయ్ కోసం ఫ్రెండ్స్ అందరూ ఇలా వచ్చి సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. రాగ్ మయూర్, విష్ణు, ప్రసాద్ ఇలా అందరూ నాకు ఇష్టం. ప్రియదర్శి ఎప్పుడూ ఎనర్జీగానే ఉంటాడు. ఆయన మంచి కథల్ని ఎంచుకుంటూ ఉంటాడు. కాబట్టే నేడు (15) ప్రీమియర్లు వేస్తున్నారు. ఈ మూవీని మైండ్‌తో కాకుండా, మనసుతో చూడండి. అందరినీ నవ్విస్తుంది. నేను ఈ చిత్రాన్ని చూశాను. చాలా సీక్వెన్స్‌లు అదిరిపోయాయి. 'మిత్ర మండలి' ఫుల్లుగా ఎంటర్టైన్ చేసి థియేటర్ నుంచి బయటకు పంపించేస్తుంది' అని అన్నారు. ప్రియదర్శి మాట్లాడుతూ ఈ చిత్రం మీకు నచ్చకపోతే.. నెక్స్ట్ వచ్చే నా ఏ సినిమాని కూడా చూడకండి. 'మిత్ర మండలి'తో దీపావళిని మేం మీ కోసం ముందుగానే తీసుకు వస్తున్నాం. 16న ఫ్రెండ్స్, ఫ్యామిలీతో వెళ్లి మా చిత్రాన్ని చూడండి' అని అన్నారు. బన్నీ వాస్ మాట్లాడుతూ ప్రియదర్శి నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టమైన వ్యక్తి. 'మిత్ర మండలి' చిత్రం చాలా బాగా వచ్చింది. దీపావళికి ఫ్యామిలీని నవ్వించే క్లీన్ ఎంటర్టైనర్. అందరినీ హాయిగా నవ్వించే మా సినిమాను 16న రిలీజ్ చేస్తున్నాం. అందరూ వచ్చి మా మూవీని చూసి ఎంజాయ్ చేయండి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విజయేందర్ , నిర్మాత భాను ప్రతాప, నిర్మాత డా.విజేందర్ రెడ్డి తీగల, సంగీత దర్శకుడు ధృవన్, దర్శకులు అనుదీప్ కేవీ, కళ్యాణ్ శంకర్, వివేక్ ఆత్రేయ, ఆదిత్య హాసన్ పాల్గొన్నారు.

## మా మధ్య విభేదాలు లేవు

### 'కే -ర్యాంప్' నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద రైజింగ్ ప్రొడ్యూసర్ రాజేశ్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'కెర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా నిర్మాతలు రాజేశ్ దండ, శివ బొమ్మకు మీడియాతో 'చిట్ చాట్' నిర్వహించారు. రాజేష్ మాట్లాడుతూ కిరణ్ అబ్బవరంతో ఒక సినిమా చేయాలి. రూల్స్ రంజన్ తర్వాత మా కాంబోలో ఒక సినిమా చేయాలని నిర్ణయించాం. దర్శకుడు జైన్స్ నాని కిరణ్‌తో ఏడాదిన్నరగా ట్రావెల్ చేస్తున్నారు. ఆయన చెప్పిన కథ నచ్చి నా దగ్గరకు పంపించారు. కేరళలో షూటింగ్ చేయడం వల్ల సినిమాకు కొత్త లుక్ వచ్చింది. ప్రొడ్యూసర్స్ అంతా స్నేహితులమే. మా మధ్య విబేధాలు లేవు. చేతన్ భరద్వాజ్ ది బెస్ట్ మ్యూజిక్ ఇచ్చారు. మా బ్యానర్‌లో వచ్చిన చిత్రాల్లో ఇంటర్వెల్ సర్‌ప్రైజ్ చేస్తుంది. శివ బొమ్మకు నా స్నేహితుడు. ఈ చిత్రంతో నాతో పాటు ప్రొడక్షన్‌లో భాగమయ్యారు. నా మీద నమ్మకంతో కథ కూడా వినకుండా పార్టనర్‌గా చేసేందుకు ముందుకొచ్చారు. మా కాంబినేషన్‌లో ఇకపై మరిన్ని మూవీస్ చేయబోతున్నాం. ప్రొడ్యూసర్ శివ బొమ్మకు మాట్లాడుతూ దీపావళి పండక్కి మీ అందరి ముందుకు 'కే ర్యాంప్' సినిమాతో వస్తుండటం సంతోషంగా ఉంది. ఈ కథ విన్నప్పుడు చాలా ఎంటర్‌టైనింగ్‌గా అనిపించింది. ఈ కథను ఎంతో మెచ్యూర్డ్‌గా తెరకెక్కించారు మా డైరెక్టర్ నాని. ప్రొడ్యూసర్ రాజేశ్ తో కలిసి కంఫర్ట్‌గా ఈ మూవీకి ప్రొడక్షన్ చేశాం. కుమార్ పాత్రలో హీరో కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్‌గా పర్ ఫార్మ్ చేశారు. ఆయనను ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. సినిమా కంప్లీట్‌గా ఎంటర్ టైన్ చేస్తుంది. ప్రొడక్షన్ టైమ్‌లోనే ఈ సినిమా తప్పకుండా సక్సెస్ అవుతుందనే నమ్మకం కలిగింది. మ్యూజిక్, ఎడిటింగ్, డీవోపీ..ఇలా మా టీమ్ లోని వాళ్లంతా సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారు. హీరోయిన్ క్యారెక్టర్ సర్‌ప్రైజ్ చేస్తుంది. నరేష్, వెన్నెల కిషోర్ పాత్రలను ప్రేక్షకులు గుర్తుపెట్టుకుంటారు అని అన్నారు.



## మీసాల పిల్లా పాట విడుదల




మెగాస్టార్ చిరంజీవి హీరోగా, నాయన తార హీరోయిన్‌గా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మనం శంకర వరప్రసాద్ గారు సినిమా నుంచి మీసాల పిల్లా అనే పాటను ఆవిష్కరించారు. భార్య భర్తల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు నేపథ్యంలో ఈ పాటను చిరంజీవి, నయన తార పై చిత్రీకరించారు. భాస్కర పట్ల రచించిన ఈ పాటను ప్రముఖ గాయకుడు ఉదిత్ నారాయణ, శ్వేత మోహన్ కలిసి ఆలపించారు. పోలంకి విజయ్ ఈ పాటకు నృత్య దర్శకత్వం వహించారు. వచ్చే యేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిరంజీవి సరసన క్యాథరిన్ తెరిసా కీలక పాత్ర పోషిస్తోంది. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## కొన్ని సీన్స్ సవాల్‌గా అనిపించాయ్

### 'చిట్‌చాట్'లో మమిత బైజు



'ప్రేమలు' సినిమా విజయం తర్వాత ప్రదీప్ సరసన మమిత బైజు నటిస్తున్నారు. ఈ నెల 17న తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మమిత బైజు మీడియాతో చిట్ చాట్ చేశారు. ప్రేమలు రిలీజ్ తర్వాత మేకర్స్ నన్ను సంప్రదించారు. ఆ తర్వాత డైరెక్టర్‌తో మీటింగ్ జరిగింది. కీర్తి తొలిసారిగా నన్ను సంప్రదించినప్పుడు, కథను చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. కాన్సెప్ట్ కూడా చాలా ఆసక్తికరంగా అనిపించింది.ఆ కథలో నా పాత్రకు చాలా ప్రాధాన్యత వుంది. కురల్ పాత్రలో చాలా డిఫరెంట్‌గా వుంటుంది. ఇప్పటివరకూ అలాంటి పాత్ర చేయలేదు. కురల్ చాలా హానెస్ట్ క్యారెక్టర్. ఆమె తన భావోద్వేగాల పట్ల నిబద్ధతగా ఉంటుంది, చుట్టూ ఉన్న వారందరితో స్నేహంగా వుంటుంది. ఆమె చాలా సూటిగా మాట్లాడుతుంది. ఆ పాత్ర చేయడం నాకు మంచి అనుభవానిచ్చింది. ఈ సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్ నాకు సవాలుగా అనిపించాయి. ఆ సీన్స్ కోసం నేను రాత్రంతా డైలాగ్స్ ప్రాక్టీస్ చేశాను. షూట్ సమయంలో వాటి గురించి ఆందోళన లేకుండా సీన్ మీద ఫోకస్ చేశా. నేను ఎప్పుడూ షూట్‌కు ముందు బాగా ప్రిపేర్ అయి ఉండాలని చూసుకుంటాను. అందుకే ఇది నాకు ఒకేసారి సవాలుగా, ఉత్సాహంగా అనిపించింది. ప్రదీప్ రంగనాథ్ తో నటించడం మంచి ఎక్స్ పీరియన్స్. ఆయన మల్టీ ట్యాలెంటెడ్ సెట్స్‌లో చాలా హెల్ప్‌ఫుల్‌గా వుంటారు. శరత్ కుమార్ లాంటి సినియర్ యాక్టర్స్‌తో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. డైరెక్టర్ కీర్తి ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశారు. ఇందులో వుండే ఎమోషన్స్ ఫన్ చాలా యూనిక్‌గా వుంటాయి. సాయి అభ్యంకర్ మ్యూజిక్ ఈ సినిమాకి బిగ్ ఎసెట్. పాటలు మనసుని ఆకట్టుకుంటాయి. నేపథ్య సంగీతం కూడా అద్భుతంగా వుంటుంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. చాలా పాషనేట్ ప్రొడ్యూసర్స్. సినిమాని చాలా గ్రాండ్‌గా తీశారు. తప్పకుండా ఈ సినిమా అందరినీ అలరిస్తుంది.

## న్యాయం జరుగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

విచారణకు రావచ్చునని ఆయన వివరించారు. ఢిల్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల జీఓపై పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ, జీఓ 9పై స్టే విధిస్తూ, పాత విధానంలో ఎన్నికలకు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చిందని, హైకోర్టు తీర్పు బాధాకరమన్నారు. అయినప్పటికీ బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీతో ప్రత్యేకంగా సమావేశం అయ్యానని తెలిపారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో రెండు చట్టాలు చేసినప్పుడు అన్ని పార్టీలు ఏకమై మద్దతు పలికాయని, బిజెపి, బిఆర్ఎస్‌లు ఇప్పుడు మాట మార్చి వ్యతిరేకిస్తున్నాయని విమర్శించారు. ఓబిసిల జీవితాలు బాగుపడాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలకు అడుగడుగునా బిజెపి, బిఆర్ఎస్‌లు వ్యతిరేకిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఢిల్లీకి తీసుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

సైతం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయంలో మద్దతు ఇచ్చి, ఇప్పుడు గవర్నర్ వద్ద పెండింగ్‌లో పెట్టించి అడ్డుకుంటున్నారని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కోసం సిపిఐ పోరాడుతుందని, హైకోర్టు కేసులో ఇంప్లీడ్ అయ్యిందని సాంబశివరావు తెలిపారు. వెనుకబడిన తరగతుల (బిసి) కు 42 శాతం రిజర్వేషన్‌పై కాలయాపన చేస్తున్న బిజెపి ద్వంద వైఖరి పట్ల ఈ నెల 15వ తేదీన బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో తలపెట్టిన జిల్లా, మండల కేంద్రాలలో రాస్తారోకో, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బిసి సంఘాల జెఎసి ఈ నెల 18న ఇచ్చిన రాష్ట్ర బంద్ పిలుపునకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని అన్నారు. ఈ బంద్‌లో సిపిఐ కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.









## ధరలు పైపైకి

(మొదటి పేజీ తరువాయి)

ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఆ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి.

### అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ రేట్లు

ఇంటర్నేషనల్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ బంగారం ధర 3,900 డాలర్లు దాటింది. యుఎస్‌లో స్పాట్ గోల్డ్ ధర ఆల్‌టైమ్ రికార్డ్ హై 3,924.39 డాలర్లకు పెరిగి, తరువాత 3,922 డాలర్ల వద్ద స్థిరపడింది. మొత్తంగా చూసుకుంటే, గత కొన్ని నెలలో బంగారం ధర 50 శాతం మేర పెరిగింది. అంతేకాదు ఇకపై కూడా పసిడి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఔన్స్ బంగారం ధర ప్రస్తుత స్థాయి నుంచి ఏకంగా 4,800 డాలర్లకు పెరిగే అవకాశం ఉందంటున్నారు. అంటే బంగారం ధర 26 శాతానికిపైగా పెరిగే ఛాన్స్ ఉందని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com